# కవితా సంహిత

రచన

నందూరి రామ కృష్ణమాచార్య

నందూరి రామ కృష్ణమాచార్య కవికి

# స్వాగత పత్రము

రచన : శ్రీ మహాకవి మానాప్రగడ శేషశాయి

శిష్య వాత్సల్య పుష్కలావర్తకం
ఉగాది దోగాడి ఈ వార వాలిందా!
పద్య సుందరీ బాలేందు ఫాలస్థలీ కుంకు
మాంకం పాంకంగా మా పురవీథి నలంకరించినదా !
భారతామ్నాయ పారిజాత సౌగంధ్యాలు
దిశా మందిరాలకు పందిరు లల్లాయా!
బహుకావ్య రసావగాహ పచేళిమస్వాంతం -
దోర వెన్నెల - దాంతర లీ ప్రాంతంలో పరచిందా!

కవితా కల్హారాలు - సౌగంధికాలు, సన్నజాజులు- విరజాజులు తారాతోరణాలు తెలుగుల దువారాల ముత్యాల కుచ్చులు తళతళ మెఱుపులీ చాయుల చెంగలించాయా !

మా నందూరి కవి కోకిలం అభిరామంగా వసంత కృష్ణ గీతం ఆలపిస్తోందా ! ఆనంద బృందావన మందారాలు - నెమలి పింఛంలాగా ఎడందలు బలే ! విప్పు కల్గిస్తున్నాయి. ఒక బహూత్తమ బోధకునకు - ఒక అక్షరసౌందర్యా రాధకునకు అర్చన సలుపుతున్నామే ! మా పాల పలుకు చెలి పాలనవ్వులు ప్రసరించటానికి అందుకే నయ్యా నిన్ను అందల మెక్కించింది ఆంధ్ర పద్యకవితా సదస్సు మా పురస్కారం ఇదే అందుకో.

విజయనగరం
31-7-99

కౌముదీ పరిషత్తు
నరసింహం ఫౌండేషను.

# కవితా సంహిత

కృతి కర్త

**నండూరి రామ కృష్ణమాచార్య**

రాష్ట్రస్థాయి అధ్యక్షుడు ఆంధ్ర పద్య కవితా సదస్సు

కృతి పతి

ముద్రాపక ప్రకాశకుడు కవిరాజు

**శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణరాజు కవి**

రచయిత Author :
డాక్టరు నందూరి రామ కృష్ణమాచార్య
**Dr. N.V.R. KRISHNAMACHARYA**, M.A., Ph.D.
420 P.G.Road 35 Jawahar Nagar,
SEC'BAD - 500 003. Resi ✆ : 7817397

© రచయిత

Title of the Publication : **KAVITAA SAMHITA – POETRY**
కవితా సంహిత - పద్య కవిత

First Edition - September 1999

ప్రథమ ముద్రణ - సెప్టెంబరు 1999

భాష - Language Telugu తెలుగు

Publisher & Printer ముద్రాపకుడు, ప్రకాశకుడు
**Sri. M.V. Surya Narayana Raju Kavi**
65 BHEL Enclave - Akbar Road
Tarbund, Sec'bad - 500 009. ✆ :77 50 250

Copies - 2000 ప్రతులు - 2000

Price Rs. **75/-** వెల **75/-** రూకలు

Copies can be had from the Author
ప్రతులు లభ్యం - రచయిత వద్ద.

**Type - Setting & Printed at :**
R.K. Printers & Graphics, 11-6-418 Nampally
Hyderabad - 500001. ✆ Off. / Res. : 21 41 33

# -: కవితా సంహిత :-

"మున్నుడి" :- నందూరి రామ కృష్ణమాచార్య

పురాణాలలో సద్యోయౌవనంతో అవతరించిన పాత్రలు కొన్ని ఉన్నవి. మానుషీ గర్భవతి-నవమాసాలు మోసిన పిమ్మట బిడ్డను ప్రసవించుట పరిపాటి. ఆశు కవులు సద్యోయౌవనంతో పద్యాలు ప్రసవింపవచ్చు.

ఆశు కవిత వట్టి ఆడంబరమె కదా !
మెరయ వచ్చు మబ్బు కురియవచ్చు !!
వాన నీటి వరద వైశాల్యమే గాని
స్నాన మాడ దగిన సరసి కాదు.

కొందరు కవులకు - పద్యములు సుఖప్రసవములు. కవులు కొందరు - ఒకరోజు ఒక వారం కడుపుతో ఉండి ఒక పద్యం ప్రసవించగలరు. కొందరు కవులు పది వారాలు పది నెలలు పైబడి కడుపుతో ఉండవచ్చును.

నా విన్నపము అవధరింప వేడికోలు

కవితా సంహిత లోని పద్యాలు ఆశు కవితలు కావు.

నాకు ద్రాక్షాపాకంలో పద్యాలు వ్రాయుటయే అలవాటు. అయితే కవితా సంహితలోని కొన్ని పద్యాలు కదళీ పాకంలో-నారీకేళ పాకంలో ఉన్నవి. కొన్ని పద్యాలను నేను ఐదేండ్లు పాటు కడుపుతో ఉన్నాను.

రైలు ఇంజనును నడిపే సారథిని - ఆ విద్యను వివరించ మంటే పలుమీటలు నొక్కుట విప్పి చెప్పవచ్చు. ఒక్కమీట నొక్కితే రైలు బుస్ బుస్ మని కదలవచ్చు. వేరొక మీట వేగం హెచ్చించవచ్చు ఇంకో మీట రైలును ఆపవచ్చు. బ్రేకులకు ప్రత్యేంగా మీట ఉండ వచ్చు.

ఏ సారథి యైనాసరే - ఆవిరి ఏవిధంగా రైలును నడుపుతుందో డీసెలు తైలం ఏ విధంగా గమన శక్తిని కలిగిస్తుందో బహుశః చెప్పడు - చెప్పలేడు.

ఛందస్సు -వ్యాకరణం కవితాతత్త్వం వివరించ లేవు.

అలంకార శాస్త్ర శక్తి పరిమితమే !

"కవితా సంహిత" - లక్షణ గ్రంథం కాదు. కాని కవిత్వం లోని

లోతు పాతులు - ఎత్తులు - కొలతలు విశ్లేషించి వివరించ గలదు.

ఇందులో కొన్ని పద్యాలు అనుభవైక వేద్యములు.

రుచి తెలిసిన సహృదయులు తలలూచగలరు.

ఇవి రెండవ సారి మూడవసారి చదువ దగినపద్యాలు,

కవితా సంహిత :- వ్రాయగలవాడు క్రాంతదర్శి యైన మహర్షి నేను

మానవ మాత్రుడనే.

"కవితా సంహిత" - కృతిపతి శ్రీ మంతెన వెంకట సూర్య నారాయణ రాజు - ఆపాద మస్తక కవి. నా కావ్యమునకు ప్రధాన శ్రోత. వినేది అపర శౌనక మహర్షియే. కవితా సంహిత - చదివే సహృదయులు అపర శౌనక మహర్షులు కాగలరని నా అభిలాష.

15-8-1999 -నందూరి రామ కృష్ణమాచార్య

# నా సాహితీ ప్రస్థానం

నండూరి రామ కృష్ణమాచార్య

నా జననం తేది. 29-4-1921.

మా అమ్మ - అగ్రహార గోపవరం (పశ్చిమగోదావరి పిప్పర - సివారు పల్లెటూరు). ఆత్మకూరి వారి ఆడపడుచు. నేను జన్మించినది అగ్రహార గోపవరంలో.

నా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు. గాంధి మహాత్ముని పిలుపు మేరకు సత్యాగ్రహశాంతి సమరంలో జైలుకు వెళ్లిన సుప్రసిద్ధ దేశభక్తుడు

సత్యాగ్రహి తెలుగు వార పత్రికకు సంపాదకుడు. అధినేత. 2

మా నాన్నగారు - నండూరి శోభనాద్ర్యాచార్యులుగారు కానుమోలు గ్రామకరణం. తథా మా తాత నండూరి రామచంద్రాచార్యులుగారు. తరతరాల నుండి అనువంశికముగా వచ్చినట్టిది ఆ కరణికం - అన్నారు. నాకు శైశవంలో స్ఫోటకం వచ్చినది. మా అమ్మ నలుపు. మానాన్నగారు తెలుపు. గొప్ప అందగాడు. నాది తెల్లతోలే గాని - ముఖము నిండ స్ఫోటకంమచ్చలు. చిన్న శిశువుగా స్ఫోటక మంచం మీద ఉండగా -పై నుండి ప్రక్కలో తేలు పడి నా వైపుకు తరలిందట. మా అమ్మ - ఆ తేలును పలుసారులు నేలపైకి త్రోసిందట. తేలు ఎన్నోసారులు ఆమెను కుట్టి కుట్టి పిదప క్రిందపడినదట.

స్ఫోటక బాధచే ఒడలు పోలి పరుంటిని తల్లి ప్రక్కలో;
మాటికి మాటికిన్ మరల మంచము పై కెగబ్రాకు- తేలు-వన్
వ్రేటును వేయకుండ తన వ్రేళులతో విదలించి - యెన్నియో
కాటులు తిన్న తల్లి కృప -కారణ జన్ముడనై తరించెదన్.

---

1. మా అమ్మ నాతో చెప్పిన అంశం - నన్ను ఉయ్యాలలో పెట్టినపుడు మా అమ్మ నాకు పట్టు గోచీ పెట్టినదట. మా మామయ్యగారు ఆ పీతాంబరం పీకి వేసి ఖద్దరు గోచీ పెట్టినాడట.

ఆ మొదలు నాకు తెలియని వయస్సులో శైశవంలో ఖద్దరు ధారణ ఆరంభమైనది.

2. సత్యాగ్రహి పత్రికను ఆంగ్లేయ ప్రభుత్వం నిషేధించి ప్రెస్సును స్వాధీనం చేసుకున్నది.

అది మాతృప్రేమ. కన్నతల్లి కడుపుతీపి. ఆవృత్తాంతం నేను ఎదిగిన తరువాత పలుసారులు విన్నాను.[1]

కానుమోలు గ్రామంలో నేనున్నది స్వల్పకాలమే. ప్రజలలో - శ్రీ వైష్ణవకుటుంబాల్లో కానుమోలు గ్రామం గూర్చి ఆ ఊరి చెరువు గూర్చి ఒక జనశ్రుతి ఉన్నది. కానుమోలు గడ్డ- కానుమోలు చెరువు నీళ్లు తెలివితేటలకు దోహదం చేస్తాయట.

నెలవు - కానుమోలు - తెలివి తేటల కెల్ల ;
కలదు మహిమ-చెఱువు జలము లందు;
కానుమోలు జనుల కనులలో - వెలుగొందు
చతుర లలిత చాకచక్య గరిమ.

కానుమోలు గ్రామం - గుడివాడ - ఏలూరు పట్టణాలకు మధ్య ఇంచుమించు సమదూరంలో ఉన్నది.

కానుమోలు నుండి - నన్ను మా అమ్మమ్మ సుభద్రమ్మగారు - తన పుట్టినింటికి కోరుకొండ తీసికొని వెళ్లి పెంచి పెద్ద చేసినది. ఆవిడ సాతులూరి వారి ఆడపడుచు. కొడుకు ఆత్మకూరి గోవిందాచార్యులకు పెద్ద ఆస్తినంతా అప్పగించి - తాను కోరుకొండలో పుట్టింటికి చేరుకున్నది. సాతులూరి వారు సుప్రసిద్ధ పండితులు. జనానురక్తు లైన పౌరాణికులు. - తూర్పుగోదావరిలో

సాతులూరి వారు-సాధు పండిత వరుల్;
సంఘ హితము కోరు సచ్చరితులు;
కోరుకొండ నుండు - గొప్ప దేవళ మొండు;
గరిమ నాభి-లలిత కళల కెల్ల.

సాతులూరివారు సాలగ్రామస్వరూపులుగా నిత్యభారత రామాయణ పారాయణ పారీణులుగా సుప్రసిద్ధులు. లేత వయస్సు లోనే నాకు విస్తార శ్రుత పాండిత్యం భారత భాగవతాలలో లభించింది. అది కేవలం శ్రుత పాండిత్యమే.

నా మేనమామ గారి మేనమామ శ్రీ సాతులూరి నరసింహాచార్యులుగారు దేవాలయంలో స్థానాచార్యులు వారితో పాటు జోడు కాగడాల వెలుగులో నిత్యం నేను గూడ గుడికి వెళ్లివచ్చేవాడిని. కోరుకొండలో గురుకులపద్ధతిలో ఉచిత భోజనం కల్పించి, వటువులకు సంస్కృతం భోధించేవారు - మహానుభావుడు ద్వాదశోర్ధ్వ పుండ్రధారి తెలికి చెర్ల కందాళై గోపాలాచార్యులవారి వద్ద నేను సంస్కృతం -పంచకావ్యాలు - కౌముది అభ్యసించినాను.

గోపాలచార్య గురు
శ్రీపాదుల చేరినాడ - చిన్నతనముులో;
శ్రీ పేర్మిని సంస్కృత వి
ద్యా పారీణునిగ చేసె దయతో నన్నున్.

లోకోత్తర ధిషణకు ఏ
కైకోదాహరణ మైన - "కౌముది" చదువన్,
శ్రీ కాళిదాస కవివరు
శాకుంతల నాటకమ్ము చప్పగ తోచెన్.

ఆ కోరుకొండలో శ్రీమాన్ మరంగంటి వెంకటాచార్యుల వారు - ఆంగ్లం బోధించారు నాకు - నా సహ విద్యార్థులకూ

వెలుగు బాట వేసె - వేంకటాచార్యుండు
కోరుకొండ వాసి గొప్ప గురువు;
ఆంగ్ల భాష నేర్పి - ఐదంయుగీనమౌ
తాళపు చెవి - నాకు దాన మిచ్చె [2]

కోరుకొండ- ప్రాథమిక దశలోనే నాకు సంస్కృతంలో ఆగ్లంలో

లోతైన పునాదులు తీర్చిదిద్దింది.

---

1. వీరు తదుపరి పెదజియ్యరుస్వామివారికి చిరకాలం సహాసతులు. చినజీయరు స్వామివారికి విద్యాగురువులు.

2. 1940 లో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నాకు బి.ఏ. ఆనర్సులో ఆగ్లంలో ప్రప్రథమ బహుమతి స్టాన్లీ ప్రైజు లభించింది. దానికి మూలకారకుడు ఆయనయే.

క్రీ.శ 1934 జూన్ నెలలో ఉన్నత విద్యాభ్యాసమునక్కై నేను ఏలూరు చేరినాను. మానాన్నగారపుడు విస్సన్నపేట ఏస్టేటులో రాణాదారు.

1937 లో విజయవాడలో శ్రీరాజా రంగయ్యప్పరాయకళాశాల ఏర్పడినది. ఆ కళాశాలలో చేరే స్థోమత లేక ఉద్యోగార్థినై విజయవాడలో మేనత్తగారి భర్త మామిళ్లపల్లి వెంకటాచార్యుల వారింటికి చేరినాను. ఆమహానుభావుడు పదునారేండ్లప్రాయములో నున్న - నన్ను - నిర్వ్యాజ కరుణతో కళాశాలలో చేర్పించినాడు. ఫీజులు కట్టి, నాకు విలువగల బట్టలు కుట్టించి పుస్తకాలు కొని - "దైవం మానుష రూపేణ" ఆయన నాపాలిట దేవుడే. పిదప నా మేనమామగారు వచ్చి, నా విద్యాబాధ్యత స్వీకరించినారు.

విజయవాడ కళాశాలలో ఇంటర్మీడియేటు తరగతిలో[2] నేను కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారికి ప్రత్యక్ష శిష్యుడను. ( 1938-39) నేను - తెలుగులో చేరుటకు ముఖ్యకారణం- నాపై పడిన విశ్వనాథవారి ప్రభావమే.

కళాశాల వార్షికోత్సవములో పద్యరచనకు విశ్వనాథవారు నాకు ప్రథమ బహుమానం ఇచ్చారు. పద్యరచన పోటీలో నేను వ్రాసిన పద్యం విశ్వనాథవారు సభాసదులకుచదివి వినిపించారు. అంతేగాక "ఈ చిరంజీవి రెండుగంటలు వ్యవధిలో ఒక గొప్ప పద్యం వ్రాశాడు. తీరికగా ఇంటిలో కూర్చుని సుగృహీతనామధేయు

---

1. చాలాకాలము పిదప ఆయన కుమారుడు వెంకటాచారి నా అల్లుడైనాడు. అది నా అదృష్టవిశేషములో అంతర్భాగము.

2. 1939 లో నా మాతృమరణానంతరము నేను మేనమామ దగ్గరే పెరిగినాను. తారాతోరణము తొలిగ్రంథమునేను మా మేనమామ ఆత్మకూరి గోవిందాచార్యులుగారికి అంకితమిస్తూ వ్రాసిన పద్యం

నీ దరిని చేరుటం జేసి నాదు బ్రదుకు
దిద్దుకో గల్గినాడ ఈదృశ విధాన;
నాసిక కడ గౌతమి తూర్పునకు ప్రవింప
ఇంత పది యయ్యె ఒక సెలయేరు గాక !

లైన వృద్ధకవులు ఇట్టి మధుర కవిత వ్రాయలేరు " 1

తదుపరి ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో కూడ - గొప్ప గురువులు దొరికినారు. ఆశాఖాధిపతి. శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు

జంగమ గంగా యమునా
సంగమముగ - ప్రాక్ ప్రతీచి సాహిత్యములన్;
పింగళి లక్ష్మీకాంతుడు
సాంగోపాంగముగ - నన్ను - చతురత దిద్దెన్.

దక్షిణ భారత చరిత్ర బోధించినది శ్రీ గొర్తి వేంకట్రావుగారు.[2] శాసన లిపిని బోధించిన వారు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. ఆయనకు ఏ డిగ్రీ లేదుగాని శతాధిక డాక్టరేటు పట్టభద్రులను మించిన చరిత్రపరిశోధకుడు శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు ఆయనకు ఆంధ్రప్రశస్తి అంకితం చేసినపుడు అన్నమాట

"డిగ్రీలు లేని పాండిత్యమ్ము నన్నెకు

---

1. గోదావరికి కల్కి కుల్కుల నాట్య వి
న్యాసములను నేర్పె నన్నయ కవి;
గరువదనమ్ము వాల్ గనుల అంచుల నింప
తెనుగు వాణికి నేర్పె తిక్కన కవి;
మందార మకరంద మాధుర్యములు తెల్గు
పొలముల పండించె పోతన కవి;
స్వర్గలోకము నుండి పారిజాతము దింపి
తెలుగు సాహితి నాటె తిమ్మన కవి;
మువ్వ గోపాలు చిన్నారి మురళి తోడ,
తాండవింపగ జేసె క్షేత్రయ్య గీతి;
తెలుగు హృదయాల - తంబురా తీగె మీటి,
అమృత రస తరంగిణి జేసె త్యాగరాజు.

2. నేను వ్రాసిన ప్రాచీన దక్షిణ భారత చరిత్రను మా గరువుగొర్తివారికి అంకితం చేశాను.- శ్రీవారు ఉపాధ్యాయులలో అగ్రగణ్యుడు.

రాని పాడు కాలాన పుట్టి"

అపుడు వ్యాకరణం చెప్పిన గురువుగారు శ్రీ వఝుల చిన సీతారామ స్వామి శాస్త్రిగారు. /తిరుపతి వెంకట కవుల శతావధానం భగ్నం చేసిన ఏకైక ప్రముఖుడు వఝుల వారే అంటారు.

వ్యాకరణ విద్యా గురువుగ
ప్రాకట విఖ్యాతి గన్న - వఝుల కడ - నే
సాకల్యంబుగ ఆంధ్ర ఝ
వ్యాకృతులను చదివినాడ - ప్రాంజలి నగుచున్.

ఇక పేర్కొన దగిన మేధావి - అబ్బూరి రామ కృష్ణరావుగారు. తెలుగు కవులు సాంస్కృతిక స్వీయ పరాగ పూరితులు. సాంస్కృతిక పరపరాగ సమ్మేళనమును అరాధించిన మేధావులలో అబ్బూరి రామకృష్ణా రావుగారిని పేర్కొనక తప్పదు ఆంగ్లేయులు రవి అస్తమించని సామ్రాజ్యమును నిర్మించినారు. అంతకంటె గొప్ప విషయం యావత్ ప్రపంచలోని గొప్ప గ్రంథాలను ఆంగ్లేయులు తమ భాషలోని అనువదించుకొన్నారు. ఆంగ్లలో విజ్ఞాన సర్వస్వమును నిర్మించుకున్నారు. వారిది విశ్వ విక్రాంత దృష్టి అబ్బూరివారు గ్రంథాలయ నేతగా ఉండి - విశ్వ విజ్ఞాన సమగ్రదృష్టిని అలవర్చుకున్నారు.

వెలుగు వెదకు కొనుచు - తెలుగు సాహితి దాటి,
ఎగురునట్లు నన్ను ఎవడు తీర్చె !
అద్వితీయ ధిషణు అబ్బూరి గృహనాము
రామ కృష్ణరావు ప్రస్తుతింతు.

ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నాకు సహాధ్యాయి - మేధావులలో మేరు శిఖరి కొత్తపల్లి వీరభద్ర రావు. అతడు నాకు ఆప్తమిత్రుడు. మంచి వక్త ఉత్తమోత్తమోపాధ్యాయుడు. సాహితీ తేజస్వి.

అప్పుడు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు యశస్వి శ్రీ కట్టమంచి

రామలింగారెడ్డిగారు. వారితో నాకు ప్రగాఢ పరిచయం ఏర్పడింది. నా తొలికావ్యం తారా తోరణమునకు పీఠిక వ్రాసి "క్రొత్త పాతల మేలి కలయిక '' అని ప్రవచించారు. ఆ ప్రవచనం శ్రీ గురజాడ అప్పారావుగారిది. నా కవిత నా తారాతోరణం క్రొత్తపాతలకు మేలికలయిక - అని రామలింగారెడ్డిగారి అభిభాషణకు నేను పొంగిపోయాను. అయితే ఆ మాట అతిశయోక్తి కావచ్చు. ఏనాటికైనా రామలింగారెడ్డి గారి సమీక్షను సత్యం చేయాలనే ఆకాంక్ష నా హృదయంలో బీజ ప్రాయంగా నిలబడింది.

ఆనాడు ఆంధ్రవిశ్వవిద్యాలయం సాహితీరంగంతో ఒక వింత సత్రశాల. రామలింగారెడ్డిగారు వ్రాసిన "కవిత్వతత్త్వ విచారం" ఆంధ్రసాహితీ విమర్శకు సరికొత్త మలుపు చేకూర్చింది. శాబ్దిక చర్చనుండి రసనిష్పత్తి వైపు సహృదయుల దృష్టి మరల్చిన ఘనత రామలింగారెడ్డిగారికి దక్కవలె. రెడ్డిగారు కవితా తత్త్వవిచారంలో పింగళి సూరనకు పెద్ద పీట వేశారు. ఆయన దృష్టిలో కళాపూర్ణోదయం" సమగ్రసాహిత్యం పింగళి సూరన - పీఠికలో చేసిన ప్రతిజ్ఞ- ఔచిత్యంబు పోషించుట - అనౌచిత్యంబు పరిహరించుట - ఇత్యాది శపథాలు సర్వతో ముఖ సమగ్ర దృక్పథసూచకములే. నేను శ్రీవారితో వాదించే వాడిని తరచు. " పింగళి సూరన తెలుగు లో ఏకైక కవి కాడు. కళాపూర్ణోదయం - మెరపుతీగగల పుట్టి . అది ఒక లంబాడీ లంగా ఎన్నోతలుకు బెళుకులున్నా - వెలుగు జిలుగులుండవచ్చు. కవిత్రయభారతంలో సరిగాదు'' అని నేను వాదతీవ్రతతో అనేవాడను.

శ్రీ రామలింగారెడ్డిగారు నూనూగు మీసాల నూత్న యౌవనోద్రేకంలో ఉన్నప్పుడు - కళాపూర్ణోదయం చదివినారు. ఆతొలివలపు మైకం కవిత్వ తత్త్వవిచారంలో కల్పించవచ్చు అని నా వాదం. అయితే రామలింగారెడ్డిగారు - పింగళి వారి పై అధికారి. అంతే గాక ఆనాడు ఆంధ్రశాఖాధిపతి పింగళి లక్ష్మీకాంతం పింగళి సూరన తనవాడే నని ఆయన లోపలి అభిప్రాయం. ఆశాఖలోని పండితుడు శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు నోరుగలవారు. ఆయన కళాపూర్ణోదయం పరిష్కరించి పిఠాపురం రాజావారి ఆర్థిక సాహాయ్యంతో ముద్రించారు. పిఠాపురం

రాజావారికి పింగళి సూరనపై గల అభిమానం జగద్విదితం. అంతేగాక విశ్వకళాపరిషత్తులో క్రొత్తగ పండిత పదవిని చేపట్టిన శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి గారు ఉండేవారు. నిజానికి కళాపూర్ణోదయం కావ్యం అక్షరాల కంఠస్థం చేసినవారు ఎవరయినా ఉంటేవారు శ్రీ దువ్వూరు వేంకటరమణ శాస్త్రిగారు అని చెప్పక తప్పదు. ఎందరో మహానుభావులు. అందరకూ వందనములు. అనవలసిందే సహృదయులు. పింగళి సూరన ఆనాడు ఆంధ్రదేశంలో సాహిత్య గరిమనాభి అయ్యారు.

నా కావ్యము తారాతోరణమునకు పీఠిక వ్రాసిన రామలింగారెడ్డిగాని ఏకాంత సంభాషణలో "శీర్లమేఖలపై" అంతరంగికంగా అభిప్రాయం చెప్పమని అడిగాను. ప్రసంగ ధోరణితో శ్రీరామలింగారెడ్డిగారు అన్న వాక్యాలు.

" మీ గోదావరీ సీమవారికి తెలుగు రాదు. పూర్వకాలంలో గోదావరీ భాషను సంస్కృతం పాడు చేసింది. ఆధునిక కాలంలో ఆంగ్లం పాడుచేసింది."

"నన్నయ గోదావరీ సీమవాడే - ఆది కవి మా వాడే " అని గర్వంగా సమాధానం చెప్పాను. రెడ్డిగారు మందహాస మండన ముఖుడై అన్నారు. "నన్నయ సంస్కృతాభిమాని . ఆయనను అనుకరించి తదుపరి తెలుగు కవులు సంస్కృతం పులిమినారు తిక్కన కాక" అని సత్వర సమాధానం చెప్పారు.

తిక్కన ఎన్నో సంస్కృత సమాస భూయిష్టమైన పద్యాలు -భీష్మద్రోణ కృపాధిధన్వినికరాభీలమ్ము - వ్రాశారు. తిక్కన ద్రౌపదిచే పలికించిన పద్యం -

దుర్వారోద్యమబాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫురత్
గర్వాంధప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతులేవురిప్డు - విను దోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానము ప్రాణముం గొనుట తథ్యంబిమ్మెయిన్ కీచకా.

గ్రుక్క తిప్పుకోకుండ చదివి వినిపించాను. ఆ పద్యం విన్న - శ్రీరామలింగారెడ్డిగారి ఛలోక్తి. "ఆహా ద్రౌపదీ ! నీ ఊపిరి తిత్తు లెంత బలమైనవి".

" నీ శిర్షమేఖల లోని

క్వణదణుకింకిణీకలిత కాంచన మేఖలయై ఝణంఝణ
న్మణిమయ శింజనీధ్వనుల మార్మోగమై విదలించె ఆమె కొం
గును అపరంజి కాంచి తెగికూలెను కర్ణుని హస్త వేగ చా
రణమున హేమరత్నమణి రంజిత కోమల కుట్టికుమ్మునన్

పలువురు మెచ్చవచ్చు - కాని తరువాతి సీసపద్యం - కర్ణుని మనస్తత్వ విచార చర్య - మేల్తరం " అన్నారు. ఆపద్యం - తదుపరి పద్యం

కట్టెదుటను మన్న కౌరవాధీశ్వరు
ప్రాణ మిత్రుని మోము నరయ లేక;
హైమ కాంచిన వీడి అందందు పడిపోయి
చెదరిని మణులేర చేయిరాక,
స్తభించి నిలిచిన సతి కురు పట్టమ
హిషి అవస్థ మది నూహింప లేక,
ఏమి యెరుగకయె ఇంతలు పలిపిన
తన్ను గూర్చి తన కర్థమ్ము గాక,
కనక తల్పము జారిన కర్ణు హృదయ
మందు విద్యుల్లతా రోచి అశనిపాత
మగ్ని పర్వత జృంభణ మబ్ధిఘోష,
ధరణి కంపమ్ము లేకమై తాండవించె.

కవిత్వతత్త్వ విచార " కర్తకు అభిమాన కవి వేమన. అలతి అలతి పదముల కాహళ పంధించినట్లు తిక్కన చెప్పినట్లు శబ్దములు కూర్చిన కవి వేమన.

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి అభిప్రాయాల ప్రభావం - అప్పుడు నా మీద అంతగా పడ లేదు గాని తదుపరి నేను వ్రాసిన

ప్రగతి గీత-కవితా ప్రభాస - ఆలోచనము కావ్యాలలోని పద్యాలపై - మూడువేల పై సంఖ్య గల ఆటవెలది పద్యాలపై నా బ్రదుకు మలి సంజకెంజాయలలో నటరాజు లీలాతాండవ సదృశంగా వెల్లి విరిసింది. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు - బ్రదికి యుంటే ఎంత సంతోషించి యుండే వారో !

ఆంధ్రవిశ్వకళాపరిషత్తును వదలిన పిమ్మట నేను ఆంధ్రక్రిస్టియన్ కళాశాలలో అధ్యాపకుడనుగా 4-8-1942 తేదీన చేరినాను. కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారితో పాటు[1]- ఆ తేది కరుణశ్రీ, గారి జన్మదినోత్సవం.

గుంటూరులో మా యింటికి తరచు అభ్యాగతుడుగా సుప్రసిద్ధ దేశభక్తుడు వచ్చేవారు భయంకరాచారి. మా మేనమామ గారు ఆత్మకూరి గోవిందాచార్యులవారు- ఉమ్మడి మద్రాసు రాష్ట్రం శాసన మండలి సభ్యుడు కాంగ్రెసు నేత వచ్చివెల్లినారు. పోలీసులు నన్ను అరెస్టుచేశారు. నా ఉద్యోగం పోయింది. కారాగృహంనుండి విడుదల యైన పిదప సెప్టెంబరులో మద్రాసు విశ్వవిద్యాలయంలో రెండేండ్లు కోరాడ రామకృష్ణయ్యగారి దగ్గర తిక్కనపై పరిశోధన చేశాను.(1943 సెప్టెంబరు) నుండి 1945 వరకు

1945 లో భీమవరంలో ఏలూరులో క్రొత్తగ కళాశాలలు పెట్టారు. నాకు భీమవరంలో ప్రాచ్య భాషాధినేతగా ఉద్యోగం వచ్చింది.
అప్పుడు నా వయస్సు 24 యేండ్లు.

## -: భీమవరము :-

భీమవరం - నా జీవిత యాత్రలో పేర్కొనదగిన పెద్ద మజిలీ. 1945 లో అక్కడ కళాశాల ఏర్పడినది. అది " ప్రజల కళాశాల " అన్నారు. కట్టమంచి రామలింగారెడ్డిగారు. ప్రజల విరాళాలు ప్రోగుచేసి కార్యదర్శి శ్రీ దంతులూరి నారాయణరాజుగారు ప్రధాన సూత్రధారిగ ఆకళాశాల ప్రారంభించారు.

---

1. కరుణశ్రీ, గారికి నాకు మైత్రి దినదినాభివృద్ధి గాంచి అర్ధశతాబ్ది దాటి వర్ధిల్లినది.

ఉపన్యాసకులపై తమ అభ్యర్థన పత్రాలలో " కులము" పేర్కొన నక్కర లేదని పత్రికాప్రకటన చేశారు ! అధ్యాపకులను కేవలం సామర్థ్యం పరిగణించి ఎన్నుకున్నారు. ఆచార్య శ్రీ మామిడిపూడి వేంకట రంగయ్యగారు మొట్టమొదటి ప్రిన్సిపల్. ప్రాచ్యభాషాధినేత నయ్యాను నేను. గణిత శాఖాధిపతి అర్కసోమయాజి. ఆయన సంస్కృత పాండిత్యం కొలతకు అందనట్టిది. పేరి శర్మగారు ఆంగ్లశాఖాధిపతి రసాయన శాఖాధినేత పాలగుమ్మి పద్మరాజు. అధ్యాపకులు అష్టదిగ్గజాలు " అనేవారు ప్రజలు. వయస్సులో అందరి కంటె చిన్నవాడను నేనే. యావదాంధ్రంలో - కళాశాల లన్నిటిలో ఆంధ్రశాఖాధిపతులలో వయసులో చిన్నవాడను నేనే. కళాశాలలో క్రొంగొత్త జీతాల స్కేళ్ళు అమలు పరచింది భీమవరం - ఏలూరు కళాశాలల్లోనే యవనికా తరంలో శాసనమండలి సభ్యుడు - త్యాగయోగి మా మేనమామగారు ఆత్మకూరి గోవిందాచార్యుల వారు నన్ను పుత్ర నిర్విశేషుడుగా చూచేవారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీ తుమ్మలపల్లి వీరభద్రరావు గారు నన్ను తన నెయ్యము - గురువు సచివుడు - ఆప్తబంధువుగా చూచేవారు. నాకు కావలసిన వస్తువులు అన్నీ ఆయనే సమకూర్చారు. ఆయన కారును అవసరమైనప్పుడు నాకు పంపేవారు. పరుపు - పాన్పు గృహోపకరణాలు అన్నీ ఆయన నాకు బహూకరించారు. నా మేనమామ గొప్ప వక్త. మేనమామ చాలికలు నాకు సంక్రమించింది నోరుజోరులో. నాకంఠం దేవదత్తం అనేవారు నా ఛాత్రులు. తెలుగు పండితులు సర్వసాధారణంగా చేసేపని - పద్యాలు వ్రాయటం మొదలు పెట్టాను. సత్వరం కవితా కిరీటి గా "వేషధారినై " రాజావెడలి రవి తేజములలరగ బదులు నాకు తెలియకుండ "కవి వెడలె రవి తేజము లలరగ" భరతనాట్యం చోటు చేసుకున్నది నా జీవితచరిత్రలో. భీమవరంలో ఒక దశాబ్దిపాటు నేను సాహితీ రంగస్థలంపై ధరించిన - కవితా కిరిటి పాత్ర తలచుకుంటే నేడు నేను సిగ్గుపడటంలేదుగాని - లోలోపల నవ్వుకొనుచున్నాను.

భీమవరంలో నా జీవిత చరిత్రలో ఎన్నో సన్నివేశాలు - విచిత్ర వినోద విద్యాప్రహసనాలు జరిగాయి. శ్రీ పియస్ ఆర్ అప్పారావు గారు ఆంధ్ర శాఖలో ట్యూటరు 1945-46లో. ఆయనకు ఏడాది తిరుగకుండా ప్రభుత్వోద్యోగం

లభించింది. - వీడ్కోలు విందులో " అప్పారావుగారు అన్నారు - "ఆచార్యులుగారూ నాకంటే అన్ని విధాలుగా, బహుశ మీకంటె కొన్ని విషయాలలో ఘనుడు నా సమహాధ్యాయి శ్రీ దిగుమర్తి సీతారామస్వామిగారికి ఉద్యోగం ఇవ్వండి."

నేను వెంటనే నిరుద్యోగిగ ఇంటిలో గూర్చుని ఉన్న శ్రీ దిగుమర్తి వారికి - ఉద్యోగం ఆర్డరు పంపించాను. ఆయన "నాకు చిన్నట్యూటరు " పదవియా అని వ్రాశారు. నేనిచ్చిన సమాధానం "గంగా భాగీరథీ సమానుడుగా ఇంటిలో కూర్చోవద్దు. రండి, భీమవరం కళాశాలలో చేరండి. ఇది నా సుహృదరనుశాసనం తవ యోగక్షేమం వహామ్యహం" అని సగర్వంగా వ్రాశాను. కమిటీ వారితో చెప్పి ఆయనను స్పెషల్ ట్యూటరుగా వేయించాను. దిగుమర్తి సీతారామస్వామిగారు వయసులో నాకంటె పెద్దవాడు.1

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణ మూర్తిగారు మరియొక ట్యూటరు. ఆయన కోనసీమవాడు. ఆయనకు పిలిచి ఉద్యోగం ఇచ్చింది నేనే.

ఆయన గొప్ప కథలు వ్రాసేవాడు. ఒకసారి " అందిన ఆకాశం " అనే కథానిక ఆంధ్రప్రభలో కాబోలు ఆయన వ్రాసింది పడింది అందరూ మెచ్చుకున్నారు. ఆయన అన్నాడు : "అన్నగారి ప్రసంగంలో దొర్లిన ఎంగిలి మెతుకులు ఏరుకొని అక్షరాలుగా మార్చినట్టిదే నా కథ. "అందిన ఆకాశం" నేను సంతోషించాను. ఆయన మాటలు_నమ్మినానుకూడా. అయితే ఆ కథ చదివిన పిమ్మట - అందిన ఆకాశంలో ఒక అక్షరం నాది కాదు. అది కేవలం శ్రీ పోలాప్రగడవారి స్వకపోలకల్పితం అని తెల్సుకొన్నాను. పలువురు మిత్రులు శిష్యులు - కోరి నాకు పెద్దరికం కల్పించటం పరిపాటి అయిపోయింది అంతే. శ్రీ సత్యనారాయణ మూర్తి తదుపరి

---

1. 1955 లో ఆయన నా తదుపరి ఆంధ్ర శాఖాధినేత అయ్యారు.

2. ఆంధ్రభూమి వార పత్రికలో -"ఆరోజుల్లో" అనే శీర్షికలలో (1999) నన్ను గురించి- అనురాగం ఆప్యాయత నిజాయతీ మేళవించి వ్యాసాలు వ్రాశారు ఈమధ్యనే.

చక్కని చిక్కని రచనలు ఎన్నో చేశారు. నా వినమ్ర నివేదన. నా ప్రభావం ప్రమేయం ఆయన రచనలలో కేవలం సున్నా-బండిసున్న-ఆయనకు నా మీద ఉన్న నిర్వ్యాజ భక్తి వేరు.

ఆయన నన్ను అన్నగారుగ మన్నిస్తారు ఆయన భార్య - శ్రీరస్తు చిరంజీవిని సౌభాగ్యవతి శ్రీమతి రాజ్యలక్ష్మి - కథానికలు నవలలు వ్రాసియున్నది. ఆమె రచనలపై భర్త ప్రభావం లేదని నాకు తెలుసు. నా ప్రభావం సత్యనారాయణమూర్తి గారిపై లేదని చెప్పటం - నా కర్తవ్యంగా భావించి వ్రాయుచున్నాను. నేను ఆయనకు ఒకనాడు ఉద్యోగం ఇచ్చి ఆదరించాను. ఆ కృతజ్ఞత శ్రీ పోలాప్రగ్గడ ఈ విధంగా తీర్చుకున్నాడని నా భావన. ఒక మాట చెప్పాలి. ఆనాడు భీమవరంలో -నేను ఆంధ్రశాఖాధినేతను. అంతే అంతే అంతే. ఆ పెద్దరికం నాకు కీర్తి తెచ్చిపెట్టింది.

అయితే - సాంస్కృతిక వాతావరణం - తెలిసీతెలియక కల్పించింది నేనే. అప్పుడు మా యింటికి "కవితా ప్రభాస" అని పేరు పెట్టాను. అదే - ఒక సంస్థగా గూడా పరిణమించింది. ప్రతిరోజు మేము మా ఇంటిలో సమావేశం అయ్యేవారం. శ్రీ పురాణపండ ప్రకాశ దీక్షితులు ( ఉషశ్రీ, తదుపరి) శ్రీ శనగల నరసింహ స్వామి - పోలాప్రెగ్గడ, సన్యాసయ్య (కాలేజీలో వాణిజ్యశాఖాధినేత) - సన్నిధిరాజు సుబ్రహ్మణ్యం - నందుల గోపాలకృష్ణమూర్తి ప్రభృతులు చేరేవారు. శ్రీ కేశవకుర్తి వీరభద్రాచారి మునుముందు నేను వ్రాసిన పద్యాలతో సదస్సులకు స్వాగతం పలికేవాడు.

స్వాగతము నీ కతిథి దేవ స్వాగతమ్ము!
సహృదయ సుహృద్వరులకు సుస్వాగతమ్ము;
క్రొత్తవా రిక గాదు సంకోచ మేల?
ప్రణయ విజితు లగుదురు శాత్రవులె యైన.

ఇతి కవితా ప్రభాస- వసుధైక కుటుంబి కవీంద్రు సాహితీ
సదనము - కావ్య శిల్పమయ శబ్ద తపో మఖశాల - ఆర్ద్ర సౌ
హృద సుకుమార భావుకుల కెల్లరకున్ రసరాజధాని - తె
ల్గుదనపు సోయగమ్ములు వెలుంగుత ఇంక జగద్ధితమ్ముగన్.

ఆ అనియత సభలకు వరుసకు. నా మేనల్లుడు కేందు = లక్ష్మణదేశికేంద్రుడు (తదుపరి లక్ష్మణయతీంద్రులు = కవి - ముముక్షుజన పీఠాధినేత. పెదముక్తేవి) శ్రీ అడివి బాపిరాజు - విశ్వనాథ సత్యనారాయణ పింగళిలక్ష్మీకాంతం -దిగుమర్తి సీతారామస్వామి - దేవులపల్లి కృష్ణశాస్త్రి- వేదులసత్యనారాయణ శాస్త్రి - - దర్భా విశ్వేశ్వర శాస్త్రి చిలుకూరి వీరభద్రశాస్త్రి ప్రభృతులు వచ్చేవారు - అడపాదడపా. శ్రీ అడివి బాపిరాజుగారు - అభ్యాగతుడై మా యింటికి వచ్చేవారు. అజ్ఞాతంగా కొన్ని రోజులు గడపేవారు. ఆయన భార్య వచ్చి అడిగినా - "లేడు" అనిపించేవాడు.

దర్భాసర్వేశ్వర శాస్త్రిగారు - కళాశాలలో ఆంధ్రశాఖలో పండితులు జ్ఞాన వయోవృద్ధుడు. ఒకసారి పామర్లకోటలో నాకు సన్మానం. కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారితో పాటు - ఆనాడు నేను వ్రాసిన "అజ్ఞాత కౌంతేయం' ' -"శిర్షమేఖల" నటరాజ డాక్టరు సి. యస్. రాజు గారు ప్రదర్శించారు. బెండపూడి పేర్రాజుగారు - రాజుగారి మేనల్లుడు సభకు వచ్చారు. ఆ సభలో శ్రీ సర్వేశ్వర శాస్త్రిగారు అన్నమాట :- "నండూరి రామకృష్ణమాచార్యుల తారాతోరణంలో వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు లేవు. ఆయన పండితుడు-కాని - ఆయన శిష్యుల రచనలలో అపశబ్దాలను సమర్థిస్తాడు. "అపశబ్ద-భయం నాస్తి నండూరి రామకృష్ణమాచార్య సన్నిధౌ" అని చమత్కరించారు.

నేను వ్రాసిన నాటకాలు ప్రదర్శించినవారు చాలమంది ఉన్నారు. ఛత్రపతి శివాజీ - యన్.వి. యల్ (నరసింహాచార్యులు) గారు చాల సార్లు వేశారు. ధర్మచక్రం - అవిభక్త మద్రాసు ఉద్యోగుల సంఘంవారు పెక్కుపర్యాయాలు ప్రదర్శించారు. ధర్మచక్రం నాటకం కృష్ణాపత్రిక (వారపత్రిక) వారం వారం ప్రచురించింది. రాయలసీమ కర్నూలు నుండి వెలువడిన మనసీమలో 'కృష్ణదేవరాయలు' నాటకం వారం వారం ప్రచురింపబడింది.

"తెలుగు గడ్డ" ప్రహసనం తెలుగు స్వతంత్రలో గోరా శాస్త్రిగారు ప్రచురించారు. రాజమండ్రి కళాశాలలో అప్పుడు పని చేయుచున్న కొర్లపాటి శ్రీరామమూర్తి - నాకు ఒక "అధిక్షేపణ లేఖ" వ్రాశాడు అయితే ఆ మరునాడే మరియొకలేఖవ్రాశాడు. :- "నిన్న మీకు మీ తెలుగు గడ్డ నాటికపై నా అధిక్షేపణ తెలిపియున్నాను. ఆ లేఖలో ఏ వాక్యంగాని ఏ అక్షరం గాని నేను నేడు ఉపసంహరించుకో దలచలేదు - అయితే - నేడు నన్ను పిలిచి - మా కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడు అన్నమాట :- "మీ గురువుగారు వ్రాసిన తెలుగు గడ్డ నాటిక లోకోత్తరంగా ఉన్నది. మీ గురువు గారికి తగిన శిష్యుడవా నీవు". "తెలుగు గడ్డ"కు కొన్ని వందల సారులు వాడవాడల తెలుగుదేశంలో ప్రదర్శింపబడింది. శ్రీవాత్సవగారు - తెలుగుస్వతంత్రలో "తెలుగు గడ్డ " కు వార్షిక వాఙ్మయంలో ప్రధాన స్థానం ఇచ్చారు. శ్రీ కూర్మా వేణుగోపాలస్వామిగారు 'తెలుగు గడ్డ ప్రదర్శనకు దర్శకత్వం వహించారు. ఆయన వ్రాసిన వాక్యం." తెలుగు నాటక సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఇవ్వదగినవి. రెండు - కొవరపు సుబ్బారావు " అల్లీ ముతా" నందూరి రామకృష్ణమాచార్య "తెలుగు గడ్డ." నా మాట - "తెలుగు గడ్డలో అపహాస్యంగా భాసించే ప్రతివాక్యం వెనుక రచయిత వేడి కన్నీరు మారు వేషంలో దాగియున్నది "

భీమవరములో - నేను కవితా కిరీటధారిగ - తలయెత్తుకొని తిరిగేవాడను శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి - శ్రీ వీరభద్రంగారి తమ్ముడు. కవి ఆశువుగా కందపద్యాలు చెప్పేవాడు అంతేగాక ఆయన దాన-కర్ణుడుగా పిప్పర సర్పంచిగా సుప్రసిద్ధుడు. ఆయన నాకు ప్రాణమిత్రుడు.

ఊరి కెల్ల అత డుపకారమును చేసె,
పిప్పరకును పెద్ద పేరు తెచ్చి;
నాయకుండు సత్య నారాయణుడు సుమ్ము,
అతడు కవి వరేణ్యు డమృత హృదుడు.

నేను - "శ్రీ కృష్ణదేవరాయలు" నాటకమును శ్రీ తుమ్మలపల్లి

సత్యనారాయణమూర్తికి అంకితం ఇచ్చాను. మహాభారతంలో కర్ణదుర్యోధనుల మైత్రి సుప్రసిద్ధం. నా శీర్ణమేఖలలో - స్నేహమును రస స్థాయికి "తెచ్చినాననీ అందుకు కారణం అట్టి గొప్ప మైత్రిని నేను శ్రీ సత్యనారాయణమూర్తి ద్వారా అనుభవించటయే అని కొందరు భావించారు గూడ. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి గారే గాక నాపై అమృతస్నేహం వర్షించిన సహృదయ సమ్రాట్టు నరసాపురం పురపాలక సంఘం అధ్యక్షుడు డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం. వీరిరువురి కారులు నేను ఎన్ని వందల సారులు వాడినానో !

ఒకసారి సత్యనారాయణమూర్తిని నాకు కారు పంపమన్నాను. ఎందుకని అడగకుండా ఆయన నాకు కారు పంపినారు. ఆయన కారులో నేనొక పెండ్లికి వెళ్లినాను. ఆయన ఆ పెండ్లి పందిరికి - గుఱ్ఱపు బండిలో విచ్చేసినారు. ఆయన సహృదయత అట్టిది.

తెలుగు వాఙ్మయ చరిత్రలో - కవులకు జరిగిన సత్కార వైభవాలు మరియే భాషాకవులకు జరుగలేదు. ఆది కవి - నన్నయ-రాజరాజనరేంద్ర ప్రభువునకు అనురక్తుడు. కృతిపతి మనుమ సిద్ధి మహారాజు తిక్కనను "మామా" అని పిలిచేవాడట. ఎఱ్ఱన -సేనాపతి -మల్లారెడ్డికి నెచ్చెలి. శ్రీనాథునకు -కస్తూరి - కనకాభిషేకం రత్నాంబరాలు ఎన్నో సత్కారాలు లభించాయి. మదకరీంద్రము వాపి చేయూత యొసగినాడు పెద్దనకు శ్రీకృష్ణదేవరాయలు. కేవలం అజ్ఞానంలో మునిగి నేను కవిని కాబట్టి నాకుకూడా అటువంటి సత్కారాలు లభించవలెనని లోలోపల కోరుకునేవాడిని. అది అసమంజసమైన దురాశ అనినాకు ఆనాడు తెలియదు. అయితే ఏతత్ తుల్యములైన సదుపాయాలు సన్మానాలో నాకు సమకూర్చినవారు - శ్రీ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం - శ్రీ తుమ్మల పల్లి సత్యనారాయణ మూర్తిగారు.[1] వారి సహృదయకు నా జేజేలు

1. " రాజ కవి" - " కవి రాజు"

అయితే - నా జీవితంలో అపరసంధ్యా సమయంలో ఈ నా "కవితా సంహిత" కృతిపతి శ్రీ మంతెన వెంకట సత్యనారాయణరాజు కవి నాకు కూర్చుచున్న సదుపాయములో చేయుచున్న సత్కారములు యుగయుగాంతరాలలో తెలుగు కవులు పొందిన సమ్మాన సదృశములే. శ్రీవారు - నన్ను శతాధిక పర్యాయముల ఇంటికేవచ్చి కలుసుకున్నారు. నాకు పెక్కుపర్యాయములు ధనము -నూతన వస్త్రాలతో సత్కరించారు. ఒక సారి కూడ శ్రీరాజుగారు మాయింటికి ఉత్త చేతులతో రాలేదు. ఇది నమ్మ లేని నిజం.

భీమవరంలో నేను వ్రాసిన కవిత్రయము
గ్రంథానికి తెలుగు భాషా సమితివారి బహుమతి లభించినది. ఆబహుమతిని భాగ్యనగరిలో భారత రాష్ట్రపతి రాజేంద్రప్రసాదుగారి చేతినుండి అందుకున్నాను.[1]

భీమవరం గూర్చి నేను ఆనాడు వ్రాసిన పద్యం

శ్యామల సస్యసంపదకు స్వస్తిక భూమిక సాహితీ కళా
కోమల భావవీచికలకున్ గిలిగింతలు పెట్టు నట్టి మా
భీమవరమ్ము - ప్రాక్తన నవీన చరిత్ర చిరత్న నందనా
రామము త్యాగరాజసము బ్రాహ్మ్యము క్షాత్రములున్ పరిశ్రమల్
తామర తంపరౌ పసిడి ధాన్య నికేతము-కాపుకోట - వి
ద్యామృత వృష్టిచే ప్రజకు అభ్యుదయమ్ముల పెంపునింపుతన్.

భీమవరంలో నా జీవితచరిత్ర నిత్యసన్మాన పరంపరామ్రేడితమే.

1955లో భీమవరం నుండి నేను అనంతపురం ప్రభుత్వ కళాశాలలో ప్రాచ్యభాషాధినేతగ ఉద్యోగంలో చేరినాను. గెజిటెడు ఉపన్యాసకునిగా ఆ పదవికి అప్పుడు హోదా ఎక్కువ. తొమ్మిది సంవత్సరాలు ఆ కళాశాలలో పనిచేశాను. రాయసీమ నలుమూలలనుండి నాకు ఆహ్వానాలు అందేవి. వెళ్లివచ్చేవాడను ఎక్కడ ఆర్భాటం -హంగామా కనిపించేది కాదు అప్పుడు రాయలసీమకు ఏకైక ప్రభుత్వకళాశాల అనంతపురంలో ఉండేది. ఇతర కళాశాలలు మదనపల్లిలో తప్ప లేవు.

రాయల సీమలో ఉన్నత పాఠశాలలో గొప్ప గొప్ప పండితులు ఉండేవారు.

---

1. ఆనాడు ధన్యవాదాలు సమర్పిస్తూ రాజేంద్ర ప్రసాదుగారిని "భారతమాతకు బహిరంతరాత్మ" అన్నాను. రాష్ట్రపతి అన్నమాట-

Among the recipients - I am glad to note that there is N.V.R. Krishnamacharya - Whose carrer I am following with interest and admiration.

పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు వారి పితృపాదులు). పెనుకొండలో తెలుగుపండితులు. వారికి వారిపుత్రునకు వచ్చిన పేరు రాలేదు గాని ఆయన ఉద్దండ పండిత పిండం. అణువణువు కవి. ఆయన చెప్పిన చాటువులు శ్రీనాధుని మరపించే కవి అనిపించేవి.

అనంతపురంలో ఉన్నప్పుడు నాకు కల్లూరి సుబ్బారావుగారితో పుట్టపర్తి నారాయణచార్యుల వారితో - రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారితో కళానిధి ప్రభృతులలో ప్రగాఢ పరిచయం ఏర్పడింది. రాయసీమలో సగటు సహృదయునిలో దాగియున్న "భువన విజయాలు". అష్టదిగ్గజాలతో అనేక పర్యాయాలు నా మనోనేత్రం ముందు సాక్షాత్కరించాయి. రాయలసీమ ప్రజానీకం చిత్తశుద్ధికి నా జేజేలు పలుసారులు సమర్పించినాను. నేను అప్పుడు వ్రాసినపద్యం

క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత - ఇంచుక చావ లేదు- జ్ఞా
నామృత వృష్టికిన్ కొరత నందని రాయల సీమ లోపలన్.

అనంతపురంలో నాకు శిష్యరత్నములు పలువురు లభించారు. ఆశావాది ప్రకాశరావు (తదుపరి అష్టావధాని - సుప్రసిద్ధ కవి.) అతడు 'మెరపు తీగలు"- పద్యకవిత నాకు అంకితం చేశాడు. నా షష్టిపూర్తి సూత్రధారియై అనంతపురంలో నిర్వహించాడు. డాక్టరు సంజీవమ్మ శ్రీమతి సునంద - ఆనాటి నా శిష్యరాండ్రు. డాక్టరు చెన్నయ్య ( డాక్టరు చౌదరితో కలసి వ్రాసిన గ్రంథం శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి -నాకు అంకితం) ఆనాడు డాక్టరు గంగప్ప నాకు అనంతపురంలో శిష్యుడు.

అనంతపురం కళాశాలలో తెలుగుశాఖకు అధినేతగా నేనున్నపుడు నాకు సహవ్రతులు :- జి.యన్. రెడ్డి (తదుపరి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు) శ్రీనివాసరావు- వేంకటసుబ్బయ్య - జంధ్యాల - డాక్టర్ ఇనాక్ (తదుపరి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు.)

అనంతపురంలో నాడు టెన్నిసు ఆట వ్యసన ప్రాయంగా పరిణమించింది.

శతావధాని సి.వి. సుబ్బన్నగారితో ప్రగాడ పరిచయం నాకు లభించిది

అప్పుడే తదుపరి 1963లో నేను చిత్తూరు ప్రభుత్వకళాశాలకు బదిలీ అయ్యాను. ఆనాడు నా శిష్యులు మునిరత్నం పిళ్ళై తదుపరి నా సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పొందినాడు.

తరువది చిత్తూరు ప్రభుత్వకళాశాలలో రెండేండ్లు 1964-66 నా తెలుగు శాఖకు అధినేతగా పనిచేశారు. డాక్టరు భాస్కర చౌదరిగారు అప్పుడు నాకు సహవ్రతులు. పిదప వారు వ్రాసిన గ్రంథం నాకు అంకితం చేశారు. చిత్తూరు కళాశాలలో తెలుగు మాత్రము గాక ఆంగ్లంలో సార్వత్రికవిద్య బోధించియున్నాను.

నేను చిత్తూరులో పనిచేసేటపుడు నరసాపురంలో -: భువన విజయం:- డాక్టరు సుబ్రహ్మణ్యంగారు సూత్రధారి శ్రీకృష్ణదేవరాయలు. నేను తెనాలి రామకృష్ణపాత్రధారిని దాశరధి- పింగలి సూరన. నాడు దివాకర్ల వెంకటావధానిగారు పెద్దన అనుకుంటాను దాశరథి - "నరసాపురీ భువన విజయము" న భూతో నభవిష్యతి" అని ఆస్థాన కవిగా ఉన్నప్పుడు రవీంద్రభారతి సభలో చాటి చెప్పారు.

1966లో తాడేపల్లి గూడెంలో ప్రభుత్వకళాశాలలో నేను ప్రిన్సిపలు అయ్యాను. భీమవరంలో ఒక దశాబ్ది "తీరికే లేని కోరికా". రాయలసీమలో "కోరికే లేని తీరికా" గడచినది. ఇక తాడేపల్లి గూడెం ప్రిన్సిపలు పదవీకాలం "తీరికా లేదు - కోరికా లేదు. ఝుంఝూనిలంగా సాగిపోయింది."

తాడేపల్లిగూడెం సంస్థాపక ప్రిన్సిపలును నాకు అప్పుడు పురపాలక సంఘం అధినేతగా ఉన్న. శ్రీ ఈలి ఆంజనేయులుగారు నన్ను గురువుగా ఒక దివ్యాంశసంభూతునిగా ఆరాధించి మన్నించేవారు . వారి కారు నా అధీనంలో పెట్టేవారు. సర్వతోముఖంగా ఆ నాలుగైదేండ్లు నేను శ్రీరాముని కాకపోయినా - తాను ఆంజనేయునివలె నన్ను కాపాడి సాయంచేశారు.

తదుపరి విశాఖపట్నం. కళాశాల చిట్టచివరకు నేను ఉద్యోగ విరమణ చేసింది పీఠికాపుర రాజా ప్రభుత్వ కళాశాల. కాకినాడ మే 1976.

# కరుణశ్రీ అనుబంధం

కరుణశ్రీ నేనూ ఒకే రోజున 4-8-1942 ఆంధ్ర క్రైస్తవకళాశాలలో ఉద్యోగంలో చేరినాము. మా ఇద్దరనూ అభిమానించినది తెలుగుశాఖాధిపతి. తెలికిచెర్ల వేంకటరత్నంగారు స్ఫురద్రూపి. నిండైన విగ్రహం. ఆయన నవ్యసాహిత్య పరిసత్తు కార్యదర్శి. గుణగ్రహణపారీణుడు. శివశంకర శాస్త్రి - వేదుల సత్యనారాయణ శాస్త్రి ,దేవులపల్లి కృష్ణశాస్త్రి-అడివిబాపిరాజు ప్రభృతులు ఆయన ఇంటికి వచ్చిపోయే అతిధులు. ప్రతిభ పత్రికకు ఆయన సంపాదకుడు కరుణశ్రీ కి ఉద్యోగం ఇప్పించింది కేవలం ఆయనే. నేను ఆంగ్లంలో విశ్వవిద్యాలయస్థాయిలో ప్రప్రథమునిగా నిలిచి - స్టాన్లీ బహుమతి పొందటంచేత నాకు తెలుగు శాఖలో ఉద్యోగం ఇచ్చిన సైప్పు-తెల్లదొర - మాతృభాష ఆంగ్లం. శ్రీపాపయ్య శాస్త్రికి నెలకు ముప్పది రూకలు నాకు అరువదిరూకలు జీతం. అయితే సైప్పుదొర మరునాడే నన్ను పిలిచి నా జీతం ఎనుబది రూపాయలకు పెంచాడు. ఆ విధంగా అహం పెరిగింది. పాపయ్య శాస్త్రి కి కూడ జీతం ఎంతో నాకు కొంత పెరిగేటట్లు చూస్తానని నేను చెప్పాను. ఉభయులం సైప్పు దొరను కలిసేందుకు వెళ్లాము. ఆయన కార్యదర్శి నన్ను లోనికి పంపుతూ - అన్నాడు. "శాస్త్రిగారూ మీకు ఇంగ్లీషు" రాదు. దొరగారికి తెలుగు రాదు. మీరు దయచేసి వెనుకకు వెళ్లి పొండి. " నేను లోనికి ఉత్సాహంతో వెళ్లాను.

శ్రీ పాపయ్య శాస్త్రిగారు చిన్నబుచ్చుకొని ద్వార సమీపంలో నారాక కోసం నిలబడ్డారు. సైప్పుదొరకు నేను వ్రాసిన "జీవితసూక్తం" అమెరికా లాంగ్‌ఫెలో వ్రాసిన కవితకు అనువాదం వినిపించాను. ఆయనకు తెనుగు రాకపోయినా నన్ను అభినందించి - నా జీతం నెలసరి పెంచి నూరురూకలు చేశారు. నన్ను ఆయన ఇంటికి రమ్మన్నాడు. తనతోపాటు అప్పుడే నేను పాపయ్యశాస్త్రిగారిని ద్వారం దగ్గర పరిచయం చేశాను జీతం పెంచమని చెప్పాను గాని సైప్పు దొరకు నా మాట తలకు ఎక్కలేదు. సైప్పు దొరతోపాటు నేను ఆయన కారు ఎక్కి వెళ్లిపోయాను.

ఆరాత్రి - అవతరించింది క్రొంగ్రొత్త కవిత "బీదపూజ" శీర్షికతో కరుణశ్రీ కలమునుండి. అందలి వాక్యలు " తెలతెలవారుచుండ జనితిన్'' విరిపూజకు "తోటమాలి" =ద్వారపాలకుడు లోనికి పోనీయలేదు. "నా చినిగి పోయిన గుడ్డలు నన్ను జూచి''.

"పుష్ప మొక్కటయినన్ లభియింపక పోయె నా కటవ్ "వారలు పెద్ద పెద్ద ధనవంతుల బిడ్డలు" అందలి బంగారు బుట్ట ఎం. ఏ డిగ్రీ. పాత తాటాకు బుట్ట విద్వాన్ పట్టము సులువుగా గ్రహింపవచ్చు. కరుణశ్రీ వ్రాసిన కొన్ని కవితలలో కథానాయకుడ నయ్యాను. అది కరుణశ్రీ ఘనత. నా అదృష్టంగా భావించినాను.

నాకు పెరిగిన జీతంలో సగభాగం ఇస్తానన్నానుగాని - కరుణశ్రీ అంగీకరించ లేదు. ఉదయశ్రీలో కరుణశ్రీ వ్రాసిన పద్యాలు పెక్కు విన్న ప్రథమ శ్రోతను నేనే.

కరుణశ్రీ వ్రాసిన విజయశ్రీ -పీఠికలో ఆ కావ్యమునకు అంకురార్పణ చేసిన మిత్రునిగా నా పేరు ఉదాహరించియున్నారు.

తాను వ్రాసిన కరుణశ్రీ కావ్యమునకు నన్ను పీఠిక వ్రాయమన్నారు. కరుణశ్రీ కవి. ఆ రోజులలో శ్రీకట్టమంచి రామలింగారెడ్డి పీఠికలపై మోజు కవులందరకూ. నేను కట్టమంచివారిని అడిగినాను కరుణశ్రీ కావ్యమునకు పీఠిక వ్రాయమని. శ్రీ కట్టమంచివారు నన్నే వ్రాయమని - ఛలోక్తిగా అన్నమాట. "ఆచార్యవర్య - నీవు గూడ నా వలెనే పీఠికా గ్రంథపరమేశ్వరుడవు అవు గాత ''.

కరుణశ్రీ కావ్యానికి నేను **ఉపశ్రుతి** అనే పేరుతో సుదీర్ఘ పీఠిక వ్రాశాను. ఆ పీఠిక కరుణశ్రీ కవికి వచ్చింది. సాహితీ వేత్తలు కొందరకు వచ్చింది. ఒకసారి సభకు అధ్యక్షత వహించాను. శ్రీపాపయ్యశాస్త్రిగారికి గండపెండేర సత్కారం విజయవాడలో. శాస్త్రిగారే అధ్యక్షతకు నా పేరు సూచించారు. అధ్యక్ష ప్రసంగంలో నేను ఒక చమత్కార వాక్యం విసిరాను. " కరుణశ్రీ కావ్యానికి పీఠిక వ్రాయటం వలన నాకు నష్టం వచ్చింది. వ్రాసిన, కవితలు మరుగున పడి - నా పీఠికలను ప్రజలు స్మరించుచున్నారు. కరుణశ్రీ హృదయంగమ మైన సమాధానం ఛలోక్తి విసిరినారు. ఆయన అన్నమాట "నాకు కూడా నష్టం వచ్చింది. తెలిసిన పెద్దలకు నా

కవితలు బహూకరించి వారి అభిప్రాయం అడిగితే "నండూరివారి పీఠిక చాలా బాగా ఉంది" అంటున్నారు".

కరుణశ్రీ తన కావ్యములకు కోరికోరి నా చే పీఠికలు వ్రాయించుకున్నారు. కరుణశ్రీ కావ్యమునకే గాక ఉదయశ్రీ ప్రథమభాగానికి తదుపరి అన్ని భాగాలకు నేను పీఠికలు వ్రాశాను ఉదయశ్రీ ప్రథమభాగానికి గుంటూరులో కరుణశ్రీ ఇంటిలోనే ఉదయం 8 గంటలకు కూర్చొని 11గంటలకు పీఠిక -వ్రాశాను. లేఖకుడు శ్రీజంధ్యాల మహతీశంకర్ అభినందించాడు నన్ను. "కేవలం మూడు గంటలలో బృహత్ పీఠిక వ్రాశారు మీరు." అన్నాడు. "నా సమాధానం' మూడు గంటలలో ముగించినాను. అయితే ఒక దశాబ్ది పట్టింది నా ఆలోచన మొదలుపెట్టి."

నన్ను గూర్చి కరుణశ్రీ శ్రీజంధ్యాల పాపయ్యశాస్త్రిగారు మనోహర శిల్ప సుందరమైన సీస పద్యం వ్రాశారు.

ఎవ్వాని గళములో నవ్వుకొన్నది నంద
    నారామ మధుర మందార వల్లి !
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ
    భారతీ మంజు మంజీర రవము;
ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను
    పర్దాలు లేని సౌహార్ద లక్ష్మి
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త
    గుప్త దానవ్రత ప్రాప్త తృప్తి
అతడు నండూరి వంశ పయః పయోధి
    చంద్రముడు రామకృష్ణమాచార్య సుకవి;
గద్యపద్య తారాతోరణాద్యనేక
    కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

నామీద శిల్పసౌష్టవ పరాకాష్టతో చెక్కిన పద్యం వ్రాసినందుకు కరుణశ్రీ కి సుహృదభినందనములు తెలపగా ఆ మహానుభావుడు అన్నమాట :- " ఆచార్యుల వారూ, మీ మీద మీ శిష్యుడు శనగన నరసింహస్వామి అంతకంటె గొప్ప పద్యం వ్రాశాడు. అని చదివిన పద్యం.

-: హృదయ మమృత సముద్రము - వదనము
కవితా లతాంగికి నర్తన శాల;
సదన మతిథి కోటికి - నాటి ఋష్యాశ్రమము
విశాల వసుధా కుటుంబి నీ సాటి నీవె" :-

కరుణశ్రీ, మొదటి భాగం వెలువడిన సుమారు నలభై ఏళ్ళకు మిగిలిన భాగాలు పూర్తి చేశారు శ్రీపాపయ్య శాస్త్రిగారు. అప్పుడు ఆయన నన్ను గుంటూరుకు రమ్మని తంతిద్వారా ఆహ్వానించారు. లబ్ధ ప్రతిష్ఠుడు - తెలుగు సహృదయుల హృదయాస్థానకవి వ్రాసిన కరుణశ్రీ కావ్యమునకు ఎవరి పీఠిక కావాలి "కరుణశ్రీ కావ్యం మీపీఠిక చేరనిదే పరిపూర్ణం కాదు. మా యింటిలో కూర్చొని వ్రాయాలి" అని అన్నారు కరుణశ్రీ!!

నేను - ఆ రోజునే నా పీఠిక పూర్తి చేశాను. కరుణశ్రీ అన్నారు-" నా బిరుదు నామం కరుణశ్రీ. నేను వ్రాసిన కావ్యం పేరు కరుణశ్రీ. మీరు పీఠిక వ్రాశారు. కరుణశ్రీ పూర్తి అయింది. కరుణశ్రీ జన్మ సార్థకమైంది".

నా పీఠికలో బుద్ధచరిత్ర - పురాణకథ కాదు ఐదంయుగీన గాంధీమహాత్ముడు -"అహింసా ప్రవక్త " బుద్ధభగవానునకు మానసపుత్రుడు. కరుణశ్రీ గారి కరుణశ్రీ -అటు హిమాలయాలలో రోహిణీ నదీ తీరాన అవతరించిన బుద్ధుని - సముద్ర తీరంలో పోరుబందరులో పుట్టిన గాంధీని కలిపే పరమ పవిత్ర సాహితీ జాహ్నవి.' ' అని వ్రాసిన వాక్యం పలుమారులు స్మరించారు. " భూలోకంలో మానవ మాత్రుడైన రచయిత ఈ దృశ్యం చూడలేడు. ఎవరో స్వర్లోక సంచారి - విద్యాధరుడు మాత్రమే సందర్శించ గల భౌగోళిక దృశ్యం" అని నన్ను అభినందించారు.

ఆ రాత్రి నాకు విందు భోజనంలో మామిడి పండ్లు కరుణశ్రీ స్వయంగా అందించారు.

నాకు పట్టె మంచం వేశారు - సుఖనిద్రకు. అయితే రెండు గంటలు కాలేదు పాపయ్యశాస్త్రిగారు నిదుర నుండి మేల్కొనిన అలికిడి అయింది నేను వారిపుత్రులు

ఆయన దగ్గరకు వెళ్లాము పలుకరించాము అయితే ఆయన మా చేతులలోనే నిర్యాణం చెందారు. కరుణశ్రీకి మరణం ఏమిటి ?

'తెలుగు సహృదయుల గుండెలలో కరుణశ్రీ - చిరంజీవి" అన్నాను. వచ్చిన ఆకాశవాణివారితో. నా చేతులలోనే కరుణశ్రీ పరమపదించుట హేతువాదమునకు అతీతమైన సన్నివేశం.

శ్రీకరుణశ్రీ-అంతిమ యాత్రకు సూత్రధారి శ్రీవిశ్వంజీగారు అంత్యసంస్కారం కాగానే నేను విజయవాడ వెళ్లి - విశాలాంధ్రవారు నాకు చేసిన సన్మాన సభలో పాల్గొని - సంతాప తీర్మానంతో నా శ్రద్ధాంజలి ఘటించినాను.

-: కరుణశ్రీ కవికి నాడు నా సాహితీ శ్రద్ధాంజలి :-

నీ యమృతార్ద్ర దివ్య హృది నే చవిచూచితి - సాహితీ చిర
స్థాయిగ నిల్పినావు - మన సౌహృదబంధము - కావ్య పీఠికల్
వ్రాయగ చేసినావు నను - వాఙ్మయ యజ్ఞ జగత్తులో రసా
మ్నాయము నీ కవిత్వము మహాకవి - శ్రీ కరుణా పయోనిధీ.
వచ్చె పేరు నీకు వర్తమానము నందె !
మేటి కవిగ - నన్ను మెచ్చినావు ;
పేర్మి కూర్మి చూపి - పీఠికల్ వ్రాయించి,
వేసి తీవు - నాకు పెద్ద పీట

---

1. కరుణశ్రీ స్మారక సాహితీపురస్కారము ప్రప్రథముగ నాకే ఇచ్చినారు.
2. ఢిల్లీలో కరుణశ్రీ ప్రథమజయంతి సభ - ఆంధ్రభవనంలో నా అధ్యక్షతన జరిగినది.

# నండూరి రామకృష్ణమాచార్య కవికి
# సమకాలీన సత్కవీశ్వరుల సుహృదభినందనములు

నండూరి వంశ్య ! కవి కుల
మండన ! శ్రీరామకృష్ణమాచార్యా ! నీ
నిండగు హృదయాంభోనిధి,
మెండుగు సౌజన్య సుధకు మేర కదయ్యా !

కులముల మాట కేమి ? కల కూజిత గానము లాలపించు కో
యిలల కనేక జాతుల మహీరుహ సంతతి యాశ్రయంబుగా
నిలచిన మాత్రనే, కలుగ నేర్చునె ? తత్కల కంఠ మాధురీ
విలసన మందొకించుక విభేదము మాన్య విపశ్చిదగ్రణీ !

కవికుల మందుఁ బుట్టితిమి, గాదిలి బిడ్డల మాంధ్రవాణికిన్,
జివగల పద్య విద్య గల శిల్ప మహత్త్వపు సోయగంబులన్
తవిలిన డెందముల్ మనవి; ద్వైతము తోఁచుట యెట్లు? త్వాదృశ
ప్రవిమల చిత్తులన్ స్వపర భావ మొకించుక చేరనేర్చునే?

ఆచార్యోత్తమ ! తావకీన కవితావ్యాసంగ యోగంబునన్
ప్రాచీనాద్యతనాంధ్ర కావ్య రచనా ప్రాగల్భ్య మీమాంసలో,
వ్యాచిఖ్యాసిత పద్య శిల్ప సరణిన్ పద్యంబులే నిల్చు; సం
కోచంబందగ వ్యక్తులున్ కులములున్ గోత్రాలు విద్వన్మణీ.

గురుదేవుల్ కడు శిష్యవత్సలుని హృత్కోశంబునన్ నిల్పి యా,
వరదాచార్యుని పాదపద్మయుగమున్ భక్తిన్ సమర్పింతు; నా
గురుదేవుం గనుఁగొంటి మీ యెడఁదలోఁ గూటస్థ చిద్రూపుఁడై
పరమాత్మాకృతి నున్న ! వాఁడదె మహాభాగా! నమస్కారముల్.

పుత్రినిఁ గూర్చి తండ్రియును, బుద్ధిమదగ్రణి శీలవంతుఁడౌ
ఛాత్రునిఁ గూర్చి సద్గురువు సంతతమున్ శ్రమియించుచుంట -యీ
ధాత్రిని గానవచ్చుఁ గవితా రసలుబ్ధు లదృష్టపూర్వులే
మిత్ర వరేణ్యు లీ గతి శ్రమించుట- మత్కృత పూర్వపుణ్య వై
చిత్రి యటంచు నెంచెద వశీకృత సత్కవితా సుధానిధీ !

ఏ సంబంధము లేని యిర్వురకు నిట్లీనిర్నిబంధాంచితం
బౌ సౌహార్దముఁ గూర్చి, యొండొరులపై నాత్మీయతాభావ వి
శ్వాసంబున్ నెల కొల్పినట్టి జననిన్ వాగ్దేవి నామ్నాయ చూ
డాసంచారిణిఁ గొల్తు నా హృదయ పీఠమ్మందుఁ జిద్రూపిణిన్

నీ "కవితా ప్రభాస" కృతి నేఁటి సమాజపు ధర్మశాస్త్ర; మీ
లోక మనాకులంబుగ విలోక మొనర్చుచు సంచరించినన్,
నాకము లోకువౌ భువికి; నవ్యసమాజపు దివ్య దీధితుల్
ప్రాకు సమస్త విశ్వమున భారత సంస్కృతి మూల కందముల్.

- యార్లగడ్డ సుబ్బారావు

"వెన్న యెట్టు లుండు?" - నన్న - మా రామ కృ
ష్ణమ సుధీ హృదబ్జ మట్టు లుండు;
"జున్న దెట్టు లుండు" నన్న ? మా రామ కృ
ష్ణమ సుధీవచోర్థ మట్టు లుండు.

-శతావధాని డాక్టర్ పి.వి. సుబ్బన్న.

❖❖❖

ఆత్మీయులు అన్నగారికి నమస్కారం,

మీ సుహృల్లేఖ 'కవితా ప్రభాస' లు నాకు మంగళా శాసనంతో అందాయి - మీ ఆత్మీయతను పొందినందుకు ధన్యుడను -

"కవితా ప్రభాసము కరుణావిహారము
విచక్షణాజ్ఞానము విశ్వ దృష్టి
చైతన్య మార్గము చరితార్థ మానము
సమకాలీన రచన సహజ సృజన
సంప్రదాయమునందు సంస్కార బుద్ధి
వాక్కు లోన అనుభవార్ద్ర స్పర్శ
నందూరి పద్యము గుండె నైవేద్యము
ప్రాసంగికత పొందె ప్రగతి చింత"

- మీ రిచ్చిన 'ఆదర్శకవి' నిర్వచనం మీ అభ్యుదయ చింతనకు నిదర్శనం- జే జే లు-

అపూర్వమైన కవితాధార - ఆటవెలదికి చైతన్య దీప్తి - అద్భుతమైన కొసమెరుపులు - కలగలసిన కావ్య సంస్కారం అన్నీ చాల గొప్పగా వున్నాయి.

-: జ్వాలాముఖి:-

ఓం

'ఆలోచనము' - అను బృహత్ పద్యకావ్యావిష్కరణ మహోత్సవంలో-కృతి కర్త, పూజ్యులు గురువర్యులు మాన్య శ్రీ నండూరి రామ కృష్ణమాచార్యుల వారికి అందజేసిన "అభినందన పద్య మందారమాల

నండూరి వంశ వర్ధన !
పండిత కవి పుండరీక భాస్కర ! ధిషణా
మండన ! శుభముల నిడుచును
ఖండేందుధరుండు మిమ్ము కరుణను బ్రోచున్.

సాహిత్య భారతి సమరాంగణమ్మున
గాంగేయుడై నిల్చి ఘనత గాంచి,
సుర భారతికి తెల్గు సిరి మువ్వ గజ్జెలు
గట్టుచు నాట్యంబు గఱపి గఱపి,
పద్య కవితకు నాటి ప్రాభమ్మును గూర్చ
కవితా సదస్సుల కడగి నడపి,
కావ్య కావ్యములకును కమ్మ కస్తురి వంటి
పీఠికా తిలకముల్ ప్రీతి దిద్ది,

సుకవి పండితవర నగస్తోమముననను
"సంచరించెడి" 'మేరు' ప్రశస్తి గాంచి,
గొప్ప దాతృత్వగుణమున కొమరు మీరు
కృష్ణమాచార్య మా ! గిడిగిళ్ళు మీకు

- చిల్లర కృష్ణమూర్తి

# కృతి స్వీకృతి

కవితా సంహిత ముగ్ధమోహన యశఃకాంతా లలామంబు ప్ర
భవ ప్రాగ్జ్యోతిష భవ్యమూర్తి కరుణాభావైక సింధూర సం
భవ సంస్కారి మనోవికాస సలిజన్ ప్రాభావితా తేజోమయిన్,
భవదీయం బగు కావ్య కన్య నిడగన్. ప్రార్థింతు విద్వత్కవీ.

ఎందరు లేరు కన్నియ లి కెందరు లేరు కళాతపస్వినుల్!
ఎందరు లేరు నాట్య రమణీ మణు లెందరు లేరు సాధ్వి లున్!
ఎందరు లేరు అప్సరస లెందరు లేరు వరూధినీ సముల్,
అందరి కంటె మీ కవన సంహిత ఎందుకు నాకు నచ్చెనో !

ఇత్తును అర్ధశరీరము
మెత్తును ఈ సుదతి లోని మేలి గుణంబుల్;
ఇత్తును వందన శతమును
బత్తిని శ్రీ రామ కృష్ణ భాసుర కవికిన్.

ఏమి టీయ గలను ? ఎట్లు తీర్తు ఋణంబు
తీర నట్టి ఋణము తెలియు నాకు;
కావ్య కన్య నిడిన కరుణార్ద్ర సత్కవీ !
కేలు మోడ్పు గొనుము కేవలముగ.

స్వీకరించుచుంటి చిన్మయాత్మకమైన
కవన సంహిత యను కావ్య కన్య;
కవన రీతు లెల్ల కలబోసి నారందు;
ధన్యజీవి నైతి - మాన్యచరిత

ఇంత కంటె నాకు ఏ కోర్కియును లేదు;
నిండి పోయె మనసు - పండి పోయె;
ఇహము పరము గూడ నిందులో కనుగొంటి
రమ్య హాస లోల రామకృష్ణ .

కవితా సంహిత నొసగిన
కవి చంద్రుడు రామకృష్ణ కవి కేమిత్తున్ ?
ప్రవిమల వినయ విధేయత
కవితా నీరాజనంబు కాన్కగ నిత్తున్.

కోరిన యంతనే సుమకు కోమలి సంహిత నిత్తు నంచు తా
మీరిన సంతసంబు గొని మించిన వేడుక-సమ్మతించి, నా
కోరిక దీర-కావ్య రమకున్ తగువాడవు నీవటంచు నా
కారమణీ మణిన్ ఒసగె- కారణ జన్ముడు రామ కృష్ణుడే.

ఆంధ్ర దేశ మందు - అన్ని దిక్కుల లోన,
కలరు మేటి శిష్య గణము మీకు;
వారి కంటె నన్ను కోరి యాదరముతో,
మెచ్చు చున్న మీకు మేల్మి నతులు.

---

గురువు ఋణమునకు చెల్లించు కొరకు నేను
చాటు పద్య కృతిని వ్రాసి సంతసముగ,
అంకితము నిచ్చు చుంటి ఆచార్య వర్య
అందుకో సుభద్రాపతి అతుల ప్రీతి.

డాక్టర్ మలయశ్రీ - "స్పందన" కృతికర్త

# ఆలోచనము ఆవిష్కరణము

శ్రీ మంతెన వేకంట సూర్య నారాయణ రాజు కవి

వెదకు చుంటి నేను మీవంటి వారికై;
చాల నాళ్ల నుండి సంఘ మందు;
దొరకినారు మీరు చిరకాల మిక నేను
వదలబోను మిమ్ము వదల లేను.

మీ సారధి మీ ఛాత్రుడు
మీ సచివుడు మీ సఖుండు మీ నెయ్యంబున్,
మీ సేవ జేయు భాగ్యము
ఆసాంతము కోరుచుండు నయ్య యితండే.

గీతకు దీటుగా "ప్రగతి గీత" రచించి యశోవిశాల వి
ఖ్యాతిని గాంచి సర్వజన రంజిత రాగ మనోజ్ఞ మూర్తిగన్
జాతికి నంద జేయు తమ జన్మము సార్ధక మయ్యె సత్కవీ !
ప్రాతయు కొత్తయున్ మిళితమౌ నటు తీరిచి దిద్ది రందునన్.

ఆలోచనా గ్రంథ మావిష్కరణ నాడు
కనుల పండుగ యౌచు వినుతి గాంచె;
గురు పూజ గావించి గొప్ప ఖ్యాతిని గూర్చె;
నందూరి వారికి-నాగ శర్మ;
స్వర్ణ కంకణ మిచ్చి సత్కరించెను గదా
నాగఫణీంద్రుండు త్యాగ యోగి,
కవు లెందరో నాడు ఘన కీర్తి గలవారు
నీరాజనంబులన్ నెరపినారు

అద్భుతంబటంచు ఆలోచనము కృతి
మెచ్చినాడు సభను మేటి కవులు;
"విశ్వ కవిగ" మీకు - విఖ్యాతి లభియించె
ధన్య జీవులైరి మాన్య చరిత.

నాగఫణి శర్మ యంతటి జ్ఞాని మీకు
నిండు సభ లోన - గురు పూజ నెరపె నన్న
ఖ్యాతి సామాన్య మైనది కాదు జగతి -
సార్థకంబయ్యె మీ జన్మ సఫల మయ్యె.

'విశ్వ కవి' గ - మీరు వెలుగొంది నారండి
సాటి కవుల లోన మేటి యగుచు,
విశ్వ రూపు దాల్చె నశ్వరంబుగ మీదు
పద్య కవిత లెల్ల ప్రజ్ఞ తోడ.

అవధానంబులు సల్పి నాగఫణి శర్మారాధ్యుడై యుండియున్,
లవ లేశంబును గర్వ చింత మది కల్గన్ జేర రానీక మీ
కవకాశంబు కల్గ జేసిరి గదా కారుణ్య భావంబుతో,
భువిలో లేని విధాన మీకు జరిపెన్ పూజాది సత్కృతుల్.

'ఆలోచనము' గ్రంథం బది
కాలానుగుణంబులైన కవితల వెలుగై;
భూలోక విశ్వకవితగ
కాలంబొక యింత జరుగ - కాంచును కీర్తిన్.

# -: లయ :-

ప్రతిభా వ్యుత్పత్తులలో
ప్రతిభ గరీయసి కవిత్వ విలసనలో
ప్రతిభకు మున్నగు ప్రజ్ఞా
స్థితి వ్యక్త మ్మగుత కావ్య దివ్యాకృతియై.

ఇది కవితా ప్రభాస పరమేశ్వర దివ్య కళావిభాస, శా
రద పద కింకిణీ క్వణన రమ్యవిలాస కళింద నందినీ;
మృదుల తరంగ హాస భజియింప గరండు రసజ్ఞ భావుకుల్;
మెదడు ఎడంద విందు మిరుమిట్లు పసందులు పండు వెన్నెలల్.

విశ్వయాత్ర బడలి వేసారు పథికుడా!
కలత దేరి సాగ దలతువేని
రమ్య హాసలోలు రామకృష్ణుని కైత,
తేర ద్రావి దప్పి తీర్చు కొనుడు.

-శ్రీ శ్రీ శ్రీ లక్ష్మణ యతీంద్రులు

# గురు దక్షిణ

శ్రీ శనగన నరసింహ స్వామి

ఘన నండూర్యన్వయ ఖని
మణి, వేంకట రామ కృష్ణమాచార్యు యశో
ధని, తారాతోరణ కృతి
వినిబంధన చణుని గొల్తు - విద్యా గురువున్.

ఎవ్వాని నామంబు హృది తళ్కు మని నంత
కందోయి మోద వాఃకణము లురలు;
ఎవ్వాని విగ్రహం బెదుట నిల్చిన యంత,
నిలువెల్ల నీపమై పులకరించు;
ఎవ్వాని చిఱు నవ్వు నీక్షించు నంతనే
చింతా పయోదాళి చెదిరి పోవు !
ఎవ్వాని వాగ్రసం బెసగి క్రోలిన యంత,
విమలామృతంబును వెగటు గొలుపు -

అమ్మ విధాన మమ్ము మధురాదర వైఖరి జూచు మా సుభ
ద్రమ్మను సంతతాతిథి సమర్చన కాశిక అన్నపూర్ణనే
పొమ్మన జాలు సాధ్విని - ప్రభూతపు భక్తి -నమస్కరింతు- డెం
దమ్మున దేశికాంగనను నండురి వంశ వధూజనోత్తమన్.

పాయక మీ పదాబ్జముల పాంసువులన్ తల దాల్చుకొంచు నే
హాయిగ తొల్లి భీమవర మందు పఠించిన నాలుగేండ్లు - నా
కాయము నాటుకొన్న పులకంబులు మాటికి సాటి లేని పా
థేయము లౌచు - నా బ్రదుకు దీర్చెడి నేడును దేశికాగ్రణి !

నటులో పాటకులో కవిత్వపటులో నాట్యజ్ఞులో సాహితీ
వటులో శిష్యులో విందులై బహుకళాపారమ్య లీలా సము
త్కటగోష్ఠిగతి వెళ్లబుత్తురెపుడున్ కాలమ్ము నీ యింట నీ
వెట నుందో యట శారదా చరణ మంజీరైక శింజా గతుల్.

సవినయ మూర్తులై కవులు ఛాత్రులు వెంబడి నేగుదేరగా
నివుజులు గప్పు నిప్పన - తృణీకృత బ్రహ్మపురందరుండవై;
నవ నవ మైన తీవిని చనం గని - పౌరులు పెద్దనాది స
త్కవులు తలంపులన్ నిలువగా పులకించుట నే నెఱుంగుదున్.

సాగుచున్నదె నిత్యసాహితీసత్రమ్ము
కమ్మగా ప్రత్యవాయమ్ము లేక ?
వచ్చు చున్నారె మీ వసధాంగణమునకు
దిన దినమ్మును కళాతిథులు నేడు ?

చెలగన్ బూర్వము పింగళీంద్రుడగు లక్ష్మీకాంత మాచార్యుచే
తెలుగుం బీఠిక పూర్వ గర్వ సుయశోదీప్తిచ్ఛటల్ - మీద - నీ
వలనన్ మీరె ప్రతిక్షణైక రచనా వ్యాసంగి ! నిక్కమ్ము లీ
పలుకుల్ సాక్షులు వేనవేలు గల రే ప్రాంతమ్ములో జూచినన్.

మౌళిపై కేలుదోయిని గీలుకొలిపి,
తలతు నందూరి వంశసుధాపయోధి
పార్వణేందుని దేశికపాదు రామ
కృష్ణమాచార్యు నిస్తుల కీర్తిధుర్యు.

★★★

## -: కవి తాంజలి :-

-"కవి" కలుగోట్ల విజయాత్రేయ

శ్రీవారి సుమనోజ్ఞ " శీర్ణ మేఖల" రస
రాజ్ఞ ముత్యాల వజ్రాల డాపు;
ఆచార్య దేవుల అజ్ఞాత కౌంతేయ
మభిజాత సాహితీ విభవ శోభ;
దేశిక స్వాముల తిక్కన భారతా
లోకన ప్రతిభా పతాక జిలుగు;
నందూరు పండిన పాండితీ చండిమ
ధర్మ చక్ర ప్రభా ధవళ రోచి

చల్లనా వారి నట్టిల్లు సరస మధుర
చారు సాహిత్య శారద చంద్రశాల;
భావుకాగ్రణులకు నెద పూవు దోట
అతిథి అభ్యాగతాళికి - నన్నపూర్ణ. 1.

కళల కల్యాణి నృత్య రంగస్థలమ్ము;
రస విలాస వాహ్యాళి కారామ భూమి;
లలిత కవితా వధూటి వెన్నెలల బయలు,
రామ కృష్ణ మాచార్య కల్యాణ గృహము. 2.

పద్య కవితా ప్రపంచ శుభ్రాంశు మూర్తి,
గద్య కవితా విపంచీ సుగంధ వీచి,
గేయ కవితా వసంత జేగీయ మాన
మాధవీ నికుంజ వితర్ధి మా గురుండు. 3.

జిలుగు తెలుంగు పల్కుబడి చిక్క దనమ్ములు పిక్కటిల్ల మం
జుల మధుర ప్రసన్న రస చుంబిత సంస్కృత దివ్య వాణి మం
గళ మహతీ నినాదములు కమ్మదనమ్ములు గ్రుమ్మరింప ను
జ్జ్వలముగ కైత లల్లు గల స్వామి కివే విజయాభివందనల్ 4.

సరళ గంభీర ధీర మందర మరంద
భావ సౌగంధ సంపద పరిమళించు
వారి కంఠస్వరాల విహారము లవి;
తెలుగు భారతి తళుకు అందియల రొదలు. 5.

ప్రగతి గీతా ప్రశస్తి నిర్వక్ర నిరుప
మాన కవితా ప్రసక్తి అమంద మధుర
మధురస ప్రపత్తికి నొక విధు వనమ్ము,
రామ కృష్ణమాచార్య కళా పథమ్ము. 6.

ఇది ఒక సాహితీ విజయ హేల వికాసము రామకృష్ణ ధీ
సదన సుధా స్రవంతిక రసమ్ములు చిమ్మిన కావ్య వేళ సం
పదల పాదల్ ఘుమం ఘుమలు పర్వులు దీసి రవీంద్ర భారతీ
మృదుల పథాల భావ సుమరేఖలు వీచె కళా సమీరముల్ 7.

గీర్వాణ భారతీ క్రీడా వికంపిత
చరణ మంజీర ఝుంఝుణల క్రాంతి
ఆంధ్ర సరస్వతీ యపరంజి గాజుల
కంకణమ్ముల ఘలంఘలల క్రాంతి
కవితా కళావతి కాంచన మణీ కాంచి
గరుడ పచ్చల మెర మెరల క్రాంతి
రస మహారాజ్ఞి నవరత్న హాటక
మకుట రేఖల చకచ్చకల క్రాంతి
కవి బృహస్పతి నండూరి రవల కలము;
మధురసమ్ములు చిమ్మిన మంజు క్రాంతి;
మల్లె తావులు కమ్మిన మాన్య క్రాంతి;
విభవ సంక్రాంతి హేలా నవీన శోభ. 8.

సుర గంగ తరగల పరుగుల యురవడి
బురడించు కళల పెంపుల కుదింపు;
నందన మందార చందన కురువింద
లలితార్ద్ర పరిమళమ్ముల మదింపు;
మధుమంత మాకంద మందర మకరంద
మాధురీ ఝరుల కమ్మని నటింపు;
మందానిలానంద మత్త గందేభాల
గమన గంభీర భంగిమల ఘటింపు;
కలసి, హాయిగా రసములు చిలుకరించి;
మించు కవితా వధూటి క్రొమ్మించు హొయలు;
పూజ్య నండూరి కావ్య సామ్రాజ్య హేల
రామ కృష్ణమాచార్య కల్హార మాల. 9.

రామచంద్ర ఉవాచ శ్రీరామగీత,
కృష్ణ వాసుదేవ ఉవాచ గీత కలసి,
కళలు కవితలు నైతిక విలువలె నగు
రామకృష్ణమాచార్యుల ప్రగతి గీత. 10.

కవి మహాఋషి సాహిత్య కనక నగము,
గురుడు నండూరు హరిణధరుడు,
రామ కృష్ణమాచార్య కళా విరాజ
చరణ రాజీవ యుగళి కంజలి ఘటింతు. 11.

హృదయ మమృత సముద్రము వదనము
కవితా లతాంగికి నర్తనశాల;
సదన మతిధికోటికి నాటి ఋష్యాశ్రమము
విశాల వసుధా కుటుంబి నీ సాటి - నీవె.

- శనగన నరసింహ స్వామి

పద్య శిల్పమునకు భాష్యంబు నీకృతి
కవన సంహిత యిక క్రాలు గాత ;
ఋషి మనీషి రామకృష్ణమాచార్య ! వా
గ్దేవి నూపురముల శేవ మెఱయు.

- యార్లగడ్డ వెంకట సుబ్బారావు.

మహాకవి నండూరి రామకృష్ణమాచార్యుల వారి
గురుపూజా మహోత్సవంలో

## -: నమశ్శతపత్రమ్ :-

శివ శీర్షంబున నొక్క బిల్వదళమై చెన్నొందు చందాన మా
ధవు పాదాల పవిత్రమౌ-తులసియై కన్పించు అస్మత్ కృతం
బవు -మీ సత్కృతి సత్కృతి ప్రచురమై ఆనంద సంభావనా
ప్రవణంబయ్యెను రామకృష్ణ కవిచంద్రా ! అందుకో ప్రేమతో.

స్వర మాధుర్య రసాల కోకిలము దీవ్యద్భావనాకాశ చం
ద్ర రసాలోకము పద్య పద్మ సరసీ తంత్ర స్వతంత్రమ్ము సాం
ద్ర రుచిన్ మీ కృతి జీవనమ్మును సుభాద్రా భద్ర హస్త ద్వయీ
నిరతాన్న ప్రద మయ్యె-శిష్య తతికిన్ నిత్యాశిష శ్రేయమై.

"ఆట వెలదు" లందు అమృతమ్ము నొలికించి,
తేట గీతు లందు తీపి పెంచి;
తెలుగు నేల విరిసె తేనెల పూ దోట,
రామ కృష్ణమార్య ! రమ్య సుకవి.

గురు ప్రసిద్ధే గురుపూర్ణిమా తిథౌ
గురోశ్చ పూర్ణ ప్రతిభా ప్రకాశిన:
సమర్ప్యతే సత్ కృతి దివ్య మాలా!
గళేహి రారాజతు శిష్య దత్తా ॥

వేదిక: త్యాగరాయ సభ
31-1-1999 మాడుగుల నాగఫణి శర్మ

"అందుకొంటి తమరు 'ఆలోచనము' పంప,
చదువు కొంటి భక్తి శ్రద్ధ మీర;
సరళ సుందరమ్ము, సందేశ భరితమ్ము;
తెలుగు దేవళమున దీప కళిక"

- డాక్లర్. అల్లూరి వెంకట నరసింహ రాజు

❖❖❖

సర్వాంధ్ర మందున సచ్ఛిష్య గణమును
    కూర్చిన ఘనుడైన గురు వితండు!
ప్రాచీన సాహితీ పాథోధి నలవోక
    పుక్కిటం బట్టిన ప్రౌఢ యితడు;
సద్గోష్ఠు లందున సరస సంభాషణా
    చతురుడై వెలుగొందు సరసు డితడు;
వర యశస్కుండని కరము సన్నుతి గన్న
    ఆచార్యు డైనట్టి యనఘు డితడు
    ఎవని శిష్య వాత్సల్యంబు ఎఱుగు జగతి,
    ఎవని సాహిత్య కౌశల మెఱుగు జగతి,
    ఎవని వాక్యచమత్కృతి ఎఱుగు జగతి,
    అట్టి నందూరి సుకవీంద్ర నభినుతింతు

నిండు మనంబు వాడు గణనీయుడు తెల్గున పద్దెవిద్దెలో
పండినవాడు, శారదకు బాంధవుడై అనిశంబు అర్చనల్
మెండుగ సల్పువాడు మెఱమెచ్చుల మాటల కెప్డు దూరుడై
యుండెడువాడు ఈతడని యున్నతి గాంచెను ఆంధ్ర మందునన్

- డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ

# నచ్చిన కవి

అధరము కదలినఁ జాలును
మధు మత్తమ నీదు వాల్కు మంజుల కవితా
సుధ లొల్కు తదాస్వాదన;
మది అది మఱపించి వైచు సొంతమ్ము మదిన్.

తేట గీతి తోడ దీటుగా శ్రుతి గల్పి,
ఆడ గలదు నీదు ఆట వెలది;
రస మయమ్ము నీదు రమణీయ వృత్తమ్ము;
కృతివి నీవు రామ కృష్ణ సుకవి.

హృదిని  మదిని గూడ నీ వాక్క గా టమనే
కట్టి వైచినావు - గవిని పులిని;
ఈ యుగమ్ము నందు నిదియును సాధ్యమా !
అరసి చూడ కవి మహర్షి నీవు.

కల్ల కపటు లేని  పిల్లలుగాఁ జేసి
తెలుఁగు పద్యములను చెలఁగి చెలఁగి,
ఆడు కొందు నీవు జోడుగా వారితో:
లేదు ముదిమి నీకు లేదు లేదు.

నందూరి కవీంద్రా ! నీ
భాండాగారమునఁ గలవు పద్యాల్ వజ్రాల్,
దండిగను వాని నెల్లను.
దండుకొనన్ మాకు మనసు తహతహ లాడున్.

నచ్చి కృతుల నిచ్చినా మీవు నేనును
ఒక సుహృద్వరునకే యొప్పిదముగ;
నచ్చ కుండు టెట్లు ? నాకు నీవును నీకు
నేను నింక రామ కృష్ణ మార్య !

-: ఓగేటి పశుపతి :-

ఒకమహానీషి కవీంద్రుడు ద్రష్ట విశ్వవిశాలదృక్పథంతో లోకాన్ని మత్స్యవిహంగ వీక్షణచేసి నిజంగా ఆ అవతారంలాగా కవితా వేదాన్ని సహృదయులకందించాడు. అనిపించింది మీ కవితలో నాదం ఉంది. ధర్మావాదం ఉంచి హృదయసంవాదం ఉంది - ఇలా ఎంతచెప్పినా తరగని మంచిదనం గల పుస్తకాలు వీరు వ్రాస్తూ ఉండాలి అని పరమేశ్వరుని ప్రార్థిస్తూ అయిదు, పది చేస్తూ.

డా ॥ ధారా రామనాథశాస్త్రి

# కృతి సమర్పణము

## శ్రీ శ్రీ శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణరాజుకవిగారికి

నా కృతిపతి - సూర్య నారాయణుడు - రాజు,
కాడు - కేవలమ్ము - కవి వరుండు;
శ్రేష్ఠ మానసుం డనుష్ఠాన వేదాంతి !
గుండె పండి నట్టి - గుణ వరిష్ఠి.

ఉండ వచ్చు - కవిత - ఒక్క వాక్యము నందు,
ఒక పదమున - ప్రతిభ - ఊరవచ్చు;
పార వచ్చు కవిత - ఓర చూపుల లోన !
నాట్యమాడ వచ్చు - నవ్వు లోన.

కవిత - నీళ్ల పాల కడవయే యగు గాని;
వెన్న పూస - నీ కవిత్వ మన్న !!
సుకవి రాజ వర్య - సూర్య నారాయణా !
నరుని నాల్క చేర - కరగి పోవు.

ఆంకిత వ్యవస్థ - ఆంధ్ర వాఙ్మయ మందు,
ఉభయ తారకమ్ము - ఉజ్జ్వలమ్ము;
సహృదయుండు గొప్ప సాహితీ ప్రీతితో;
యుగ యుగాల కవుల నుద్ధరించె.

నా కవిత్వ రచన - నీ కవిత్వ స్థాయి,
ఏక రీతి తోచు - లోకమునకు ;
సులభ శైలి యందు - సూటి భావము లందు,
సూరయ - ఋషి సమాన - సుకవి రాజ.

భావి యుగము లందు- భావుకుల్ పఠియించి,
నచ్చి నా కవితలు మెచ్చ వచ్చు;
సూరయ కొనియాడె- సుకవి రాజన్మ్యందు;
నా కవితలు నేడె - నాకు - చాలు.

తీవియు ఈవియు మది సం
భావించి - పరోపకార భావుక వరుడై;
"దేవుడు మామయ" బిరుదున
జీవితమును తీర్చి దిద్దె - శ్రీమంతుండై.

ఏవో కవితలు పలువురు
వేవేలను వ్రాయవచ్చు - విద్యానిధులై;
నీవే తరచుగ మానవ
జీవితముల వ్రాయగలవు - సేవాకృతివై.

కవిత - హృదయ గీతి - కాకి కూతలు కావు !
కూజితములు కావు కోకిలలవి;
హంస రుతులు - పరమ హంస గాన ధ్వనుల్;
రాజ హంస నీవు - రాజ వర్య.

నీ యనురాగ దివ్య సుధ నింపిన అక్షయ పాత్ర - నాకు- పా
థేయముగా నొసంగితివి - తీయని సౌహృద సంహితా సమా
మ్నాయము యుష్మదుత్తరము-నందన పుష్ప మరంద సాంద్రమై,
ఓ యమృతార్థ్ర వాఙ్మయ ఋగుజ్జ్వల ! 'సూరయ మామ' సత్కవీ.

నీ తల యూపు చాలు గద - నిశ్చల నిర్గళ దివ్య మౌన సం
గీతము నా మదిన్ నిలుపు - కేవలతా కవితా తపః పరం
జ్యోతివి నీవు - నిక్కలలు చూచినవాడ భవత్ కటాక్ష సం
ప్రీతియె నాకు దోహదము - ఋత్విజ మాత్రుడ నీ మఖమ్మునన్.

అర్చన చేయలేను మనసారగ ఈశ్వరు విశ్వశిల్పి ఏ
చర్చలు వేద శాస్త్రముల సారము గూర్చియు చేయలేను, నే
కూర్చితి తెల్గు నానుడుల క్రొత్త తలంపులు కొన్ని తేర్చి, నా
నేర్చిన భంగి నింగికిని నేలకు మధ్య జగద్ధితమ్ముగన్.

పుట్టి పెరిగినాడు - బుద్ధాములో రాజు,
కరుణ నిండు గుండెకాయ గలిగి,
ఉత్తముడు బ్రదుకు పరోపకారార్థమై;
సౌమ్య శీల వర్తి - సాధు మూర్తి,

పండెను జీవితమ్ము-కవి పండిత మండలి సేవలో- సుధా,
భాండము-గుండెకాయ-ప్రతిభా పరివేష మయూఖ మండనా,
దండి మగండ వీవు గద - దాన దయా గుణ మందు -మత్త వే
దండము బోలు నీ నడక-ధర్మపరాయణ! సూరయ ప్రభూ.

జాతి సరసతకు ప్రతీతి " అంకిత " మన్న
గౌరవ భృతి తరచు కవికి చేరు;
సంఘ మందు కవికి జామాత కృతిభర్త;
మామ యెడల మధుర మమత చూపు.
సరస సామరస్య సహకార తత్త్వముల్
ప్రేమ-జగతి లోన పెరుగు నట్లు,
గుండె దున్ని వెలుగు పండించు తలపుతో,
పద్యములను కొన్ని వ్రాసినాను.

నీ కవనమ్ములో -రసధునీ కమనీయ తరంగ నాట్య హే
వాకము చిందు లా డభినవ స్పృహణీయ మనోజ్ఞ భావనా
లోకము నీ హృదంతరములో వెదజల్లెడి కమ్మ తెమ్మెరల్;
నా కవనమ్ములోన సుమనః ప్రతతుల్ వికసించు నట్లుగన్.

పువుటీరమ్ముల అణిముత్యములు కర్పూర ప్రభావీచికా
ధ్రువపత్రంబులు నీ ప్రసంగములు చే తోమోదముల్-సర్వదా
స్తవనీయంబులు తేట తెల్లములునౌ సాహిత్య లోకాన - నీ
కవితల్ నాక ధునీ తరంగ విలసత్ కల్హార కింజల్కముల్.

నీ చిరునవ్వులో రసధునీ రమణీయ తరంగ భావనా
వీచిక వెల్లివారు అరవింద దళమ్ములు మల్లె పూవులున్
పూచును పల్కులందు - నెరపొంకము బింకము కూడి చేరి దో
బూచుల నాడు - సౌమ్యతలు పొంపిరి వోవగ సూరయ ప్రభూ.

భోజ శ్రీకృష్ణ దేవాంశః
కావ్యాలోకైక తాపసః
జయతు మంతెన శ్రీమాన్
సూర్యనారాయణ ప్రభుః

సలుపుచుంటి - సర్వసంగ సన్న్యాసినై
పద్య సాహితీ తపస్సు నేను,
నాకు దొరకె - సూర్యనారాయణుడు రాజు!
ఆ సరస్వతి కరుణాశ్రయమున,

నా కృతిపతి రాజు నరమాత్రుడా ? కాదు ;
వేషధారి కాదు - భాష కాదు;
గ్రంధకర్త కాదు - గర్విష్ఠియును కాదు;
కవి వరుండు కాదు - "కవిత" అతడు.

సూర్యనారాయణో రాజః
మంతెన వంశ దీపకః
సరళ కవితా శ్రేష్ఠః
వర్ధతామభివర్ధతామ్.

నీ నగు మోములో వెలుగు నిత్య వసంత నిలింప నందనో
ద్యానము; నీ వచస్సుల మృదంగ సహస్రము, దేవదుందుభుల్,
వీణలు వాణి అందియలు, వేణులు, మ్రోగు - పరోపకార పా
రీణత నీ హృదిన్ వెలువరించును వెన్నెల దేవళమ్ముగన్.

సుందర మందహాస రుచి శోభితమై ముఖమండలాన -ఆ
నందము చిందులాడ-నయనమ్ముల వెల్గులు నాట్యమాడ- రా
ణ్ణాందను డుండు -సూర కవి నాథుడు సత్కవితా మరంద ని
ష్యందములైన పద్యముల నందదకున్ వినిపించుచున్ సదా.

అందము చందమున్ తెలిసినట్టి కనుల్ గలవంచు నెంచి-నీ
ముందర కుల్కుచున్ మధుర మోహన శిల్ప కళా విదగ్ధతల్
చిందుచు కావ్యకన్య దరి చేరె - స్వయంవర నర్మ హోవ యై;
మంద మనోజ్ఞ హాస ముఖ మండల మెత్తి గ్రహింపు మీ కృతిన్

నాతిగ మార్చెను రాముడు
రాతిని అను కథ చెలగెను రామాయణమై!
నాతిని కష్ట చరిత నీ
చేతి చలువ - రాణిగ తగ చేసితి వీవే.

మారెను క్షణమున రాణిగ
నారీ మణి - రాజు సూర్యనారాయణునిన్
ధీరోదాత్తుని తా మన
సార పతిగ స్వీకరించి ఆనందించెన్.

ఆమె రాణి యయ్యె - అన్నదమ్ముల వీడి
విగత భర్తృక యగు - విజ్ఞురాలు,
చేర గలిగె సూర్యనారాయణుని రాజు,
సంతసింపజేసె - సంతసించి.

లలిత సౌహార్దమున - లక్ష్మీ సరస్వతుల్,
 నిన్ను-దూత పదవి కెన్ను కొనిరి,
నీవు చేరి నన్ను-నిర్వ్యాజ కరుణతో,
 కాచినావు-సూర్య కవి వరేణ్య.

కవిత-వ్యాప్తి చెందు- కమ్మ తెమ్మెర వోలె!
 కన్ను దోయి యెదుట-కాన బడదు !!
అమృత కవిత - అనుభవామ్రేడితమ్ము సుమ్ము;
 క్షాళనమ్ము చేయు - స్నాయువులను.

“కరుగ నట్టి దేది ? కాల సాగరములో ? ”
 “యశము” పైన - తేలి యాడి - నిలుచు”;
బ్రదుకు కాలమునకు ఎదురీది కవితయే!
 ఆంధ్ర కృతిపతికి చిరాయు రస్తు.

వ్రాసినాడ నేను - పద్యమ్ములను పెక్కు,
 నాది కాదు ఒక్క అక్షరమ్ము,
చేయి పట్టి ఎవరొ - వ్రాయించి నట్టుగా,
 తోచుచుండు నాకు తుట్టతుదకు.

తెలివి తేట లున్న తేజస్వి - కవి రాజు;
 సూక్ష్మ దృష్టి తోడ - చూడ గలడు,
తెలివి తేటలు వెల వెలబోవు నట్లుగా
 చూపు- మంచితనము సూరయ కవి.

బ్రదుకు లోన ఇచ్చు బహుమానముల యందు;
చెప్ప వచ్చు కృతియె గొప్ప దంచు;
కన్య కంటె గూడ - కావ్య కన్యక మిన్న;
ధన్యుడు కృతి పతియె ధరణి లోన.

పలుకు పలుకు తేనియ సో
నలు సతతము కురియు సూర్యనారాయణుచే
కలమున - నిక్కముగ నరయగ
తెలుగున "రాజా" నిలువెల్ల - తేట కవితయే.

కవితా ఝుంకారముతో
అవనిన్ వివిధ సుమ వనులు యాత్రాళువు నా
చు విహారము సల్ప - పలు మ
ధువులు పువులలో నిరతము దొరికెను నాకున్

రాజ కవికి -అభినవ కవి
రాజునకున్ - నిర్నిమేష రంజిత కవితా
తేజస్వికి - కవితా నీ
రాజనముల నంద జేతు -రస హృదయునకున్.

రెక్కలు మొలుచును కవితా
వాక్కులకున్ గుండె గూళ్ల వదలుచు నా నా
దిక్కుల విహరించును పెను
మక్కువ నీ గళమున విరి మాలలు వేయున్.

ఏది చూడ దగును? హృదయమ్ము మాత్రమే;
చదువు గాదు  మనిషి పదవి గాదు!
మంచితనము మేలు - మణి కిరీటము కన్న,
మేలు మనిషి యందు - జాలి గుండె.

చేర రండు-గుండె  చీకటుల్ పోకార్ప,
క్రొత్త విలువ లెన్ని కూర్చు - కవిత,
పొండు  వెలుగు తళుకు పండింప పృధివిలో,
ఎల్ల లెల్ల దాటి యెదిగి యాడు.

తెలిసి-ధూర్త దుర్విధేయుండనై -నేను
వ్యాకృతికిని "స్వస్తి" పలికినాను;
భాష  లక్ష్య మేది? - భావాలు తెలుపుటే !!
వాడ దగును జీవ భాష నెపుడు.

"బ్రదుక గలిగె నతడు-పతన మొందక సుంత,
చదువు-ధనము మెదడు పదవి వలన,"
అనుచు నన్ను గూర్చి-జనులు పల్కిన చాలు,
గొప్ప కవిగ- పేరు - కోరు కొనను.

డెందము నందున - కవితా
నందన వని పెంచినాడ - నవ్యామోదా
నందముతో  సహృదయ వర
బృందములు యుగాంతరములు తృప్తింజెందన్.

## "కవితా సంహిత" కృతి భర్త



**కవిరాజు : రాజకవి**

## శ్రీ మంతెన వేంకట సూర్య నారాయణ రాజు

అష్టదిగ్గజములకు అధికుండు కవితలో
    ప్రథిత కృష్ణదేవరాయ విభుడు;
ప్రతిభ గుర్తుపట్టు ప్రతిభా గరిష్ఠుడే !
    రాజు - అపర కృష్ణరాయ విభుడు.

చేరు - పద్యకవన జీవత్ పతాకమై
కారు మీద రాజుగారు తరచు,
నడ గుడి వలె సూర్య నారాయణుడు వచ్చి
నా గృహమ్ము పావనమ్ము చేసె.

కఠిన పదము లెపుడు - కవిత లందున గాని
కలము నుండి గాని కదలి రావు !!
నర వరుండు - సూర్యనారాయణ విభుండు
గంగి గోవు పాలు పొంగు - పొదుగు.

సాహితీ తపస్వి - సాహసౌదార్యుండు
పద్య రచన చేయు ప్రతిభ తోడ,
వ్రాయ గలడు వేగ - రాజు - సూరయ మామ
తేట తెలుగు నుడుల తీపి తేర్చి.

కనుల లోన కలదు - కలములో ఉప్పొంగు
నడక లోన ఉట్టిపడుచు నందు;
పలుకు లందు చేరి భరత నాట్యము చేయు
అతని ప్రాణనాడి అమృత కవిత.

ఠీవియు ఈవియు మది సం
భావించి పరోపకార భావుక వరుడై:
దేవుడు మామ బిరుదుతో
జీవితమును తీర్చి దిద్దె - శ్రీరాజు సదా.

# కవితా సంహిత

బ్రదుకు తీర్చు -సామరస్య సంధాతయౌ
వ్యాసు డొక్క డుండు టవసరమ్మ
వసుధ నందు - పెక్కు- భావ వైరుధ్యముల్
సంస్కృతి ప్రతీక -సహన గుణము.

పద్య వజ్ర మణుల - ప్రజ్ఞా పతాకముల్,
కూర్చ వచ్చు -కవులు -కొన్ని చోట్ల !
వ్రాయ వలయు కవిత - ద్రాక్ష పాకము నందు
సరస సరళ సులభ శైలి యందె.

ఊహ లెల్ల కవన యోగ్యమ్ములా ? కావు;
కదిపి కుదుప వలెను హృదిని కవిత,
ఛంద మందు ఒదుగు శక్తి - లేకున్నచో,
వచన మందె - ఊహ - వ్రాయ దగును.

స్వీయ తృప్తి కొరకె - వ్రాయవచ్చును కైత,
ధ్యేయ మగుత; పరుల తృప్తి కూడ,
సుకవి-వ్రాయ వలెను - సుకుమార శైలిలో;
మెదడు హృదిని గూడ మేలు కొలిపి.

గజి బిజి అన నేల ? కవిత లర్థము గాక ?
సూత్ర సమ్మితములు - సులువు గావు ;
ఎరుగ లేడు నరుడు ఏదియో తన స్థాయి;
వినయ రహితు డెపుడు - వేత్త గాడు.

సరస కవిత లోని -స్థిర తటిన్నిభ దీప్తి
భావనా చమత్ ప్రభాస పటిమ;
కారయిత్రి లోని - గమకాలు యమకాలు;
సహృదయుండు: మెచ్చి సంతసించు.

స్వర్గ సీమ నుండి - సంగీత కళ పేర,
దిగును నేల పైకి-దివ్య శక్తి;
విద్యమాన మగును సద్యః పర సమాధి;
అంతరాత్మ రస నిరంతర మగు.

పాత కతడు-స్వస్తి - భరత వాక్యము పల్కి,
నవ యుగమున కతడు నాంది - కూర్చు;
క్రొత్త పాత కలుపు - కూర్మి సేతువు కట్టి,
మధ్యవర్తి యగుచు మసలు - సుకవి.

గుండె చేరు - నాల్క నుండి - పక్వ ద్రాక్ష;
సహజ సుందరముగ సత్వరమ్ము;
సరస కవిత వోలె - సద్యః ప్రతీతితో
సహృదయుండు పొంగి సంతసింప.

ఈత కొట్టు -తలపు లెల్ల చేపల బోలి,
మేటి కడలి- మనిషి మెదడు సుమ్ము;
మెట్ట బడిన యట్టి - మీనాలు భావాలు !
చంధ మనెడి నీటి పొందు లేక.

వెడల వలెను -కవిత- యెడద లోతుల నుండి;
కలము వ్రాయు రచన - కవిత కాదు !
మంచితనము లేక - మానవత్వము లేక,
ఎవడు కాడః కాడు - కవి వరుండు.

సామవేద నాద సంహితా రస ధునుల్
పొంగెడి కవితాంత రంగ మందు;
అమరు - ఛంద మందు అంతఃప్రవాహముల్;
చిందు త్రొక్కు- నాదబిందు కళలు

సత్కవీశు డెపుడు - సకుకాలికుల చేత,
పృధివి లోన - గౌరవింప బడడు !
గౌరవింపబడిన - కారణాంతర ముండు !
లౌక్య లలిత చాకచక్య ముండు.

కవిత - కనక ఖచిత కంకణంబా ? కాదు;
కరగి - గుండె కార్చు - కంటి నీరు !
కవి కలమ్ము - కల్కి ఖడ్గమ్ముగా మారి,
నరుకు గాత - దుష్ట శిరము లెల్ల.

ఆశు కవిత కొంత ఆశ్చర్య మొనగూర్చు!
బుస బుస బుస పాల పొంగు వోలె !
కవిత -వెన్నపూస - గడ్డ మీగడే చిల్క;
కాన వచ్చు - చల్ల పైన తేలి.

వ్యాకరణము ఛంద మాహార్య మాత్రముల్ !
అరయ వలయు - కర్త -అంతరాత్మ,
కానుపించ వచ్చు కావ్యాల దోషాలు!
మెరయ మేటి ప్రతిభ - మెచ్చ వచ్చు.

ఆశు కవిత - యన ఆవేశ లేశమే !
రస సమాధి యోగ రచన కాదు !
కవిత - నిలువ యుండు - ఖండ శర్కర - సుమ్మ;
పానకమ్ము వోలె - పాడు గాదు.

పరుల లోని తప్పు - పట్టి చూపిన గాని
పండితులకు నిదుర పట్ట బోదు !
గుండె పండు సహృదయుండు - స్వారస్యముల్
కాంచెడి సమకాల కవిత లందు.

మనసు పొరల దూరు - మాలిన్యములు పెక్కు
వెదికి తీయు టెట్లు - వెదకి వేగ ?
శౌచ శుద్ధి యగు - రస క్షాళనమ్మలచే,
మౌన యోజనా సమాధి వలన.

బ్రతుకు ఆటుపోటు బరువు భాధ్యత లెల్ల,
అంతరింప వలయు - కొంత సేపు;
మానవుండు - పొందు- ఆనంద విశ్రాంతి,
కవిత వలన-లలిత కళల వలన.

వేయ వచ్చు పెద్ద విరిదండ కంఠాన,
సూత్ర ధారి యగుచు శుద్ధ శుంఠ;
కవి రచన పరనమె - కవికి సన్మానమ్ము;
కాదు కాదు - స్వర్ణ కంకణమ్ము.

సభలు జరప వచ్చు - సాహితీ భాషణల్
గాలి ధూళి కలిసి తేల వచ్చు;
నిద్ర పోవు నిండ్ల - ముద్రించ గ్రంథాలు;
కవిత -ఎట్లు వ్యాప్తి గాంచ గలదు ?

వెడలు తీగ లున్న- విద్యుత్తు ప్రవహించు,
చెల్లు నుపకరణము లెల్ల యెడల,
కనులు గాంచ లేవు - కవితా ప్రస్థానముల్ !
గుండె నుండి - వేరు గుండె చేరు.

బ్రదుకు విడిచి నరుడు- పారిపోవుట కల్ల !
"పచ్చి నిజము" ధరణి పైన - బ్రదుకు;
సాహితీ రచనలు - సకల వేదాంతముల్,
తరచు గాత బ్రతుకు తెరువు సతము.

మంచి పద్యమొకటి -ఎంచి - తూకము వేయ,
జగతి సత్ ప్రబంధ సమము సుమ్ము !
ప్రాక వచ్చు తీవె - ఆకు మారాకుతో,
తావి గొలుపు - ఒక్క పూవు చాలు.

మారి పోయి -బ్రదుకు మలిసంజ కెంజాయ
తరచు - కవి వరుండు తాత్త్వికు డగు;
నుడుల చుట్టు చేరి - పొడుగు నీడలు క్రాల;
వెన్నెల సిరి పిదప వెల్లి విరియు.

అందకత్తె గాని ఆడ పిల్లయె యైన,
పెండ్లి చేయు - కూర్మి పేర్మి - తండ్రి;
ముచ్చట పడి -రచన-అచ్చు వేయగ వచ్చు,
వెఱ్ఱి మొఱ్ఱి దైన - వేడ్క- కవులు.

ఛంద మనిన వట్టి చాదస్తమా? కాదు ;
అది కవిత్వమునకు - ప్రాణనాడి ;
అనియత మగు ఛంద మజ్ఞాతముగ నుండు;
అరయ -వచన కవన మందు గూడ.

కవిత లోన - సార్థకము గాని శబ్దముల్,
గోచరింప వచ్చు - కొన్ని కొన్ని,
కానుపించ వచ్చు - గణ పూరణములుగా!
అవి క్వణత్ కలకల రవ సదృశములు.

ఛంద మందు -కలదు -శబ్దార్థముల మీరి
ఊయెల వలె వేగ ఊగు మహిమ,
ఛందము సమకూర్చు చైతన్య లయ లీల
ధ్వని ధునీ సదా ప్రవాహ ధార.

చక్కిలి గిలి పెట్టు - శారదా హృది కైన
కవిత కల రవమ్మ - కలవరమ్మ
అమర జేయు-కవిత - అవ్యక్త మాధురుల్,
గుండె లోన మౌన కూజితములు.

పద్య పఠనమునకు - బహుమానములు మేలు,
కవిత వ్యాప్తి చెందు అవని లోన,
కంటి నీటి బుగ్గ - కవితా ప్రవాహమ్మ !
శ్లోక మగును - గాఢ శోక భరమె.

అర్థ మైన -కవిత -ఆనంద సంక్రాంతి!
మానసమున కూర్చు - మధురిమమ్మ;
అసలు -కవిత- సుంత - అర్థమే కానిచో!
మంత్ర సదృశ మైన - మహిమ నెరపు.

కరుణ రసము - ప్రాగ్రసరము- వాఙ్మయములో,
పిదప హాస్య రసము- బ్రదుకు నందు,
క్షీణ దశకు గుర్తు - శృంగార లౌల్యమ్మ;
కవిత -పూని- గుండె - కదుగ వలెను.

సంఘ మందు - కవికి - సమకాలికుల లోన
వచ్చు టెట్లు కీర్తి- పదవి -ధనము ??
రచన మించు నట్టి - వచన చాతురి యున్న;
లౌక్య మున్న - చాకచక్య మున్న.

పాట- రక్తి కట్టు-ప్రక్క వాద్యము లున్న,
కలియు - వచన కవిత - గాలి లోన;
కవిత -పద్య మందు- కంఠస్థమై నిల్చి
బ్రదుకు యుగయుగాల - హృదుల వెలిగి.

అనుభవైక వేద్యమౌ- అంశములు కొన్ని,
ఉండు దాగి - మనుజు గుండె లోన,
గుండె కలవరించు - గుస గుసల్ వినిపించు,
కనులు విరహ కవిత కార్చు వచ్చు.

కవిత లందు కలసి - కల కల ధ్వను లుండు;
వెలగి యతులు ప్రాసము లను దూరి;
అనురణనము లొచ్చు - అర్థవాదము లందు;
వ్యంగ్య గర్భితమ్ము - వాఙ్మయమ్ము.

యోగ్యులకు సలిపితి - ఉపకారములు కొన్ని,
ఏ ప్రతిఫల మభిలషింప కుండ;
మరణ శయ్య మీద - మనసులో సంతృప్తి,
కవిత కొంత నాకు - కలుగ జేయు.

సులభ శైలి - తేట సూటి మాటల కూర్పు,
అల్లి బిల్లి అలతి అలతి నుడులు,
మిసిమి తలపు జలుగు మిన్నేటి మిరుమిట్లు;
తరపి రచన-వెల్లి విరియ చేయు.

కలదు భావ పటిమ - కలదు సంగీతమ్ము;
ప్రతి పదమ్ము నందు - భాష యందు,
కవిత యందు తోచు - గంగా యమున లట్లు;
శబ్ద భావ బిందు సంగ్రహమ్ము.

ఆమని ఋతు వందు-మామిడుల్ పులకింప,
కొదమ కోకిలములు కూయునట్లు ;
చెట్టు కొమ్మ మీద - పొట్టి పిందెల పిందు;
చిరుతనవ్వు టలలు చిందు నట్లు.

చిన్ని కన్ని పెదవి చిరునవ్వు కెరటాల
బుగ్గ సొట్ట సుడులు పూడినట్లు
చీల్చుకొనుచు-చిమ్మ చీకట్ల తారకల్
మిణుకు-మిణుకు మంచు - మెరయు నట్లు.

నేల-పడును వాన- నింగి మబ్బుల నుండి
పులకరించి మొగ్గ - పువ్వు అగును,
గ్రుడ్డు నుండి పక్షి కూన వెల్వడి వచ్చు;
కలము నుండి అట్లె - కవిత వచ్చు.

చేరి చేరి వివిధ వైరుధ్యముల మధ్య
సంధి చేయు నిత్య సత్యము వలె,
మహిత తపము లోని - మౌన గానము వోలె,
కవిత -పారు గాత - కలము నుండి.

తెలుగు పద్య కవిత -చిలుక పల్కుల తేట,
దిక్కు - గొప్ప వేట కుక్క అరపు;
లలిత గేయ కవిత - కలవరింతల మూట,
వట్టి సంత గోల - వచన కవిత.

కవిత- యెప్పు డంక గణితమ్ము కాలేదు;
బ్రదుకు - గణిత శాస్త్ర పరిధి దాటు;
అర్థవాద రూప మందున్న సత్యమ్ము,
వాస్తవ జగమునకు- ప్రగతి గూర్పు.

పద్యము నడిపింప పట్టాలు- ఛందస్సు;
తారు రోడ్డు మేలు కారు నడువ,
కడలి అవసరమ్ము గాదె - ఓడల కెల్ల!
గాన మేది ? తాళ గతులు లేక.

పద్య మనిన ఏమి ? ప్రాసముల్ గణయతుల్
కలసి యున్న మాత్ర కవిత కాదు;
కవిత -కన్య కాదు - గర్భిణీ సతి గాని,
పుట్టు బిడ్డ యుండు-పొట్ట లోన,

పద్య మందె సతము ప్రతిభ తారాడునా ?
ప్రతిభ - గేయ మందు - పరిఢవిల్లు.
వచన కవిత గొప్ప ప్రతిభ యుండుట కద్దు;
కన్ను దోయి - ప్రతిభ కానుపించు.

చిట్టి తమ్మి కుట్టి- చిలిపి పద్యము సుమ్మి,
మెలితి తిరిగి తోచు - మీస కట్టు;
పోతు కోడి పుంజు-వై తాళికాలాపి
ఎక్కు సింహ పీఠి అక్క నణచి.

అరయ మానవుండు - ఆలోచనా శీలి,
మెదడు హృదయ మున్న మేటి ప్రాణి;
మానవతకు - కవిత -మరి పరాకాష్ఠయే;
కవిత - రాచరికము కన్న మిన్న.

కవిత కూల బడును - కదప కుండగ నాల్క,
సహృదయుండు లేని సభల యందు,
సహృదయ వరుడు- మృతసంజీవనీ విద్య;
చూపి -కవన సభల ఊప గలడు.

కాలము బట్టి - దేశమును గాంచి జనావళి నెంచి పొంచి, ధీ
శాలి గ్రహించు వాక్యముల సంధిలు నర్థములన్ -నిఘంటువు
చాలవు- కావ్య శబ్దముల సార మెరుంగగ- సాహితీ సము
న్మీలుడు సంగ్రహించును ధ్వనిన్- కవి భావ తరంగ గానము

కవిత- ఏక రసము కాదు వాఙ్మయములో;
నవ రస రుచిరమ్మి కవిత యెపుడు !
సర్వతోముఖమ్మి - సర్వతోభద్రమ్మి!
సకల వాద భేద సంభృతమ్మి.

ఉన్న యెడల - హృదిని ఉద్వేగ భావమ్ము,
భాష యందు తూగు పరిధ విల్లు
చిందు త్రొక్కుచుండు ఛందస్సు - రచనలో!
సామెత ప్రవహించు శబ్ద లహరి.

గుండె మెదడు కలుపు గొప్ప కూడలి యేది ?
సకల నదులు కలియు సంద్ర మేది ?
సర్వ కళల కేది సంగమ క్షేత్రమ్ము ?
కవిత - దివిని భువిని కలుపగలదు.

కదపి కుదుప వలెను - కవిత గుండెకు పట్టి
క్రొత్త క్షితిజములను కూర్చ వలెను !
ఉద్భవింపవలెను - ఉన్నత క్షితిజముల్
మెదడు నందు - కవిత చదువు నపుడు.

కవి - అదృశ్య సహజ కవచ కుండలి తోడ,
క్రాంత దృష్టి యున్న కనుల తోడ,
ప్రతిభ జాలువారు వదన వర్చస్సుతో;
ధరణి-తిరుగు చుండు శిరము నెత్తి.

సహృదయ వరులైన - సమకాలిక ప్రజల్
గుర్తు పట్టలేరు గొప్ప కవిని,
చూడ - సుకవి- సంఘ సోపాన పంక్తి పై
పైన నిలిచి - తరచు కానరాడు.

కవికి హెచ్చు - కీర్తి కండూతి - బ్రదుకులో!
కవి యశస్సు - సులువు కాదు కాదు;
కలము త్రిప్పి -త్రిప్పి- ఘనకార్య మేదియో
సలిపి నట్లు కవులు తలచ వచ్చు.

చ్ఛాలమంది జనులు - సంగీత కళలోన
తప్పు తాళ మెరిగి చెప్ప గలరు;
ప్రౌఢ కవిత లోని భావనా గతియందు
తప్పు తాళ మెవరు చెప్పగలరు ??

కష్ట పడెడి వాని కన్నీరు తుడిచియే
కలము పట్టు గాక కవి వరుండు;
కదల దగును- మొదట- కవి-క్రియాశూరుడై;
పిదప - పిదప- రచన బ్రదుకు నందు.

అహము బొమ్మ బొరుసు లమృతమ్ము విషములే!
కవన దోహదమ్ము గర్వ గరిమ;
క్రక్క రాదు విషము -కడుపు చేర్చగ రాదు !
గరళ కంఠు డగుత - కవి వరుండు.

కథలు గలవు - వివిధ మత పురాణాలలో;
అవి అమానుషములు అద్భుతములు;
పొట్ట లోన దాచి పెట్టుకో దగు గాని,
చేర్చు కొనగ నేల శిరము మీద ?

మధుర కవిత - తరచు మనుజు గుండెను దూరి,
మధువు కంటె గొప్ప మత్తు కూర్చు,
అరయ -కవిత మత్తు మరణించు వరకుండు;
తెల్లవార- తీరు-కల్లు మత్తు.

చూడ వచ్చు గొప్ప శోభా నిదిధ్యాస;
మౌని తాల్చి తంబురాను మీట;
సరస బృంద వాద్య సమ్మేళనము లోన,
నాద బిందు కళలు - నాట్య మాడు.

కలుప వచ్చు - కవులు - తెలియనట్టిది కొంత,
చిక్క నైన, కవన శిల్ప మందు,
కూర్చు, తిండి లోన - గులక రాళ్లను కొన్ని;
పూని -పావురాలు- పొట్ట లందు.

ఆంగికాభినయము - హస్త చాలనముతో
చూప గలడు సభల నూప గలడు;
మంద్ర నాద వేది - మార్దంగిక మహర్షి;
లలిత లయ విలాస లాస్య కర్త.

వాయులీన మరయ పాశ్చాత్య జంత్రమే!
కలిసె భారతీయ గాన లహరి,
రాగ యోగ సుధల ప్రస్తార సూక్ష్మాల,
వెల్లడించు - నాద బిందు కళలు.

కట్టు కథలు వ్రాసి - కవిత కూర్పగ వచ్చు;
గొప్ప నీతి కథలు - చెప్ప వచ్చు;
చేసి మంచి పనులు-స్వీయ జీవిత మందు ,
చూపు నట్టివాడె - సుకవి అనిన.

కాననౌను - కవిత- కల్పనా కథ వోలె,
ఊహ జగతి అతిశయోక్తి యనగ,
జిలుగు మేలి ముసుగు వెలుగు వల్వలు దాల్చి,
నమ్మ లేని నిజము సుమ్ము-కవిత.

కవిత లోన గూడ కలదు - లావణ్యమ్ము,
మాట కంద నట్టి మధురిమమ్ము;
కవిత -బ్రదుక గలదు - కాలాని కెదురీది;
నాట్య మాడు ప్రజల నాల్క లందు.

కవిత - శిల్ప చిత్ర గాన విన్యాసముల్;
క్షాళనమ్ము చేయ గలవు - హృదిని;
తీర్చి దిద్ద గలవు - దివ్య సంస్కారమ్ము,
అమృత యోగ సిద్ధి - నవఘళించి

విమల కవిత - మరియు వినుత వేదాంతమ్ము,
విరియు ఏక లతకు విరులు రెండు !
తరళ కవనమునకు - తత్త్వ; సౌభ్రాత్రమ్ము
ఇంపు సొంపు పెంపు నిముడ జేయు.

ప్రాథమిక కవనము - వచనమే - నాదమే!
కలిసి తాళ లయలు వెలసె - పాట;
పద్య విద్య పుట్టె - వైతాళికమ్ముగా,
జగతి - భాష మనుజు జన్మ హక్కు.

విశ్వ మందు - సుకవి వేదాంతి - మేధావి;
నిర్ధనుండు - ఋషి మనీషి -త్యాగి;
జగతి హితము కోరు - ప్రగతి ప్రభావుండు;
కాడు - గాలి మూట కట్టువాడు.

జనని - పద్య కవనమునకీ జగత్తులో,
స్రష్ట యైన బ్రహ్మరాణి - వాణి,
అరయ - గేయ కవిత - అక్కయై జన్మించి,
పెంచె - తమ్ముకుల్ల ప్రేమ తోడ.

అవసరమ్ము మనిషి కానంద విశ్రాంతి,
జీవ కణములకును - చిత్తమునకు;
లలిత కళలె -ఇవ్వ గలవు - ఆనందమ్ము,
విశ్రమమ్ము - ఆట విడుపు గలిపి.

సలుప రాదు కవులు - ఛందస్సు తగ్గించు
యత్న మెపుడు కవిత లందు పూని;
అమర చేయు చుందు రధికమౌ ఛందస్సు,
కోరి కోరి తరచు - గొప్ప కవులు.

కవి వరుండు తిరుగు - కారెక్కి - ఊరిలో!
కవిత వ్రాసి - గొప్ప కథలు వ్రాసి !
ప్రజల మోసగించి పచ్చి బొంకులు పల్కి,
బ్రతుక నేల అంత ప్రతిభ గలిగి.

భాష - కూర్చ వలయు భావానుగుణముగా;
అర్థ జతులు గతుల కనుగుణముగ;
నవ రస రుచిరమ్ము - కవన వైవిధ్యమ్ము!
కానుపించ వలెను - గ్రంథ మందు.

పుట్టి నాభి కుహరి పొంగారు ఝరి యౌచు,
పారు కవిత-కంటి నీరు చేరి;
బ్రదుకు హాయి గూర్చు నిదుర మైకము లోని
కలువరింత లెటుల కవిత లౌను ?

గద్ద - యెగర గలదు - గగన వీథుల లోన ,
కాకి ఎగుర గలదు - గాలి లోన
ఎగుర వచ్చు - కవిత - గగనాంతరాళాల
అందు తారతమ్య మరయ వచ్చు.

కానుపించు గాన కళ యందు విరివిగా,
యతులు ప్రాస జతులు గతులు గూడ.
శ్రవణ పేయ మగుచు-సంగీత విద్యలో,
పద పునః పునర్నినదము తోచు.

సహృదయ హృదయమున - సమకూర్చ వలె - వెల్గు,
సాహితీ రచనలు సత్వరముగ;
గుండె లోన దాగు - గుడ్లగూబల తోలి,
కొత్త ప్రొద్దు పొడుపు - కూర్పు - కవిత.

కలలు కనెడి శక్తి కలవారు - కొందరే!
దిద్ద గలవు - కలలు-దేశ చరిత;
కలల లోన ప్రగతి కన్పించు - మును ముందు.
కవుల జన్మ హక్కు - కలలు గనుట.

సాహితీ రచనము - ఛాయా శబలితమే!
తెలుప లేదు నరుల తలపు పదము;
కవి హృదయము పసిడి కలలు పెట్టెడు గూడు!
కల కల ధ్వని లయ విలసితమ్ము

క్షీణ దశ కదృశ్య చిహ్నమ్ము - భోగమ్ము,
లలిత కళలు - భోగ లాలసములు;
బ్రదుకు నందు- సముచితారాధనము చాలు;
వృత్తి కంటె - మరి ప్రవృత్తి - మేలు

సహృదయుండు - సముడు - సాహితీ తపములో,
మంచితనము నందు మించు కవిని,
పరుల ప్రతిభ గుర్తుపట్ట గల్గినవాడు,
విడిచి పెట్టు నహము నెడద నుండి.

కవిగ తిరిగి నాడు- కడుపుతో ! ఉన్నాడు !
సభల కెక్కినాడు - చాల పార్లు !
గ్రంథ మవతరించె - గర్భ విస్రావమై !
ముష్టి వెధవ - కవుల దిష్టి పిడత.

అమిత కీర్తి తోడ - సమకాల జగతిలో,
కవి వరునిగ వెలుగు గాక - ఎవడొ !
ఒక అనామక కవి- యుగ యుగాంతములలో;
గొప్ప పేరు తెచ్చు కొనును - పిదప.

శాస్త్ర లక్ష్య మేమి ? జగతిలో సర్వధా
సత్య శోధనమ్ము - సలుపు గాత !
గుండె దున్ని విత్తి పండించుటే సదా !
లలిత కళల పరమ లక్ష్య మగుత.

బ్రతుకునకు సతతము - ప్రతిబింబ సదృశముల్,
ప్రతిభ యున్న కవుల రచన లెల్ల ;
కవులు కూర్చు నట్టి కల్పనా కథలైన,
వక్ర దర్పణములె-వాస్తవతకు.

చేరు చక చక మృదు చమత్
కారము స్థిర శంప యొచు - కాంతిచ్ఛవిమత్
చారిమ లొలుకు సమస్యా
పూరణములు తెల్గు బాస - పొంపిరి వోవన్.

ఛందము లేని-కవిత్వము
పందిరి లేనట్టి తీగ- పతనము చెందున్,
చిందర వందర యయి పడి
అందము చందము విడిచెడు - అవనీస్థలిలో.

ఏది మంచి కవిత ? ఎట్లు చెప్పగ నౌను ??
పుట్టె కొక్క బుద్ధి పుట్టు చుండు;
కొన్ని ఇవ్వ గలను - క్రొత్త తూనిక రాళ్ళు;
సాహితీ పిపాసు సహృదయులకు.

ఉండ వలయు- కవికి - ఉద్యోగ మేదైన,
తిండి కొరకు -బ్రతుకు తెరువు కొరకు,
నిలువ రాదు - సుకవి- నీచ యాచకుడుగా;
బుద్ధి లేని- స్వప్న భోజనుడయి.

సహృదయుండు సరస సంగీత చతురుండు,
పద్య కవిత -కోరి- పాడ వచ్చు;
తర తరాల లోని- ధరణిపై-జన్మించి;
వచన కవిత పాడు వాడెవండు ?

అరయ - భాష కున్న ఛందస్సు సరిపోదు;
అమర వలెను భావ మందు గూడ,
అక్షరాల నడుమ అర్థ ప్రతీతిలో;
చింద వలెను నాద బిందు కళలు.

పుట్ట వచ్చు -గుండె - భూకంపములు కొన్ని;
పగుల వచ్చు అగ్ని పర్వతములు;
ఊప వచ్చు గాక - ఉప్పెనల్ చెలరేగి,
కవిత వ్రాయు: సుకవి కలల తేలి.

కవిత - వ్రాయ వచ్చు - కవి యౌచు జగతిలో,
తెలుపు కాగితాలు నలుపు చేసి;
సత్కపీఠు వెదకి - సన్మానమును సల్పు
సహృదయుండు గొప్ప సజ్జనుండు.

కరుణ వెల్లి విరియు - కవితాంతరాత్మలో;
బ్రతుకు నెరప వలెను ప్రతిభ చూపి,
తెలుపు కాగితాలు నలుపు చేయుట కాదు;
కవిత- జీవితమ్ము గడపు తీరు.

తొలగిపోక ఉండు తొలిరేయి బంధమ్ము,
మమత కొంత నిలుచు మనసు లోన;
మొదటి రాత్రి - పిదప పిదప ఎప్పుడు రాదు !
కలదు - మేటి - మహిమ - కాలమునకు.

అమృత కవిత - పుట్టు - అనుభూతి వల్లనే;
ప్రాణనాడి రచన కనుభవమ్ము;
ప్రతిభ కాదు - కాదు పాండితీ గరిమమ్ము;
వేరు ఏది కాదు విశ్వ మందు.

పానకమ్ము వోలె - ప్రవహించు ధారగా,
చిన్న నాడు కవిత చెప్ప వచ్చు;
పంచదార వోలె - స్పటికాలుగా తీర్చి,
ప్రౌఢ వయసు లోన - వ్రాయ దగును.

అరయ కవిత అనిన - ఆనంద విశ్రాంతి!
బ్రదుకు మరువ జేయు రస సమాధి,
వాక్య మొకటి చాలు - పదము నొక్కటి చాలు;
అక్షరమ్ము చాలు - అమృత మయము.

స్పందనమ్ము నరుని డెందాన లోపింప,
శవ సమాను డతడు జగతి లోన,
కారయిత్రి లలిత కళలలో భిన్నమ్ము,
సర్వ కళల నాడి-స్పందనమ్ము.

బాహ్య రూప రేఖ- ప్రజకు కన్పడ వచ్చు;
సుకవి చాయ బొమ్మ చూచి నపుడు;
ఆంతరంగిక మగు అంద చందము లెల్ల
కవిత చదివి నపుడె -కానుపించు.

తెలుగు లోన-ఆట వెలది - ఛందము నందు,
చిందు నాట్య నాద బిందు కళలు;
వడులు ప్రాస హొయలు నుడికారములు కూర్చు,
తేనె సోన లొలుకు - తేట తెలుగు.

సాహితీ మహత్తు - సంఖ్యా గణన కాదు!
వాసి గాని - పెద్ద రాసి గాదు;
పద్య మొకటి చాలు - ప్రజల నాల్కల పైన,
నిలిచి నాట్య మాడ గలిగి నపుడు.

నిదుర పొదుగ గలదు - నిజమైన కవనమ్ము!
కలలు రంగరించి కళలు తీర్చి,
ఎగురు కవిత లింక - గగనాభిరామముల్!
మృదు తపస్సమాధి వదలి పెట్టి.

ఎగిరి - గాన విద్య - గగన రోదసి చేరు,
తిరుగు చుండ గలదు ధరణి చుట్టు;
గానమునకు అరయు - కవనమ్ము-రాకెట్టు;
కవిత లేక - గాన కళయె లేదు.

అల్ప గాయకుండు యాచకుం డగుచుండు,
జనులు చేరు నట్టి స్థలము లందు,
కవి - పరోప జీవి - కారాదు - జగతిలో;
బ్రతుక - బిచ్చ మెత్త రాదు - కళలు.

బ్రతుకు కేవల మొక - వ్యాపార కేంద్రమా ?
గ్రుడ్డి గానుగెద్దు త్రోవ యగునె ?
వెలుగు గుండె నింప వలె కళాకారుండు,
తర తరాల ప్రజలు తలల మాప.

కలము చేటు - తెల్ల కాగితములు చేటు;
కాల హరణమె సుమ కవిత వ్రాయ;
కవి - పరోపజీవి- కారాదు పుడమిపై
చేత నైన-సంఘ సేవ - మేలు.

మెరుగు పెట్టవలెను - మేల్మి బంగరు కైన,
రజతమునకు నైన - రాగి కైన,
తళుకు బెళుకు గూర్చు తెలివి యుండిన మేలు,
కవికి నైన - విశ్వ కర్మ కైన.

వదలి సిగ్గు - మనుజ హృదయ దౌర్బల్యమ్ము,
కొల్లగొట్టి - ధనము కూర్చు కొనును;
చలన చిత్ర మనిన - కళ కాదు నిజముగా,
వట్టి మాయదారి వర్తకమ్ము.

తెలియ రాని వ్యాధి దేహమ్ములో గాక,
ముందె మనిషి మనసు నందె దాగు;
కళల వలన - మనసు - కాపాడు కొన వచ్చు;
కలుగు మేలు - నాటకాలు చూడ.

భాష - ముందు పుట్టు - ప్రాచీన చరితలో,
వ్యాకరణము పిదప-వ్రాయబడును;
లలిత కళలు ముందు - లక్షణ గ్రంథాలు,
పిదప-అవతరించు - పృథివి యందు.

కవితలు చదివిన చాలును
కవితలపై ప్రేమ చాలు - కమ్మని హృదితో
కవితల నల్లిన చాలును,
కవితయె కైవల్య మవని - కనరా సుమతీ,

కవిత - దిన దినమ్ము గడపు జీవితములో,
అడుగు అడుగు నందు అమరు గాత;
అంద చందములను - అమృతమ్ము చిందించి,
కరగి పోవు - గుండెకాయ - కవిత.

కవిత - కోతి సాము గరిడీలు - కాదయా,
యతులు-ప్రాస గతులు జతులు గావు;
కాదు - తళుకు బెళుకు గడుసు మాటల కూర్పు;
గుండె నిండ చేరి యుండు - "వెలుగు".

ఎంచ కుండ పెక్కు మంచు గడ్డలు పేర్చి,
ఇండ్లు కట్టు చుందు రెస్కిమోలు !
కవులు - వాస్తవాలు గణియింపకుండగా,
కట్టు చుందు రిండ్లు-కలలు పేర్చి,

పోతు నెమలి కొదమ పురివోలె - నేలపై
కూడి - కవిత శబ్ద మాడ వచ్చు;
ఇంద్ర ధనువు వోలె - ఏడు రంగులు చిమ్మి,
గగన సీమ - జిలుగు గ్రమ్మవచ్చు.

మెక్క వచ్చు - కూర్పు - మేలి బియ్యము వండ,
సహృదయుండు పాక సరళి మెచ్చు;
వడ్లు - మణులు కలిపి వండి వడ్డించుచో,
అవని తినెడి మనుజు లెవరు గలరు?

పదుగు రాడు మాట - పద్యమై ధర జెల్లు;
పేరు తెచ్చి కవికి పేర్మి గూర్చి;
పరిమళించు చుండు - ప్రజల గుండెల లోన,
బ్రతుకు లందు-వెలుగు బాట-వేసి.

అచ్చపు కవనము ప్రజలకు
నచ్చినదే-నాల్కల పయి-నర్తించునదే!
మెచ్చినదే మరి నెమరుకు,
తెచ్చునదే జీవితమున దిన దిన మందున్.

అంగ రసము గాగ - హాస్య ముండుట మేలు;
కథల యందు-నాటకాల యందు;
అంగి రసము లగుచు - శృంగార కరుణముల్,
రక్తి కట్టు - కవుల రచన లందు.

మెచ్చ వచ్చు - "ధ్వనులు" - మేటి కావ్యము లందు,
మరి - ప్రతి ధ్వనులను మరువ దగును;
వాణి - మెచ్చు - సొంత బాణీలు మాత్రమే !
నీడ వేరు - అసలు నిజము వేరు.

శబ్ద మేది కలదు ఛందస్సు లేకుండ ?
శబ్ద రహిత మైన ఛంద మేది ?
ఛంద మందు - పారు - సంగీత రస ఝరుల్;
లయలు ఛంద మందు - లాస్య మాడు.

అవసరమ్ము మనిషి కానంద విశ్రాంతి,
జీవ కణములకును చిత్తమునకు,
లలిత కళలె ఇవ్వ గలుగు - ఆనందమ్ము,
విశ్రమమ్ము ఆట విడుపు గలిపి.

కలలు మిథ్య లంచు పలుకు వా రున్నారు,
వెక్కిరింప వచ్చు వెఱ్ఱివారు;
తథ్య మైన దేది? ధరణిపై బ్రదుకులో ?
కవుల జన్మహక్కు -కలలు గనుట,

స్నాన పాన గాన సమయాలలో గూడ,
మధుర కవిత యైన మరపు రాదు;
గుండె లోన - కవిత - కురిపించు అమృతమ్ము;
మనసు లోన - 'రస సమాధి' కూర్చు.

ఆట - కొంత కాల హరణమే అనవచ్చు !
అంతె పాట గూడ - అంతె - కవిత;
కవిత -హృదికి గొప్ప కరసత్తు చేకూర్చు;
ఎడద మలినముల- కడుగు- కళలు.

సత్తా గలుగు తెలుగు కవి
వృత్తాలను వ్రాయు గాని - ఏవో కవితల్
చెత్త చెదారము పై - ఉ
న్మత్తాలాపములు వ్రాయునా ? చిరు రచనల్.

అది కవనము కాదు - అర్థమ్ము గాకుండ,
ఊహలందు మిగిలి యుండ దేని,
కవన కల రవమ్ము-కలవరమ్ములు రేపు;
చేరి-గుండె పొరల-దూరి యుండు.

గొంతు లోన - యుగ యుగాంత సంగీతముల్
నవ రస రుచిరముగ నాట్య మాడ,
సహృదయుండు -పలుకు- సభ లోన చప్పట్లు
మారు మ్రోగ - మిన్ను మన్ను గలిపి.

ఈ ప్రపంచ మందు - ఏ కైక కవి నేత
తానె యంచు ఒకడు తలచె నేని !
అవని అంత కంటె అవివేకి యెవడయా ?
రమ్య హాస లోల ! రామకృష్ణ.

అణగి మణుగు - కవిత - అవ్యక్త మధురిమల్
కలవరింత లలము కలల అలల,
మ్రోయు - కవిత - వాణి వేయి తంత్రుల వీణ;
వేల విరుల తావి వెల్లి విరియ

భాష దేని కొరకు ? భావ ప్రకటనకే !!
భావయిత్రి కవిత ప్రాణ నాడి ;
వ్యాకరణము వట్టి ఆహార్య బహుళమే !
సరళ రచన - మేలు - చాలు -ప్రజకు.

కవిత - అరయు సృష్టి నవ నవోన్మేషమ్ము,
క్రాంతదర్శి - సుకవి - రస విరాట్టు;
కలము హలము చేసి - కవి - దున్ను హృదయముల్
కవి -సనాతన నవ నవ మహర్షి.

కరగి గుండె - ఆర్తు కన్నీరు తుడుచుటే
కవన రచన కంటె - ఘనము సుమ్ము;
గొప్ప దేది కలదు ? గుప్త దానము కన్న ?
సానుభూతి సహిత చర్య కన్న??

కాల హరణమె గద - కవిత వ్రాయుట యన్న,
తోటమాలి కృషికి - సాటి గాదు,
చదువు నట్టి వాని సమయమ్ము వ్యయ మౌను
కవి - గ్రహింప లేడు కటిక నిజము.

శుష్క శూన్య నీతి సూత్రాలు రచియించు
కవికి - కోయ వలయు చెవులు ముక్కు,
తెలుపు కాగితాలు - నలుపు చేయుట కాదు,
సార్థక మగు - కవిత- చర్య వలన.

సంగమించి తోచు గంగా యమున లట్లు
భవ్య కారయిత్రి - భావయిత్రి,
రస తరంగిణి యగు రామాయణము నందు;
పూవు తావి కలిసి పూచు నట్లు.

కవిత లందు - హెచ్చు - కల్పనా శాతమ్ము;
నేల మీద నున్న నిజము దాటు;
నర చరిత్ర - ప్రగతి పరిణామ సరణిలో,
బ్రదుకు నందు ఒజ్జ బంతి - కవిత.

కవిత - నీళ్ల పాల కడవయే తరచుగా,
కొన్ని కవిత లుండు - వెన్న వోలె,
కవిత లుండు కొన్ని - గడ్డ మీగడ వోలె
గాలి లోన - కొన్ని కవిత లుండు.

పదవి లేని కవికి - వ్యవధి యుండును హృదిన్,
రస సమాధి కలుగు రచన లందు;
ప్రతిభ కంటె - దండి పాండిత్యమున కంటె,
రక్తి కట్టు - కవిత-రస సమాధి.

మెదడు కాదు - కవిత - పదజృంభణము కాదు!
శ్లేష సరణి శబ్ద ఘోష - కాదు;
చదువరులకు కలుగు హృదయ సంస్కారమే!
మానవత్వ మసృణ మధురిమమ్ము.

వేదిక పయి - కవులు - వెళ్ళవచ్చును గాక,
జోరు గాక -జనము - సభను విడిచి,
స్వీయ కవిత కోరి వినిపించు -కవి గారు,
ఒక్క మైకు ఎదుట ఉన్న - చాలు.

కల్లు త్రాగి - బ్రదుకు కష్టాలు నష్టాలు
మరువ వచ్చు- కొంత మంది తరచు,
కవిత లల్లు కొనుచు - కష్టాలు గిష్టాలు
మరిచి పోయి కవులు తిరుగ గలరు.

భారతమ్ము - కొంత-పఠియింప ప్రతిరోజు
దుమ్ము - మెదడు నుండి - దులుప వచ్చు;
దిన దినమ్ము - కడగి - వినినచో గానమ్ము;
సలుప వచ్చు - హృదికి - క్షాళనమ్ము.

లాస్య మాడ వలెను - లయల విన్యాసముల్;
భాష యందె గాక - భావ మందు;
అరయ - భావ భాష లశ్వద్వయము గదా!
కదను త్రొక్కి లాగు- కవన రథము.

దర్పణమ్ము లేక - ధరణిలో మనుజుండు,
తన ముఖమ్ము నరయ తరము గాదు!
ప్రజలు చూడవచ్చు-బాహ్యాంతరము లెల్ల
దివ్య దర్పణమ్ము తీర్చు - "కవిత".

వ్యయము చేయ - ధనము - స్వార్థమ్ము కోసమై,
వ్యర్థ జీవి - మనిషి - బ్రదుకు నందు;
వాడు నెడల భాష - ఆడంబరత - కోరి,
గొప్ప పండితుండు కుకవి యగును.

కవిత కూర్పగలదు - కనులలో వర్షస్సు!
మాట లందు - దివ్య మధురిమములు!
జగతి హితము తీర్చు - ప్రగతి దీధితి పేర్చి,
యుగ యుగాంతరాల-ఉజ్జ్వలతలు.

సుడిగాలికి వడ దెబ్బకు
చెడిపోవ అడుగు జాడ చేర్చును గదరా,
నుడి గుడి శిలల - కవీంద్రుల
యెడదల యుగ యుగముల ప్రజ లెల్ల నుతింపన్.

జరుప నేల గొప్ప సభలు సన్మానముల్
పేర్మి కూర్మి తోడ - వృద్ధ కవికి?
అధికమౌ అతనికి ఆయురారోగ్యముల్ !
ఊరట కలుగు నవ యువ కవులకు.

కవిత చదువు నపుడు - కవిత - వ్రాసెడి వేళ,
మనము మరొక లోకమునకు చేరు;
మానవుండు సచ్చిదానందమును పొందు;
ఐహిక పరితాప మాగి పోవు.

చాకలి వానికి బానిస
గైకొని మూటలను మోయు గాడిద అనినన్,
లోకుల కే గౌరవ మ
ట్లే - కవి - జీవించిన యెడ - హీనుడు గాడే!

గుండె దున్ని - వెలుగు పండించుటే గదా,
లలిత కళల కెల్ల - లక్ష్య మొకటె;
అంద చందము లిడు - ఆనంద రస సిద్ధి,
సహృదయునకు కలుగు సానుభూతి.

బలము గలిగి నట్టి - అలతి మాటల కూర్పు,
సులువు - జనుల కెల్ల- తెలియ గలదు;
కవిత చెప్పు నెడల - కఠిన శబ్దాలతో,
సహృదయుండు గూడ - చదువ లేడు.

వ్రాయ వచ్చు - పెద్ద గ్రంథాలు కోశాలు
ప్రతిభ లేక - వెట్టి శ్రమ పడి పడి;
ఒక్క రసమయ మగు - వాక్యమే చాలుగా,
కవిత యగును - అమృత కావ్య మగును,

తొడిమ యున్న యెడల - విడిపోదు పుష్పమ్మ,
గ్రంథమునకు పీఠిక అవసరము ;
లుప్త దృక్కులకు - సులోచన ద్వయి గూర్చు,
పీఠికా రచయిత - పేర్మి తోడ.

పెద్ద రాళ్ళు పేర్చి - పిరమిడ్లు శ్రమ కోర్చి
కట్టినారు - పూర్వ కాల మందు;
వ్రాయ వచ్చు-పెద్ద గ్రంథముల్ కావ్యాలు;
శ్రమకు నోర్చి - అక్షరాలు పేర్చి.

సగటు మనుజు నందు - స్పందించు డెందమే!
ప్రగతి తెలుపు - నవ్య యుగము లోన,
జనుల మేలు కోరు సంస్కార హృది తోడ
చదువు - పదవి - మెదడు సాటి గావు.

అల్ల వచ్చు కొన్ని లొల్లాయి బుల్లాయి
కవన బుద్బుదములు గాలి తేల;
చేయు వచ్చు ప్రేలి చిరు సవ్వడులు గూడ;
పుట్టి పుబ్బ లోన - గిట్టు మఖను.

క్షణము కదల కుండ - కాలమ్ము స్తంభించు,
గుండె ఆగి మరల కొట్టు కొనును,
చదువ కవిత తోచు సద్యః పరనివృత్తి,
ఎంచ ఒక మరో ప్రపంచ యాత్ర.

రేపు మాపు తరచు రూపాయి నాణెముల్,
కానుపించు ప్రజల కరము లందు,
ప్రతిదినమ్ము - నెచట రత్నాలు కనిపించు?
ప్రౌఢ కవిత - కానరాదు - తరచు.

హృదయ స్పందనమె గదా
బ్రదుకులో లలిత కళ లొచు పరివర్తనమౌ,
హృదయము పండని నరునకు
చదువు మెదడు పదవి - శూన్య సంరంభంబుల్

పిచ్చివారి సంఖ్య హెచ్చు సంఘము నందు ,
లలిత కళల వెలుగు తళుకు తగ్గ
మనిషి కవసరమ్ము - మానస స్నానమ్ము
క్రాంత రస సమాధి కొంత సేపు

కవి హృది శ్రుతి గల్పు కవి యున్న యుగములో,
కావ్య మందు పాత గాథ యున్న !
వాఙ్మయము చరితకు ప్రతిబింబ రూపమై,
ప్రజల నాడికి - అనురణన మగును

భాష - విషయ పుష్టి - భావ సంపద యున్న,
గొప్ప గ్రంథ మనుచు చెప్ప రాదు,
ఆంతర ప్రవాహి - ఆద్యంతములు కల్పి,
కూర్చు గాత - ఐక్య గుంఫనమ్ము.

ఉరుము లురిమి మెరసి - ఒక్క శబ్దము చాలు;
కురియ వచ్చు - కవన కుంభ వృష్టి
ఉర్వి పార వచ్చు - ఒక్క వాక్యము చాలు,
పొంగి అమృత రసము-గంగ వోలె.

శబ్ద భావ మెపుడు -సందర్భ శుద్ధిలో
ముడి వడి పయనించు పుడమి లోన,
అరయ కున్న ఏత దవినాను బంధమ్ము,
తరచు త్రొక్క వచ్చు-తప్పు దారి

కవిత - మిథ్య గాదు - కలల సంపుటి గాదు,
హృదికి రస చికిత్స - బ్రదుకు నందు,
నాద భావ జతులు - నాళాలలో దూరి;
కాయ మెల్ల శుద్ధి చేయ గలవు.

కవిత లేవి గలవు ? కను సైగలను మించి
వాలు కన్ను బొమల వంపు కంటె ?
నింగి కెగయు వేడి నిట్టూర్పులను దాటి ?
నేల నంటు కంటి నీటి కంటె .

యోగి - కవి వరుడగు - ఒక మెట్టు దిగజారి,
భావ వేగి - న్యాయవాది యగును.
న్యాయమూర్తి యైన అధ్యక్షుడా ? కాడు
కవి - ప్రవాహ లహరి - కడలి కాడు.

ఉండు - సంఘ మందు - యుగ ధర్మములు కొన్ని,
ప్రతి ఫలించు చుండు - వాఙ్మయమున;
సాహితీ చరిత్ర - సంఘ స్వరూపమ్ము;
కవల బిడ్డల వలె - కానుపించు.

కైపు కూర్చ గలదు కవిత వ్రాసిన - తథా
అధిక మగును - చదువు నపుడు గూడ;
ఉజ్జ్వలోజ్జ్వల మగు ఉన్మాద సదృశమ్ము;
అనుభవైక వేద్య మది - రసమ్ము

పరుగు లెత్తు ఇనుప పట్టాలపై - రైలు,
తారు రోడ్డు మేలు కారు కొరకు,
గగన సీమ కెగురు - కవిత రెక్కలు గల్గి,
యతులు మరియు ప్రాస గతులు గల్గి.

కవితపై పడు - సమకాల ప్రభావమ్ము,
పాత వైన గాని-పాత్ర లెల్ల;
సాహితీ సమీక్ష - సంపూర్ణ మన రాదు,
అరయ కున్న యెడల చరిత గూడ.

కల్పనా కథ యని - కవిత - త్రోయగ రాదు,
సార్వ కాలిక మగు - సత్య మదియె,
కట్టు కథలు కావు పిట్ట గాథలు కూడ,
అంతరాత్మ బోధ - అరసి నపుడు.

రచన - గుండె నెల్ల - ప్రక్షాళనము చేయు;
కవిత గాని - కృతక కథయె గాని;
సహృదయునకు సరస సాహితీ పఠనమ్ము;
అమృత సరసి ఓల లాడు కొరకె.

అనియత మగు ఛంద మమరు శ్రీశ్రీలోన,
భాష యందె కాక - భావ మందు,
కాదు - వట్టి వచన కవిత - శ్రీ శ్రీవ్రాత,
అతడు - ప్రాస జతుల కాట తోట.

పరుగు లెత్తు - రైలు - పట్టాలపై- వేగ,
చూడ - పద్య విద్య - సులువు సులువు!
గగన యాత్ర - వచన కవనమ్ము - కష్టమే !
గొప్ప గేయ కవిత - ఘోర తపము.

వ్రాయ నేల కవిత ప్రజల కోసమెగాక ?
కవిత కెవరు విలువ గట్ట గలరు ?
ప్రౌఢ రచన మణగు గ్రంథాలయాలలో;
గాలి తేలు తేట కవిత లెల్ల.

కవిత -వ్రాయ వచ్చు - కవితాత్మ లేకుండ !
గ్రంథకర్త యశము - కాంచ వచ్చు !!
కవిత - వ్రాయ కుండ - కవితయై నిలు వెల్ల,
పామరునిగ - ఒకడు - బ్రదుక వచ్చు.

కమ్మ నైన - ప్రేమ కవిత - వ్రాయగ బూను,
కౌగిలింప లేని కరము - తరచు;
ప్రణయ సిద్ధి గాంచు - ప్రజ్ఞాధురీణుండు
తేనె నాను మూగ తేటి వోలె.

సకల కళల కాత్మ - సౌందర్య సంప్రీతి,
తరళ దివ్య దీప్తి దర్శనమ్ము;
అంతరంగ మందు - సంతోష నిర్వృతి;
బ్రదుకు మరువ- జేయు - రస సమాధి.

కళల కధిక మహిమ - గలదు - వైద్యము కంటె;
రసము మిన్న - పాదరసము కంటె;
అతిశయింప జేయు - ఆయు రారోగ్యముల్!
హృదయ శుద్ధి గూర్చి బ్రదుకు లందు.

కవిత - బ్రదుకు లోన - కాగూడ దొక వ్యాధి,
చదువ వచ్చు కవిత - చాలు చాలు;
మరువ దగును మనిషి తరచుగా కవి పేరు;
మంచి కవిత నెపుడు మరువ రాదు.

చూడ - పూత పసిడి - ఆడంబరత్వమ్ము,
వాఙ్మయమ్ము నందు - బ్రదుకు నందు;
భావ రహిత రచన - భాషా ప్రకర్షచే,
కప్పి పుచ్చ జూచు - కవి యశస్వి.

కవి - యొక డగు గాత్రముతో
కవి - మరి యొక- కరమున కలమును బట్టన్;
అవనిన్ సతతము - నభినవ
నవ కవి యగు మరి యొకండు - నఖశిఖ మునదా.

నేర్పు తోడ - వృషభ నేత్రమ్ము సూటిగా
గురిని తప్పకుండ - కొట్టు సుకవి !
గ్రంథ పుటల వీడి కవితాప్రవచనాలు
సామెతలగు గాత జనము లందు.

మందు - మాన్ప లేదు - మనసు లోపలి వ్యాధి,
మనసు లోన - కలవు - మడత లెన్నో,
జబ్బు నయము చేయు - సంగీత మొక్కటే,
కడిగి - మనసు పొరల కలుషములను.

పంచదార వోలె - ప్రతిభా ప్రభాసమ్ము
కానుపించు స్ఫటిక కణము లోచు;
పాండితీ ప్రకర్ష -బాల్య ప్రణీతమై,
కానుపించు - పానకమ్ము వోలె.

ఎదుగు - మనుజు లందు మెదడు విశ్రాంతితో;
చదువు తలపు గుడ్ల పొదుగ గలదు,
విలువ గట్ట- మెదడు - వేయి చేతుల మించు,
కలలు గనెడి - సుకవి - కార్మికుండె.

సుఖము లందు - ఎంచి చూడ - సంభోగమే;
మేటి దంచు చెప్పు మాట నిజము;
అంత కంటె గొప్ప ఆనంద మున్నచో,
అది లలిత కళల రసానుభూతి.

పెక్కు పూవు లందు - పెక్కు తావులు విచ్చు;
    అంద చందములును అట్లె తోచు,
తేటి - పువ్వు లందు - తేనె గ్రోలెడు రీతి,
    చదువు కవిత లెల్ల - సహృదయుండు.

వచన కవిత యందు - వాక్య మొక్కటి వ్రాయ,
    పదను పెట్ట వలయు మెదడు కెల్ల !
పలుకు బడులు యతులు పడికట్లు ప్రాసముల్;
    పడిన చాలు - సులువు - పద్య రచన.

సత్కవీంద్రు లందు - స్వపరాగ సంక్లిష్టి
    కాను పించు తెలుగు లోన తరచు;
ప్రగతి కూర్చు - పర పరాగ సమ్మేళమే !
    అవతరించుత వసుధైక కవిత.

వర్తమాన మందు - భావి కాలము మెచ్చు
    కవి వరుండు ప్రజకు కానబడడు !
సగటు మనిషి తరచు సమకాలికుల లోన,
    పెద్ద కవిగ - గొప్ప పేరు గాంచు.

వ్యాకరణము గాక - వ్యవహార జగతిలో,
    తేలి యాడు తేట తెలుగు నుడులు;
ప్రాణ మున్న భాష - ప్రామాణికము గదా ;
    తలపు వెలుగు జిలుగు - చిలుకు గాత.

అణువు నణువు కలియ అగును - బ్రహ్మాండమ్ము;
కలిసి అక్షరాలు కవిత యౌను,
స్రష్ట అక్షరుండు - శబ్దమ్ము బ్రహ్మమ్ము !
అతడు కవిత కాత్మ - అతడు రసము.

జరిపి నపుడు మంచి సన్మాన విభవమ్ము;
గొప్ప ప్రతిభ ప్రజలు గుర్తుపట్టి,
రెండు కనులు గాని - గండె ఒక్కటి గాని,
చాల వెపుడు - కాంచి - సంతసింప.

తెలిసి - ప్రజల - తెలిసి- కాలమ్ము దేశమ్ము;
తెలిసి పలుకు బడుల తీరు తెన్ను;
జగతి హితము గూర్చి - ప్రగతి తత్త్వము తీర్చి,
వేయ వలయు - కవులు - వెలుగు బాట.

పదము పదము మధ్య - పంక్తి పంక్తికి మధ్య
కవిత - ప్రతిభ - దాగి కాన రాదు;
గాన మలర చేయు వీను దోయిని సోక,
కనులు చాలు నితర కళల కొరకు.

తెలుగు కవి యటన్న - తెలుగు పద్య మటన్న,
కలదు సంఘ మందు -గౌరవమ్ము ;
తెలుగులో నిరంకుశులు - నేటికిని కవుల్!
తలలు వంచకుండ - నిలువ గలరు.

వాఙ్మయమ్ము తరచి - వ్యాసుండు వాల్మీకి,
వ్రాసినారు గొప్ప గ్రంథములను;
కవి యుగమ్ము వేరు - కావ్య పాత్రలు వేరు,
బ్రతుకు వేరు - కవన రచన వేరు.

చదివి పారవేసి - పిదప ముట్టరు గదా;
కథలు గాని - నవల గాని యైన,
తరచు - కవిత లనిన దాచు కొందురు గదా!
చదివి - మరల మరల చదువు కొరకు.

వ్యాకరణము రాక - పాండిత్యమే లేక,
ఛంద మేమి కడగి చదువు కొనక,
పద్య కవిత వ్రాయు వారెంద రెందరో,
తెలుగు నేల నాల్గు దెసల కలరు.

ఎదుటివారి చేర్చి - బ్రదుకు తీర్చెడి వాడు
ఘనుడు - కృతక కావ్య కర్త కంటె;
పరుల జీవితాలు - బాగు చేయుట మేలు !
కల్ల బొల్లి కవిత లల్లు కంటె.

స్వేచ్ఛ విడిచి - ప్రకృతి చెఱసాలలో చిక్కి
ఏ కళా పిపాసు వెట్లు బ్రదుకు ?
కళ యన ప్రకృతి కనుకరణ మాత్రము గాదు!
చిత్రకారు డపర సృష్టి కర్త.

చంచలము లక్ష్మి - మాయా
ప్రాంచత్ చంచలము కీర్తి -బ్రదుకులలో - నిర్
వంచిత కీర్తి చివరకు ప్ర
పంచములో దక్కదు కవి వరులకు గాకన్.

మనుజు బెదర గొట్టు - ఇనుప గుగ్గిళ్లుగా,
మతము నీతి బోధ - బ్రతుకు నందు !
జీవితమ్ము లోన - జీర్ణ మయ్యెడు రీతి,
తత్వ బోధ కూర్చు - తరచు - కవిత.

చెవిని దూరి మరొక చెవి నుండి వడి పోవు,
గాన మనిన మధుర కళయె సుమ్ము;
కవిత - చెవిని దాటి - కనుదోయినే దాటి,
మెదడు దూరి నిలుచు కదల కుండ.

కవి - జగద్ధితమును కాంక్షించు హృది లోన;
ప్రగతి దండయాత్ర జగతి జరిపి;
అతడు కలము త్రిప్పు - అసిధారగా చేసి,
అమృత రసము పూసి అంచు లందు.

ప్రతిదినమున స్నానము శు
భ్రత దేహమున సమకూర్చు ప్రాకటముగ - హృద్
గత మగు మైలను బాప క
విత - అవసరము ప్రజ కెల్ల - విశ్వము లోనన్.

చూచి రోగి నాడి సూక్ష్మాతి సూక్ష్మమ్ము,
వ్యాధి గుర్తు పట్టు - వైద్య వరుడు;
జమల నాడి తోచు - సాహితీ కృతులలో!
సహృదయునకు తెలియు సంఘ చరిత.

అమృత రసాయనమై - జ్ఞా
నమయ హృదికి చిర పునః పునర్ దోహదమై;
మదుర మధురానుభవమై,
ప్రమదము గూర్చెడి - కవిత్వ పారాయణమే.

ఏది మంచి రచన? యంచు ఎంచగ వచ్చు??
'తొలి విరుపు' ను ముందు నిలుప వలెను,
'మధ్య మలుపు' మనసు స్మరియించు సర్వదా,
'కొస మెరుపును' కోరి కూర్చ దగును.

కలము నెవడు నింపు - నలుపు వెన్నెల సిరా;
కాడు కాడతండు - కవియె కాడు ;
కలము నెవడు - కల్కి ఖడ్గమ్ముగా చేసి,
అశ్వ మెక్కి తిరుగు - అతడె కవియ.

కవిత - పూవుటమ్ము గాని - ఖడ్గము కాదు!
చింద రాదు - రక్త బిందువులను,
నింప గలదు - కవిత - నెత్తావి కెరటాలు !
బ్రదుకు దిగ్ దిగంతరాల యందు.

కంజ మందు - కవిత - కింజల్క సదృశమ్ము;
జీవితము మహాసరోవరమ్ము !!
సౌరభాన్వితమ్ము - స్వర్ణ కల్హారమ్ము !
వేయి దళము లగును - విద్య లెల్ల.

చిత్త శుద్ధి - పెరిగి శిష్యు డౌను మనీషి,
కొంత - పొగరు లేని గురుడు లేడు !
తరచు శిష్యవరుడు - గురువుగారిని మించు;
త్యాగ మందు - జ్ఞాన యోగ మందు.

తాను - గురువు గారి క్రీనీడ కాలేడు;
శిష్య వరుడు - శుద్ధ చిన్మయుండు;
గురువు శిరము పైన - గొడుగు పట్టును గాని,
కాళ్ల క్రింద చెప్పు కాడు - కాడు.

బ్రతుకు లోన - ఏది ? రతి కేళినే మించి
సంతసమ్ము గూర్చు ? సహృదయులకు ?
అంతరంగ మందు - అమృత నిష్యందమై
అవని వెలుగు తీర్చు ? కవిత తప్ప ??

వెల్లడించ వచ్చు - విజ్ఞాన శాస్త్రమ్ము,
ధరణి - సూర్యు చుట్టు తిరుగు నంచు;
సరస కవిత - అపర సత్యమ్ము - వచియించు,
ధరణి -ధనము చుట్టు - తిరుగు నంచు.

కవిత అనిన - మేలి కాగితమ్ములు కాదు!
అక్షు లదర గొట్టు అట్ట కాదు!
అందమైన అచ్చు అక్షరమ్ములు కాదు!
ప్రౌఢ భావ భరిత పద్య రచన.

జగతి లోన - భాష - శబ్దార్థ సంయుక్తి,
తెలుపు నరుని పరిణతి మతి మితిని,
మేరు శిఖరి వోలె - మేధావి - కవి దోచు,
యుగ యుగాంతరమ్ము లుర్వి మీద.

సంతరింప వచ్చు - సాహితీ చరితమ్ము,
ప్రతిభ లేని బండ పండితుండు,
ప్రతిభ యున్న - చిన్న పద్య మొక్కటి చాలు,
వ్రాయ వచ్చు చిన్న గేయ మొకటి.

రస మేతత్ బ్రహ్మానం
ద సహోదర మని వచించినారు కళా లా
లసు లగు లాక్షణికు లదియె
సుసుధీ గళముల వెలసె "రసోవై సః" గా.

నింగి పైన చేరి నీలి మబ్బుల మధ్య,
చిందులాడు చుండ చందమామ,
కదపి కొనుచు కాళ్లు -కమ్మ తెమ్మెర మధ్య
తడిసి నట్టి ఇసుక నడచి నాడ,

వెల్లి విరిసె నాకు విశ్రాంతి హృది లోన,
మధుర సమయ మెపుడు మరువ లేను,
మేడ మీద కరిగి - మింటి చుక్కల క్రింద
కూరుచున్న వేళ కొంత సేపు,
క్రమ్ము కొనుచు చేరు చిమ్మ చీకట్లలో
నెమరు వేసుకొనెద నేను తరచు
వెల్లి విరియు చుండ వెన్నెలల్ పలుమారు
కడలి పొంగి పొరలు ఎడదలోన
చల్ల గాలి వీచు సహజ కెంజాయలో
కవిత జాలు వారు కలము నుండి.

గాలి ప్రోగు చేయు - మేలి మాటల కేమి ?
శీల మరయ దగును - చేత లందు;
కవిత చెప్ప దగును జగద్ధితమ్ము మనీషి,
కర్మయోగి యైన - ధార్మికుండు.

అందమైన కవిత - స్పందించు డెందమే;
మెరపు నుడుల పేక మేడ కాదు;
పటు ఛలోక్తి జటిల వైచిత్రియా ? కాదు ;
సరళ మానవత్వ సంశ్రయమ్ము.

దేహ శిల్ప శైలి - తెలుపు రంగుల ఫొటో,
నరుని అంతరాత్మ సరళి గాదు;
కానుపించు సతము - కావ్య పంక్తుల లోన,
కృతిపతి విభవమ్ము ప్రతిఫలించి.

జగతి - యోగి కగును - సచ్చిదానందమే !
నరక సదృశ మనును - నరు డొకండు !!
మిధ్య యనును జగతి - మేధావి - కను మీటి,
బ్రదుకు - నవ రస రుచిరమ్ము - కవికి.

మరణ శయ్య వరకు - మరువ జాలక సదా;
మనిషి నెమరు వేసు కొనున దేది?
తెలుగు పద్య కవిత - వెలుగు బాటలు వేసి,
పరిమళింప జేయు - బ్రదుకు నెల్ల.

అక్షరాల లోన - అమరునా కవనమ్ము ?
గుండె లోన నిండి యుండు గాని;
ఒక్క మాట చాలు - ఉబికి తాండవ మాడు;
చూపు చాలు - చేతి ఊపు చాలు.

పూవు నందు నిండు - తావి యందున నుండు;
వెల్లి విరియు - నెమలి పింఛ మందు,
సరస కవిత - సర్వ జగతి కంతర్యామి,
మనుజ హృదికి - రస సమాధి కూర్చు.

ఉండు - కవిత రండు - రెండు లోకము లందు;
పసిడి కలల యందు - వసుధ యందు;
గోచరింప వచ్చు - కొంత విప్రతిపత్తి
పలుకు లందు కవుల పనుల యందు.

కలము చేత బట్టి - కవిత వ్రాయగ వచ్చు;
తరచు దురద పెచ్చు పెరిగి -కవులు;
మెచ్చు కొనన యెడల -మేధావి మేలౌను,
అచ్చు మైన కవిత - అరసి తరచి.

జాంతవ మగు సుఖము - సంభోగ మని నంత
అమృత సదృశమౌ రసాను భూతి;
మానసమ్ము నందు - ఆనంద ఝురి పొంగు;
అమరు నిర్వికల్పమౌ - సమాధి.

స్వీయ కవిత - సభకు -వినిపింపగా రాదు
సహృదయుండు కోర - చదువ వచ్చు;
స్వకుచ మర్దనమ్ము - సరస శృంగారమా ?
పుట్టు - ఏవగింపు - పుట్టు నవ్వు.

తినిన పిదప - మరల తిన - కాంక్ష పొడముచో,
మంచి వంటక మని - ఎంచ వచ్చు;
కవిత చదువు నెడల - కంఠస్థ మొనరింప
కోర్కి కలిగె నేని - గొప్ప రచన.

ఉండు కవిత లోన - ఉన్న తోజ్జ్వలములౌ
దిగ్వలయజ దీధితి ప్రతీతి;
అర్థవాద గీతి - వ్యంగ్య వైభవ రీతి,
భావయిత్రి యందు - భాష యందు.

సకల జనుల కెల్ల సంతతారాధ్యుడే!
అన్నదాత - పొలము దున్ను - రైతు !
గుండె దున్ని కరుణ పండించు కవి గూడ,
అటులె పూజనీయు డవని లోన.

కానరాని మేలు - కవన సంగీతముల్,
కూర్చ గలవు మనుజు గుండె లోన,
అమర జేయ - గలవు - ఆయు రభ్యుదయముల్,
అంద జేసి అవని కవలి వెలుగు.

కవిత వ్రాయ గలడు - కరుణార్ద్ర హృదయుడే;
గడుసు నుడుల మేడ కాదు - కవిత;
వ్రాసె -ఋషి వరుండు వాల్మీకి కవనమ్ము;
కరగు నట్టి గుండె కాయ కలిగి.

శబ్దములకు - వ్యాఖ్య - సందర్భమును బట్టి,
సలుప వలెను దేశ చరిత తెలిసి ;
నప్ప దెపుడు - నవ్య నైఘంటుకార్థమ్ము!
కడగి - ఎరుగ దగును - కవి హృదయము.

దుమ్ము - గుండె లోన - దూరు చుండును గదా,
తెలియ కుండగా ప్రతి క్షణమ్ము;
లలిత కళల వెలుగు జిలుగు లోనికి పంపి,
దులుప వచ్చు - గుండె దూరు - దుమ్ము.

చాల మంది జనులు - సంగీత కళ లోన,
తప్పు తాళ మెరుగి చెప్ప గలరు;
ప్రౌఢ కవిత లోని భావనా గతి యందు
తప్పు తాళ మెవరు చెప్ప గలరు ??

తెనుగు పద్య శిల్పమునకు పాటియె లేదు!
విశ్వ వాఙ్మయమ్ము వెదకి చూడ,
పదము చెప్పు లేని - భావాలు ప్రకటించు,
కలిసి యతులు ప్రాస గణము లెల్ల.

కవిత యేమి చేయు ? గానమ్ము ? లేనిచో !
ఉప్పు లేని వట్టి పప్పు కూడు;
కవిత - రక్తి కట్టు - గాన యోగము చేత,
గంగ యమున గలిసి - పొంగి నట్లు.

దేహి - బ్రదుక లేడు - ఆహార మాత్రాన;
లలిత కళలు కూర్చు వెలుగు లేక,
బ్రదికె నేని నరుడు పశువుతో సము డౌను,
మనిషి లోన - మేటి మనసు కలదు.

బ్రతుకున ఒక మారైనను
ప్రతిఫలమును కోరక అనురాగ రసముతో;
ఇతరుల కుపకృతి చేయని
పతితుని ముఖము పరికింప -పాపము సుమతీ.

కవిన రేణ్యు డెవడు కానేర డవనిలో,
వేపకాయ యంత - వెఱ్ఱి లేక !
తాటికాయ మేర - తన వెఱ్ఱి ముదురుచో
సహృదయుండు కవిని సత్కరించు.

"కవిత -క్రోల వచ్చు - కవికాల మేదైన,"
అనెడి వారు - పెక్కు జనులు కలరు;
కాల నిర్ణయమ్ము కనుదోయి తెరచుటే;
సాహితీ సమీక్ష సలుపు నపుడు,

విశ్వ కవిత - విద్య వేదాంత శాస్త్రాల
పరమ లక్ష్య మేది ? ధరణి మీద ??
పడయు టెట్లు నరుల బ్రదుకులో సౌఖ్యమ్ము ?
అధ్యయనము చేయు టవసరమ్ము.

కవిత -పరిమళించు -కనక కల్హారమే !
శత సహస్ర పత్ర సంయుతమ్ము
కేసరాల తోడ - కిమ్మీర రుచి తోడ,
తేనె విందు కూర్చు - తేటి తతికి.

క్రాంత దర్శి - ఋషి - త్రికాలజ్ఞు డెవ్వడో,
గుర్తు పట్టు - సుకవి గొప్ప తనము;
బ్రదికి యున్న వేళ - పడయ నేరడు కీర్తి,
అవని లోన తరచు కవి వరుండు.

మహిమ లోన - మధుర మంత్రమే - పద్యమ్ము!
యోగ నిద్ర మణగి యుండు - హృదిని,
బ్రదుకు నందు అవసరము బట్టి మేల్కొంచు,
వేగ వేయ గలదు - వెలుగు బాట.

కవిత - అనిన - తెల్ల కాగితమ్ములు కొన్ని,
నలుపు చేయు చిలిపి తెలివి గాదు,
పలుక నేల - సభల - చిలుక పలుకులు కొన్ని?
బుద్ధి లేక - చిత్త శుద్ధి లేక.

ఒసగ వచ్చు కవికి ఒక లక్ష రూప్యముల్!
అచ్చు వేసికొనుట కతని రచన;
అది జగద్ధితమ్ము - అది శారదా పూజ;
ఇల్లు కట్టుకొనుట కివ్వ నేల ?

కవిత -దిన దినమ్ము -గడపు జీవితములో,
అడుగు అడుగు నందు అమరు గాత ;
అంద చందములను అమృతమ్ము చిందించి,
కరగి పోవు - గండె కాయ - కవిత.

కలవు - తాళ లయలు - కవిత యందున గూఢ,
ఎంచ దగును కారయిత్రి - తరచి;
ఏక లయను చేరి -ఏకశ్రుతిని కూడి,
శ్రవణ సుభగ మగుత - శబ్ద సంధి.

సుప్త భావయిత్రి - గుప్త చైతన్యమ్ము;
నిస్తరంగ నిభృత నీరవమ్ము;
త్యాగ యోగ నియతి - జాగ్రత్ శమ సమాధి;
తీర్చి - కవి - మనీషి దిద్దుకొనును.

పాత్ర చిత్రణ మన - పరకాయ వేశమ్ము,
కవికి సహృదయునకు అవసరమ్ము;
కావ్య వస్తు వనిన - పరకాల గమనమ్ము;
కవికి సహృదయునకు కావలయును.

గబ గబ గబ పచ్చ గడ్డి మేయుట గాదు.
అవసరము - 'నిలుకడ' - కవనమునకు!
నెమరు వేసు కొనును నీడలో కూర్చుండి,
గంగి గోవు వోలె -కవి వరుండు.

ఆగ్రహమ్ము కలుగు - అన్యాయ మెదురైన,
అచ్చ మైన కవికి - ఆత్మ యందు;
కవి -కలమ్ము కల్కి ఖడ్గమ్ముగా చేసి
అండ దండ యగుత - న్యాయమునకు.

మంచి దండి మేత - మత్తేభములు కోరు;
ఎవరు వేయగలరు ? పృధివి నేడు ?
"ఆట వెలది" చాలు - యతి వేయ సరిపోవు;
ప్రాస లేదు - అలతి బాస చాలు.

వ్రాయు నెడల - జీవ భాషలో కవనమ్ము,
బ్రదుకు ప్రతిఫలింప - రక్తి కట్టు ;
నాట్య మాడ - కవిత - నరుల నాల్కల పైన;
వ్యాకరణ పరీక్ష -అనవసరము.

కళ - యథార్థ జగతి - కలియ వెచ్చట గూడ,
అవి సమాంతరములై చెలంగు,
సరళ సామరస్య సాదృశ్య సుభగముల్
వక్రతమ విశేష సక్రమములు.

ప్రౌఢ సంస్కృతమ్ము - పాండిత్య పరిభాష;
అచ్చ తెలుగు - పురిటి చచ్చు బిడ్డ ;
సంస్కృతమ్ము తెలుగు సరిపాళ్లలో గూడ;
తెలుగు కవిత వెలుగు జిలుగు లొలుకు.

సంస్కృతాంధ్ర శబ్ద సమ్మేళనము లేక,
కలదె ఎచట నైన తెలుగు భాష ?
క్షీర నీరములను - వేరు చేయగ నేల ?
హంస యైన - కవన హంస యైన ?

పదములు గుది గ్రుచ్చి - వ్యవహార భాషలో,
వాచ్య కవిత - చెప్ప వచ్చు - పెదవి,
మధుర మృదు మనోజ్ఞ మసృణ - గానము తోడ,
ముగ్ధ కవిత చెప్పు - మూగ కనులు.

వేల కొలది - రైళ్ల - కాల సూచిక లైన,
అచ్చు వేయ వచ్చు - అమ్మ వచ్చు;
కష్ట మమ్ము డగుట - కవితా ప్రబంధముల్ !
ప్రజల లోన - వేయి ప్రతులె యైన.

వ్రాయ నేల - కవిత - ప్రజల కోసమె గాక ;
కవిత కెవరు విలువ కట్ట గలరు ?
ప్రౌఢ రచన మణగు - గ్రంథాలయాలలో;
గాలి తేలు - తేట కవిత లెల్ల.

కవిత - మొదట అల్ప కండూతిగా తోచు,
కాని - పెరిగి ఏన్గు గజ్జి యగును !
బ్రదుకు లోన - అన్ని వ్యసనమ్ము లట్టివే
దురద లేని వాడు ధరణి లేడు.

కవన గాన కళలు - అవినానుబంధమ్ము
దిద్దు - శ్రుతి లయలను దివికి భువికి,
ఛంద ముభయ కళల సంధించు సేతువై;
మెదడు నెడద తోడ - మేళవించు.

మేటి వచన కవిత మెరపు తీగల మిన్ను;
పద్య కవిత - వెడద పాల కడలి;
లలిత గేయ కవిత - లహరీ ప్రవాహమ్ము;
మూడు నొక కలమున కూడ వచ్చు.

ఏది కాలమునకు ఎదురీది మన గల్గు ?
అవని మీద మంచి కవిత తప్ప ?
ప్రజల అనుభవాల - ప్రతిబింబ మైనచో!
రచన - శాశ్వతముగ బ్రతుక గలదు.

చాలు - కూర్చు - దేహ శౌచమ్ము - స్నానమ్ము,
మనసు లోని మైల మాపు టెట్లు ??
కవిత - హస్త కళలు - గానమ్ము దానమ్ము;
క్షాళనమ్ము చేయ గలవు - హృదిని,

గాన మౌషధముల కంటె గొప్పది సుమా,
కవిత ఘనత మించు - గాన కళను,
సహృదయుండు - ఋషి - రసస్నాతకుడు పొందు;
బొందె తోడ ముక్తి - పుడమి లోన.

కళ - కళ కొరకా ? జగద్ధితమ్ము కొరకే;
'మంచి' మనుజు లందు పెంచు కొరకె ;
గుండె దున్ని విత్తి - పండించు కోసమే !
వెలుగు బాట వూని వేయు కొరకె.

కవిత - కూర్చగలదు - కరుణార్ద్ర హృదయమ్ము;
మార్చు దానవులను మానవులుగ;
జనుల మార్చు బోధి సత్వ సాధువులుగా;
త్యాగ యోగ సంగ్రహార్థకులుగ.

మాట లాడ గలుగు - వేట కుక్కల వంటి
గడుసు కవులు గలరు పుడమి మీద ,
మంచి పనులు చేయు మనసు సుంతయు లేక,
మొరుగ గలరు జనుల కరువ గలరు.

సంతసమ్ము కూర్చు సంగీత సభ యైన,
చెవులు మెచ్చ లేవు కవన మైన !
విద్య యున్న యెడల - విశ్రాంతి యున్నచో!
సహృదయుండు కవిత చదువ వచ్చు.

కవిత - మంచి దైన - కంఠస్థమై నిల్చు,
చాలు - ఒక్క సారి - చదివి నపుడు ;
వినిన - ఒక్కసారి- మనసు లోపల దూరి,
నాట్య మాడు - కవిత - నాల్క పైన.

ప్రజల హృదుల కుదుట పడి చిరంజీవియై,
బ్రదికి యుండు - చాటు పద్య కవిత,
అమృత రస గుళికకు - అనుపానమై పొల్చు;
చాకచక్య లౌక్య సంగ్రహమ్ము.

బృంద వాద్య ఘోష - వినిపింప రాదయా,
కంఠ మధురిమమ్ము కప్పి వేసి;
గాన విద్య - కవన గాంభీర్య గరిమమ్ము;
కురియు గాక - శ్రోత గుండె యందు.

సంస్కరింపవలెను - జ్ఞాన జాగృతి గల్గి,
వివిధ కళల నెల్ల - విద్య లెల్ల;
పాత బూజు పెంచు - పంచాంగముల నెల్ల,
చెదలు పట్టి నట్టి హృదుల నెల్ల.

వెల్లి విరియు గాక - వివిధ భాషల యందు,
వేల విరుల తావి విచ్చు గాక,
సరస భారతీయ సాహిత్య సృష్టిలో
అరయువారి కంతరాత్మ ఒకటె.

సలిపి దండయాత్ర - శాంత సాధువులపై,
గెలిచినారు దుండగీండ్లు తరచు!
లలిత కళలు - శాస్త్రములు నాశనము లయ్యె,
చాల సార్లు భరత చరిత లోన .

పుడమి లోన మరుగు పడి పోయి - కవి పేరు,
నలుగు - కవిత -ప్రజల నాల్క లందు;
బ్రదుకు - కాలమునకు ఎదు రీది సర్వధా,
కరుగ జేయు - అమృత కవిత - హృదిని.

వంద పద్యములను వల్లింప గలవాడు,
జ్ఞాన యోగి యగును సంఘ మందు,
ఆచరణములోకి - అనువదించెడువాడు,
కార్య శూరు డైన - కర్మయోగి.

ఆశు కవిత వట్టి ఆడంబరమె సుమ్మి;
ఉరుము వచ్చు - మబ్బు - కురియ వచ్చు,
వాన నీటి వరద వైశాల్యమే గాని,
స్నాన మాడ దగిన సరసి గాదు.

కవిత పేరు మీద - కాకి కూతల నెన్నొ
కలము బరుక వచ్చు -కాగితముల !
గొంతు నెత్తి వాని కోకిల స్వరముగా,
గాయకుండు మార్చ గలడు - తరచు.

మనిషి నిర్మలముగ మనసు ఉంచుట మేలు,
ఏలు నింద్రియముల నెల్ల - మనసు;
ఇచ్చు - చిత్త శాంతి ఏకాంత మౌనమ్ము;
లలిత నాద బిందు కళలు లయలు.

మనిషి - చూడ దగును - మానసారోగ్యమ్ము,
చేయ దగును దేహ చింత పిదప;
"రసము " - మానసమును - ప్రక్షాళనము చేసి,
"బుద్ధి శుద్ధి" "యోగ సిద్ధి" గూర్చు.

నరుడు- తెలియ కుండ -ధరియించు బ్రదుకులో,
కానబడని పెక్కు - కల్ల జోళ్ళు;
నరుడు - చూచి నట్టి నగ్న సత్యము చెప్ప;
క్రాంత దృష్టి అదియె - కవిత అదియె.

చదువు గాని - వివిధ శాస్త్రమ్ములే గాని,
పదను బెట్ట గలవు మెదడు పెంచి;
కఠిన హృదిని ఏది కరగింప గలదయా !
కవిత తప్ప - కలియుగమ్ము నందు ??

గాలి కలిసి పోవు - కమ్మ తెమ్మెర వోలె,
మంచి కవిత ఈ ప్రపంచ మందు;
పొందు పరచు నెడల - ఛందస్సులో పెట్టి,
స్థిర తటిత్తుల వలె - తేజరిల్లు,

నాట్య మాడు - జగతి - నవ నవోన్మేషమ్ము,
పాత చింతకాయ పచ్చ డేల ?
వ్రాయ వలెను - క్రొత్త పద్యాలు - కవి వరుల్,
క్రొత్త భావయిత్రి కూర్చు కొనుచు.

దూరుచుండు వచ్చి దుర్ జ్ఞేయ కిరణాలు,
కొన్ని అప్పు డపుడు గుండె లోన,
కాంతి కిరణములను కవితా కృతులు చేసి
పేన గలను జనుల ప్రీతి కొరకు.

వేయి సభల - వాగి వెడలి వచ్చుట కంటె,
వ్రాయ నగును - మంచి గ్రంథ మొకటి ;
చదువ వచ్చు దాని - సహృదయాగ్రేసరుల్,
సావధాను లగుచు చాల సార్లు.

ఆధునికులు కలరు - అష్ట దిగ్గజ సముల్ ;
కృష్ణ దేవ రాయ లేడి నేడు ??
కవుల కెట్లు వచ్చు - గండ పెండేరముల్ ?
చాలు - చిన్ని శాలువాలు - చాలు.

వంద పద్యములను  వల్లింప గలవాడు
జ్ఞాని యనగ బరగు సంఘ మందు,
ఆచరణము నందు - అనువదించెడు  వాడు,
కార్య శూరు డైన - కర్మయోగి.

చేతి విద్య లోన - చిత్ర లేఖన మందు
శిల్ప విద్య లందు  చిక్కు గలదు !
అనువదింప వలయు - మనసు ఊహల నెల్ల,
కానుపింప  ప్రజల కనుల ముందు.

కవిత  వ్రాయు టన్న  కష్టమ్ము  పృధివిలో,
కష్ట తరము  అంత కంటె - అచ్చు!
కష్ట తమము  సుమ్ము - కావ్య మమ్ముట యన్న !!
కవుల  బ్రదుకు  టెట్లు  కలి యుగాన ?

చరిత రచన - ఖండ సత్యాల సంక్రాంతి,
వ్రాయు వాని  సైత్య రసము చేరు !
నవల లందు - కల్పనా  కథానిక  లందు
మారు రూప మందు - మణగు - నిజము.

కలికి సీత కోక చిలుకలే - పద్యముల్!
యతులు మరియు ప్రాస గతులు గలిగి;
గోచరించు రచన - గొంగళీ పురుగుగా
యతులు మరియు ప్రాస గతులు లేక.

కవిని చీల్చి చెండి - ఖండ తుండాలుగా,
గాయకుండు చంపి వేయ గలడు !
చచ్చి నట్టి కవిని - స్వర్గలోకము నుండి,
ఇలకు దింపి గౌరవింప గలడు.

కవన విశ్వరూప మెవరు గాంచగ లేరు,
తోలు కన్నుదోయి తోడ - నెపుడు;
"పదము" డొక్క చీల్చి - హృదయ నేత్రము విప్ప,
గోచరించు లోని గొప్పదనము.

సరళ పద్య కవిత - సర్వత్ర - స్పందించు
సహృదయ హృదయ గిరి గుహల యందు,
పల్లె టూళ్ల లోన - రైళ్లు బస్సుల లోన,
దిగ్ దిగంతరాల - తేలి యాడు.

పాట - రక్తి కట్టు - ప్రక్క వాద్యము లున్న,
కలియు వచన కవిత గాలి లోన;
కవిత - పద్య మందు - కంఠస్థమై నిల్చి,
బ్రదుకు యుగ యుగాల హృదుల వెలిగి.

పాడు చచ్చు పుచ్చు పద్యాలు వేయేల?
ప్రజల చదువ నట్టి గ్రంథ మందు ?
వ్రాయ వచ్చు - చాటు పద్య మొక్కటి యైన,
మేలి కవిత ప్రజలు మెచ్చు తునక.

గుండె లోన మ్రోగు గుడి గంట రవళియై,
పద్య కవిత - రాగ భావ సరళి!
లాస్య మాడు - గాన లహరీ తరంగముల్,
వెల్లి విరిసి - నాద బిందు కళలు.

వాన చినుకు తోడ - వచియించె సెలయేరు;
"రమ్ము - స్వాగతమ్ము - నమ్ము నన్ను;
అడుగ వద్దు దారి - కడలి చేర్చెద నిన్ను
కదలి పోద మెడద కనులు విప్పి".

పాడ గలుగు నట్టి వాని - చెంతకు రావు
చింత వంత లెల్ల - చెదరి పోవు!
అందు కొనిన - గొప్ప ఆనందయోగమ్ము
పంచి పెట్ట గలడు ప్రజల కెల్ల.

కవిత - గాలి మేడ కారాదు బ్రతుకులో,
లోతయిన పునాదు లుండవలెను;
కోర దగును మేలి క్రొత్త పాతల కూర్పు,
సామరస్య మందు - సత్య మిముడు.

ప్రేక్షకులకు పెద్ద పక్షమ్ము లున్నట్లు,
ఉష్ట్ర పక్షి తోచు చుండు గాక !
ఉష్ట్ర పక్షి వోలె - వ్యుత్పత్తి గల కవుల్;
గగన సీమ కెప్పు డెగుర లేరు.

ఎంత సుందరమ్ము - ఎత్తి పోతల వద్ద?
జలము క్రింది కొలుకు - చంద్ర వంక,
ఆంధ్ర భాష యందు - అవధాన మట్టిదే,
గట్టు లొరయు కృష్ణ - కావ్య కవిత.

చెక్కు - భావయిత్రి - శిల్పమ్ము తొలుదొల్త
ఎన్ని ప్రతిమ లవతరించు - పిదప!
శిల్పి - ఎవడు - మొదట చెక్కెనో నటరాజు,
వెలసె - ప్రతిమ లెన్ని - వేన వేలు.

లాస్యమాడు గద - అలంకారము లెల్ల;
ఊయెల వలె ఊగి - ఉపమ యందు;
చేరి - చిందు లాడు -శ్రీ రాగమున యందు,
అన్ని - రాగములును - అరసి చూడ.

మనిషి - సృష్టి కెల్ల - మకుటాయ మానందు,
కళల విద్య లతడు గరచి నాడు;
విద్య వలన - మెదడు విలసిల్లు బ్రతుకులో,
లలిత కళల - ఎడద వెలుగు విరియు.

నాద బ్రహ్మోపాసన
వేద ఋషులె గాక - విపుల విజ్ఞానుల్ నా
నా దేశ కవులు చేతో,
మోదముతో చేసినారు మురిపెము తీరన్.

మనిషి మరిగె నేని - ధన సువాసన పీల్చి,
పనికి రావు - వేరు పరిమళములు;
విద్య - లలిత కళలు విజ్ఞాన మేలరా ?
ఆతడు నడపీను గౌచు - బ్రదుకు.

కానిపించు - "నిజము" కల్పనా కథ వోలె!
విశ్వ మందు పెద్ద వింత యౌచు ;
నవల - గొప్ప దౌను నగ్న సత్యము చాటి,
కవిత - నిజము నుండి అవతరించు.

సరస మైన వ్యాఖ్య - సందర్భ శుద్ధితో,
విప్పి - కవి హృదయము చెప్ప వలెను;
బుద్ధి - లోన జొనిపి - పూర్వాపరము, లెన్ని,
తెలుప వలె సమగ్ర దృష్టి గలిగి.

మెదడు లోన మార్క్సు - హృదిలోన బుద్ధుడై!
విప్లవమ్ము కరుణ వింగడించి,
పుట్టు గాక - సుకవి - భువనైక పౌరుడై;
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.

నేల ఒక్క అడుగు - నింగిపై పది వేసి,
ఎగుర గలుగు నేర్పు - నృత్య విద్య,
గాలి లోన తేలి - కాళ్ల గజ్జెల మ్రోత,
పిక్క టిల్లు గాక - దిక్కు లెల్ల.

అవతరించు గాక - నవనాట్య కవనముల్
భావ రాగ తాళ భంగిమములు,
నాట్య విద్య - వరలు - నది వోలె ప్రవహింప,
మురికి గుంట కాక - చెరువు గాక.

మాట లాడు నట్టి పాట - తీయని ఊట,
మాట తెరల మాటు పాట వేరు;
శ్రవణ సుభగ మైన - సంగీతమును మించు,
మనసు నలర జేయు - మౌన గీతి.

సరిగమ పదనిసల సంగీత మెవ్వడో,
అవతరింప జేసె అమృత హృదుడు,
బొందె తోడి ముక్తి - పుడమిపై నిలుపంగ,
ఝటితి శాంత ఝరులు సంగ్రహించి.

వేధ - మెదడు చేటు -వేదాంత మని నంత,
ప్రజల కెల్ల అందుబాటు కాదు!
మడత పొరల దూరి - ఎడద మాలిన్యముల్,
కడగి వేయు - కవన గాన మైన.

కదను త్రొక్క వలెను - కలము - గుఱ్ఱము పోలి
గానుగెద్దు వోలె - కదల రాదు,
మెరుపు తీగ వోలె - మిరుమిట్లు కుప్పించి,
పొంద వలెను జయము - పందె మందు.

కవిత నిలువ గలదు - కంఠస్థమై పోయి,
ఛంద మందు కూర్చి పొందు పరుప;
నిలువ లేని పూల నెత్తావియే యౌను.
గాలి కలియు వచన కవిత యైన.

మనిషి కున్న చాలు - మనసులో సంశుద్ధి,
జంకు గొంకు లేక - సాగ వచ్చు;
దిగ్ దిగంతరములు - దివ్య తేజము నిండు,
మొకరిల్ల గలదు - లోక మెల్ల.

శ్రావ్య మైన గొంతు - చప్పట్లు చరిపించు,
చక్కిలి గిలి పెట్టి - సభకు నెల్ల;
అమృత కవిత వినిన - ఆలోచనలు రేగి,
కదల లేరు - జనులు - మెదల లేరు.

మత రచనము లెల్ల - మానవ ప్రోక్తముల్!
కూర్చ వచ్చు ఎవరొ గొప్ప ఋషులు!
ప్రజలు నమ్మ కొరకు - భగవద్వచన మంచు,
గొప్ప కవులు చాటి చెప్ప వచ్చు.

శత జయంతు లేల ? సమయ సీమాతీతు,
కవికి కొన్ని గిరులు గడులు గీసి ?
తిథులు వద్దు మరియు తేదీలు వద్దయా,
సలుప వచ్చు - కవుల స్మరణ సతము.

బ్రతికి యున్న కవులు పడెడు బాధల నెల్ల;
కన్ను లుండి జనులు కాంచ లేరు;
చచ్చి నట్టి కవికి - స్మారకార్థము పూని,
పెద్ద విగ్రహమ్ము పెట్ట గలరు.

సరస లలిత కళలు - సచ్చిదానందమ్ము
కూర్చ వలెను జనుల గుండె లందు,
కలికి వెన్నెలలను - కమ్మ తెమ్మెర నింపి;
వేడి విప్లవమ్ము - విసము గాక.

వ్రాయ వచ్చు కవిత - ప్రచురింప కష్టమ్ము;
భయము గొలుపు అచ్చు వ్యయ మటన్న
సహకరించు నెడల - సాహితీ కృతిభర్త,
గౌరవమ్ము - ఉభయ తారకమ్ము.

మందు - జీవ మున్న మనిషిలో రాణించు,
పనికి రాదు చచ్చు వాని కెపుడు,
ప్రాణ శక్తి లేని బడుగు పీనుగు కేల ?
వివిధ కళలు గాని - విద్య గాని.

పేరు లోన ఇమిడి - పెద్ద భావము దాగు,
విత్తనమ్ము లోని - వృక్ష మట్లు;
అక్షరాల పొదిగి - నక్షత్ర గాయత్రి,
పేరు - సూత్ర ఫణితి - పెట్ట వలెను.

వాద్య ఘోష లేక - వర్ధిల్లు గానమ్ము;
స్వీయ మధురిమయ్యు చిలకరించి,
కంఠ శోష లేక - కవనమ్ము వర్ధిల్లు,
సంతరించి భావ సంగ్రహమ్ము.

వృత్తి గాక - తమ ప్రవృత్తిచే ఎవరైన
కవి వరేణ్యు లైన - ఘనులు వారు;
కవులు - సంఘ మందు - కారాదు యాచకుల్;
బ్రతుక నేర నట్టి ప్రతిభ యేల ?

కలలు మిథ్య లంచు పలుకు వా రున్నారు!
వెక్కిరింప వచ్చు వెఱ్ఱివారు,
తథ్య మైన దేది ? ధరణిపై బ్రదుకులో ?
కవుల జన్మహక్కు - కలలు గనుట.

బ్రతుకు తీర్చి - నన్ను - రచియించె పద్యాలు!
పద్యములను నేను వ్రాయ లేదు !!
మెదడు లోన - తోచె మెరపు తీగల వోలె;
కురిసి - అమృత ధార - గుండె లోన.

మేలి రచన ఒకటి మెరసి కన్పడ వచ్చు,
అల్ప కవుల వ్రాత లందు గూడ;
రాళ్ల మధ్య- గొప్ప రతనమ్ము దొరకదా ?
ఉండు - వట్టి చెత్త కుండి గూడి.

మెచ్చ వచ్చు - "ధ్వనులు" మేటి కావ్యము లందు,
మరి - ప్రతి ధ్వనులను -మరువ దగును;
వాణి - మెచ్చు - సొంత బాణీల మాత్రమే,
నీడ వేరు - అసలు నిజము వేరు.

నిలిచి మేడ మీద - మలి సంజ కెంజాయ,
మబ్బు మధ్య - చందమామ కదల,
మింట విరియ మిణుకు మిణుకు నక్షత్రముల్,
అల్లి బిల్లి కవిత లల్ల వచ్చు,

కవులు వ్రాసి నట్టి - గ్రంథాలలో నుండి,
ఎవ్వ రైన తప్పు లేర వచ్చు;
వేయి మంది గొప్ప విద్వ ద్విమర్శకుల్,
కలిసి రేని - సములు కారు - కవికి.

అరయ వచ్చు నరుడు - ఆలోచనము తోడ
సృష్టి యందు - పెరుగు - ఎల్ల లెల్ల !
కవిత - కూర్చ వచ్చు నవనవోన్మేషమ్ము,
ప్రతిభ తోడ - క్రొత్త క్షితిజములను,

మనిషి మాట లాడు - మర్యాద కోసమే!
మాట తప్ప వచ్చు - మనసు వేరు;
మంచితనము లేదు - మానవత్వము లేదు,
నరుని పాడు చేసె - నాగరికత.

చిత్రకారుడైన శ్రీ పికాసో చెప్పె!
తాను గొప్పవాడు కాన టంచు,
యశము ధనము పదవి - ఆర్జించు కోసమై,
వట్టి బొమ్మ లెన్నొ - వ్రాసినాడు.

మల్లె పుప్పొడి జల్లు - పిల్ల గాలుల అలల్,
జవ్వాజి కస్తూరి సంభ్రమములు,
జగదేక సుకుమారి జడలోని సంపెగల్,
నెరజాణ విసురు పన్నీటి జల్లు;
నందన వని నవ్వు మందార మంజరుల్,
చదలేటి అపరంజి జలరుహములు;
చలువ రాతి గుడిలో సాంబ్రాణి ధూపముల్,
జవరాలి తొలి రేయి చందనములు,
వగల వలపు గొలుపు మొగలాయి అత్తరుల్!
కుంకుమాగురు పునుగు గుమగుమలు,
సరస కవిత మెచ్చు సహృదయామోదమ్ము,
సాటి రావు - రసిక జగతి యందు.

నరుల నమ్మకాల - నవ్య విజ్ఞానమ్ము,
సంహరించె- మతము- చచ్చి పోయె;
ఇంక మిగిలి నట్టి - ఏకాంత శూన్యమ్ము
కవిత తప్ప పూడ్చ గలది లేదు.

కవిత అనిన - కాదు - నవ రత్న హారమ్ము;
పూత పసిడి జిలుగు పూల గుత్తి;
కవిత అనిన - వేడి కన్నీటి బిందువుల్,
హృదిని వెల్లి విరియు ఇంద్ర ధనువు.

నేటి సంత లోన - మేటి గానము వింటి;
తాళ రాగ లయలు తాండ వింప;
అంధ బాలకుండు - అమృత వేణువు నూదె;
సంత గోల - కొంత సర్దు మణగ.

ఒక ప్రతి ధ్వని - నవ పిక నిస్వనము తోడ,
నీడ నడిగె - నాట్య మాడు మనుచు;
నీడ సలిపి నట్టి నృత్య విన్యాసమ్ము,
కవన మనుచు పేరు గాంచె - జగతి,

తరచి చూడ - సర్వ ధర్మ శాస్త్రము లందు,
మనుజ చరిత యందు - మతము నందు;
కవిత లందు - లలిత కళ లందు ధరణిపై,
గొప్ప దేది ? జాలి గుండె కంటె ?

కూచిపూడి బాణి - క్రొంగ్రొత్త నాట్యముల్,
అవతరించుగాత ఆంధ్రి యందు,
భరత నాట్య విద్య - ప్రగతి మార్గము త్రొక్కి,
దిద్దు గాత - క్రొత్త ప్రొద్దు పొడుపు.

పొడ గలుగు నట్టి వాని చెంతకు రావు,
చింత వంత లెల్ల చెదరి పోవు;
అందు కొనిన గొప్ప ఆనంద యోగమ్ము
పంచి పెట్టు తానె ప్రజల కెల్ల.

శాశ్వతమ్ము - సూర్య చంద్రు లైనను గాదు,
చిత్ర చిత్ర మైన సృష్టి యందు;
అరయ - మూల శక్తి - ఆద్యంత రహితమ్ము,
కవుల ప్రతిభ మూర్తి కల్పనమ్ము.

శాస్త్ర వేత్త లైన - సంగీత సాధకుల్,
కవిత కంటె గూడ గాన కళను
క్లిష్టతరము, చేసి క్రీడించు చున్నారు!
వాద్య బృందములకు వశము చేసి.

అనుభవైక వేద్య మైనదే "రుచి" యన్న,
కలము వ్రాయ లేదు కవిత లల్లి;
అది ఒక లలిత కళ - హస్త లాఘవ లబ్ధి,
తినెడి వారి సిరి - అదృష్ట సిద్ధి.

మేలి ముసుగు - కాంత - మేని సౌందర్యమ్ము,
వెల్లడించు - దాచి వేయ కుండ,
ఛంద మందు - కవిత - అందాలు చందాలు
కానుపించు గాని - కప్పబడవు.

ఆంధ్ర పద్య కవిత - అమృత మాదుర్యముల్,
చెప్పి యెవరు ఋజువు చేయ గలరు ?
కంఠ మెత్తి - నటుడు - గాంధర్వ గగనముల్,
అందజేయు శ్రోత లందరకును.

పొట్ట కొక్కొక రుచి - పుర్రె కొక్కొక - బుద్ధి ;
మంచి కవితకు కొల మాన మేది?
కాని - సద్విమర్శ - పూని - తూకము వేయు,
వింగడించి కొన్ని విలువ లెన్ని.

వేయ వచ్చు మెడను విరి దండ ఒకసారి
సత్కరింప వచ్చు శాలువాల,
కట్ట బెట్టి పదవి కడుపు నింపెడు వారు,
కలరె ? లోక మందు కవుల గాంచి.

వంద చాటువులను వల్లె వేసిన చాలు,
పండితుడగు ఈ ప్రపంచ మందు;
బ్రదుకు లోని నీతి పాఠాల సారమ్ము
పద్య మందు పొందు పరచ బడియె.

ప్రౌఢ కవిత లోని - పద గుంఫనము లందు;
భావ నిర్ఝరీ ప్రవాహ మందు;
వ్యంగ్య వాచ్య వాఙ్మయానుషంగము నందు,
శ్రుతులు గతులు లయలు జతులు గలవు.

పనికి రాదు - ముసలి తనము నాట్యము లోన,
యౌవనమ్ము - నృత్య జీవ నాడి !!
సన్న నడుము - విపుల జఘన కైవారమ్ము,
కలియ వలయు వాలు గనుల తోడ,

ఎగిరి గాన విద్య - గగన రోదసి చేరి,
తిరిగుచుండ గలదు- ధరణి చుట్టు ;
గానమునకు - అరయ - కవనమ్ము రాకెట్టు!
కవిత లేక - గాన కళయె లేదు.

"ఆటవెలది" లోని యమకమ్ము గమకమ్ము,
తేట తెలుగు నుడుల తియ్యదనము,
హొయలు - లయలు - నడలు నొయ్యారముల్ - వడుల్
వీను దోయి కెపుడు విందు గొలుపు.

భూమి మీద - మనిషి - ఏ మూలలో ఉన్న,
మాతృ భాష పైన - మమత ఉండు;
తెలుగు పద్య విద్య - దేదీప్యమానమై,
వెలుగు వెల్లి విరియు - విశ్వ మెల్ల.

తీర్చి దిద్దు - "డోలు" - దేవ దుందిభి మ్రోత ,
గగురు పొడువ దిగ్ దిగంతరములు!
సామగాన శైలి - సన్నాయి రవళిలో,
తాళ బిందు లయలు తాండ వించు.

పద్య పఠన మందు - పగ్గాలు కళ్లాలు
ఆపగలుగు శక్తి - అవసరమ్ము,
త్రిప్పకుండ గుక్క అప్పుడెప్పుట తప్పు,
గొంతు చించు కొనుట కూడ దెపుడు.

దండ యాత్ర - సలుపు దళిత సాహిత్యమ్ము,
కత్తి విడిచి పెట్టి - కలము పట్టి,
అంతరించు గాక - అన్యాయ మిక కొంత,
నోరు వచ్చె - మూగ వారి కిపుడు.

పనికి రాదు - కవికి వాగు డేమాత్రమ్ము!
అవసరమ్ము - మేటి ధ్యాన నిష్ఠ;
ప్రతి దినమ్ము నందు - పాటింపవలె - కవుల్;
కోరి - మూగ నోము - కొంత సేపు.

కవిత వలన గాక.. గాత్ర మాధురి చేత,
ఊపి వేయ వచ్చు - ఒకడు సభను,
మెదడు విప్ప జేయు - మేటి ఆలోచనల్!
క్రొత్త వెలుగు హృదికి కూర్చ గలవు.

నృత్య నాటకమ్ము - ఇతి వృత్త సుభగమ్ము,
కోమల మృదు భావ గుంఫితమ్ము;
నింగి నేల కలుపు సంగీత రస కళా,
తరళ విశ్వరూప దర్శనమ్ము.

కోరు కొనను నేను - దూరదర్శనములో,
నా కవనము తరచు నాట్యమాడ,
చెట్టు క్రింద చిమ్మ చీకట్లలో చేరి,
నెమరు వేసు కొనుత - అమృత హృదుడు.

చెప్ప వచ్చు - కవులు - శృంగార కవనముల్,
పెదవి దొరకు వరకు - హృదులు పొంగి,
దొరకు వరకు పూలు - తుమ్మెదల్ రొదచేయు,
మౌన మొప్ప పిదప తేనె లాను.

పద్యమునకు మరల ప్రాణాలు పోశారు,
నాటకాల నాడి నటులు నేడు,
మారు మూల పల్లెటూరులో ప్రజగూడ,
మధుర పద్య కవిత మరగినారు.

బృంద వాద్య ఘోష -వినిపింప రాదయా,
కంఠ మధురిమమును - కప్పి వేసి;
గాన విద్య -కవన గాంభీర్య గరిమమ్ము,
కురియు గాక - శ్రోత గుండె యందు,

శబ్దములకు ఉన్న శక్తి అత్యల్పమే !!
గొప్ప కవులు - "ధ్వనులు" కూర్చగలరు:
సిద్ధ హస్తు డైన - చిత్ర కారుని 'గీత',
వేయి ధ్వనుల కంటె - విలువ గలది.

ఏటి నీటి మునుగ - ఏపాటి శుచి గల్గు ?
ఎడద కిలుము మురికి ఎట్లు పోవు ?
శౌచ పారమితము - సంగీత సాహితుల్,
భావితాంతరాత్మ- పరగ జేయు.

పృధివి మీద పుట్ట డే కళాకారుండు,
సహజ మైన దివ్య శక్తి లేక;
కాన - చెడ్డవాడు కాలేడు - కారాదు,
కోరి కూర్చు కొనుత - గొప్పదనము.

ఔషధాలు కూర్చ వాయురారోగ్యముల్,
ఎట్లు బాగు పడును ? ఎడద - మెదడు ??
వినిన మేలు కలుగు - విమల సంగీతమ్ము,
మనసు బాగు చేయు మంచి పనులు.

అవని యందు - రసము యన్నిష్ఠ పాత్రమ్ము,
కాడు వక్త కాడు - కాడు నటుడు;
సహృదయ హృదయమ్ము స్థానమ్ము రసముకే,
స్థాయి భావమునకు జన్మ భూమి.

సామ రాగ లహరి సంగీత కళ లోన,
కరిగి - లోన పొంగి పొరలి పారు;
కవన గానములకు జ్ఞాన యోగము చేర,
గుండె- "రస సమాధి "- కూర్చు కొనును,

ఎడద కరుగ జేయు ఏకైక రస మేది ?
కావ్య జగతి యందు కరుణ తప్ప ?
పొందు మనుజా - డిహము నందె - జీవన్ముక్తి,
కలియ హాస్య రసము కరుణ తోడ.

కవిత -శిల్ప చిత్ర గాన విన్యాసముల్;
క్షాళనమ్ము చేయ గలవు - హృదిని,
తీర్చి దిద్ద గలవు - దివ్య సంస్కారమ్ము,
అమృత యోగ సిద్ధి నవఘళించి,

అచ్చు వేయు టనిన - అమిత ప్రయాసయే!
చేయ వలసి వచ్చు - దొడ్డ వ్యయము;
కవులు - ఇంక మీద - కాసెట్లు నిర్మింప,
సులువు- చౌక యగును - శుభము -మేలు.

రంగు గ్రుడ్డి దనము - బ్రతుకులో సరిగాదు,
లోప ముండ రాదు - చూపు నందు,
ప్రతిభ -ప్రతిఫలించు పద్యమ్ము గొప్ప దే,
గద్య మందు గొప్ప కవిత కలదు.

కర్మ వీరు డెవడు ? కవి కన్న బిడ్డడే,
కత్తి కన్న వాడి గలది - కలము;
మెదడు లేక - చెయ్యి కదలునా సుంతైన?
తలపు - ఎల్ల పనుల తల్లి సుమ్ము.

సత్య సూక్ష్మ గతులు - నిత్య సాపేక్షముల్,
కట్టు కథలు రక్తి కట్ట గలవు,
ప్రౌఢ రచన దాగు - గూఢ సారస్యముల్,
వ్యంగ్య కవిత లోని వైభవమ్ము,

అనియత యతి కూర్చ అఖిల పాదము లందు,
పద్యముల జిగి బిగి పరిఢవిల్లు;
ఛందమునకు అపర సామ గానము తోడ,
జటిల భావ ఝటితి - సంధి చేయు.

చిత్ర లేఖనమ్ము -సృష్టి సౌందర్యమ్ము,
లోపములను దిద్ది చూప గలదు;
టేకు పలక మీద - టెంకాయ పెంకుపై,
ప్రత్తి నూలు నేత బట్ట పైన.
రంగరించి - మౌన సంగీత రస రేఖ
శిల్ప కళకు రంగు చేర్చి దిద్ది,
కవన మూర్తులకును - కల్పించు రూపమ్ము,
చిత్రలేఖనమ్ము చిన్మయమ్ము,
ప్రకృతి అంద లేని వర్ణ సాంగత్యమ్ము,
కవిత - చూప లేని -కారయిత్రి,
భావనా విలాస లావణ్య సంక్రాంతి,
చిత్రలేఖనము - చిందు - లాడు.

మనిషి - చూడ దగును మాన సారోగ్యము,
చేయ దగును దేహ చింత పిదప;
"రసము" -మానసమును - ప్రక్షాళనము చేసి
"బుద్ధి శుద్ధి" "యోగసిద్ధి" గూర్చు.

అంతరంగ మందు - అమృతమ్ము కురిపించి,
క్షాలనమ్ము చేయ గలదు - కవిత;
తీర్చి దిద్దు - కవిత-దివ్య దీధితి పేర్చి,
సాన బట్టి మనుజు మానసమ్ము.

వాక్కు లెల్ల - అర్ధవాద సంగ్రహములే,
"స్వస్తి" చెప్ప వచ్చు వాచ్యములకు,
వాఙ్మయమ్ము నందు - వ్యవహార సరళిలో,
మాట వెనుక దాగు మనసు నీడ.

లోక మందు పలు కళాకారు లెవరైన,
బ్రతుక నేర్ప నట్టి వారు - కారు,
విపణి లందు వారి వెల తక్కువే గదా,
అరుదు - వారి విలువ నెరుగు వారు,

వదలి సిగ్గు - మనుజ హృదయ దౌర్బల్యమ్ము,
కొల్లగొట్టి ధనము గూర్చు కొనుము;
చలన చిత్ర మనిన - కళ కాదు నిజముగా,
పట్టి మాయదారి వర్తకమ్ము.

మౌన గాన సచ్చిదానంద సంక్రాంతి,
కవిత చదివి నపుడు కలుగ గలదు;
అనుభవైక వేద్యమౌ - ఆ రస స్ఫూర్తి;
పరుగు లిడు మరో ప్రపంచమునకు.

కొలువ తరము గాని గుండె లోతుల నుండి,
పొంగి - లలిత కళలు - పొరల వచ్చు;
అద్భుత మనిపించు- అంతః ప్రబోధమ్ము,
జ్ఞాన వీచికలకు - జన్మ భూమి.

ఇంద్ర ధనువు - విరియు హృదు లున్న వారలే,
కవిత లల్ల గలరు - కలలు గనుచు;
ప్రగతి కూర్చ కలదు - స్పందించు డెందమే !
కొత్త ప్రొద్దు పొడుపు కోరుకొనుచు.

సామరస్య మమరు - సంగీత కళ యందు,
తాళ రాగ లయలు తాండవించు,
నేల నింగి కలిసి, నిర్మించు సేతువుల్,
అమృత సరసి కూర్చు ఆత్మ యందు.

వీను దోయి కంటె - విశ్వాసమును గూర్చు
మనుజ జగతి లోన కనులు రెండు;
శ్రవ్య కావ్య శక్తి చాల తక్కువ సుమ్మి,
నరులు మెచ్చ గలరు - నాటకమ్ము.

కవిత - యెప్పు డంక గణితమ్ము కాలేదు,
బ్రదుకు - గణిత శాస్త్ర పరిధి దాటు;
అర్థవాద రూప మందున్న సత్యమ్ము,
వాస్తవిక జగమున - ప్రగతి గూర్చు.

కవిత - గాలి మేడ - కారాదు బ్రతుకులో!
లోతయిన పునాదు లుండవలెను;
కోర దగును మేలి క్రొత్త పాతల కూర్పు,
సామరస్య మందు - సత్య మిముడు.

అవని ఎవ్వడైన - కవి కాడు - ఋషి కాక,
క్రాంత దర్శనమ్ము- కవికి ఉండు;
జగతి మర్మ గతులు - చర్మ చక్షులు మూసి,
కాంచు సుకవి మెదడు కనులు విప్పి.

పుట్ట వచ్చు - గుండె - భూకంపములు కొన్ని,
పగుల వచ్చు అగ్ని పర్వతములు,
ఊప వచ్చు గాక ఉప్పెనల్ చెలరేగి,
కవిత వ్రాయు - సుకవి కలల తేలి.

వాణి వీణ - కృష్ణు వేణు నిక్వాణముల్,
ఉరిమి నాట్య మాడు మెరుపు తీగ,
శివుని ఢమరుకమ్ము - శింజినీ లయ జతుల్,
కలిసి - నృత్య నాటకమ్ము పుట్టె.

బ్రతుకు - రంగు రంగు పడుగు పేకల నేత,
వెలుగు చీకటులకు వింత మెలితి,
లలిత కళలు - బ్రతుకు వెలుగు క్రీనీడలే,
మనిషి మెదడు - సృష్టి మహిమ కాత్మ.

కవిత - మంచి దైన - కంఠస్థమై నిల్చు,
చాలు ఒక్కసారి చదివి నపుడు;
వినిన -ఒక్క సారి - మనసు లోపల దూరి,
నాట్య మాడు - కవిత - నాల్క పైన.

చాలు - క్షణ సమాధి - సాహితీ స్నానమ్ము,
మనసు మలిన మెల్ల మణగి - తొలగు;
మెరయు గాత - గుండె - స్థిర తటిల్లతలతో;
సహన దీప్తి తోడ - శాంతి తోడ.

నాట్య మాడు - జగతి - నవనవోన్మేషమ్ము,
పాత చింతకాయ పచ్చ డేల ?
వ్రాయ వలెను క్రొత్త పద్యాలు కవి వరుల్;
క్రొత్త "భావయిత్రి" కూర్చుకొనుచు.

ప్రాకృత కవనమ్ము- ప్రజల గుండెల లోన,
మురళి రవళి వోలె మ్రోగి సాగె;
సంస్కృత కవనమ్ము - సంగ్రామ భేరియై,
దద్దరిల్ల జేసె ధాత్రి నెల్ల.

ఉత్తముండు - భర్త - ఉద్యోగియౌ వాడు
సతికి దొరుకు నెడల చాల మేలు;
జగతి యందు - బ్రతుకు - స్వచ్ఛంద దాసియై,
కుదురుకున్న యెడల కొలువు లోన,

వేదము నాద ప్రధానము,
నాదము భావోత్తరము మనసున సదా సూ,
ర్యోదయ సుషమా శోభా
భేదాధ్యవసాయము ప్రభవింపగ జేయున్.

సరస కవిత యన్న - సంగీత కళ యన్న,
వ్యంగ్య మన్న - లలిత హాస్య మన్న,
అవని విముఖు లున్న - అదియె వారికి శిక్ష!
వేరు శిక్ష ఇంక వేయ నేల ?

కవిత - మూల్గ రాదు - గ్రంథాలయాలలో,
నలగ వలెను ప్రజల నాల్క లందు,
పదము లందు పొదిగి - పది మంది అనుభూతి,
పద్య మందు - సుకవి - వ్రాయ గలడు;

యతులు ప్రాసగతుల - యమకమ్ము గమకమ్ము,
అల్లిక జిగి బిగులు వెల్లివిరియు,
జంత్ర బృందరవము - సమకూర్చ ఛందస్సు,
దెసల మ్రోగు గాత - తెలుగు కవిత.

కాదు - కవిత యనిన - కాదయా ఛందస్సు!
భావయిత్రి మెరపు తీవె గాని;
అరయ - భాష - ఛంద మాహార్య మాత్రముల్,
ప్రతిభ - కవిత కంతరాత్మ సుమ్ము.

వరుస మ్రోయు నట్టి వాద్య బృందవమ్ము,
చిందు నట్టి నాద బిందు కళలు,
లలిత రాగ భావ లయల విన్యాసముల్,
గాత్ర గాన మందు కాన రావు.

నాల్క- కావకాయ - నవ రసోల్లాసమ్ము,
ప్రతిభ కాట పట్టు - పద్య విద్య;
బ్రతుక లేడు - తెలుగు వాడు - పద్యము వీడి,
ఆవకాయ విడిచి అవని యందు,

సాహితీ రచనకు - సరిపోదు ఛందస్సు!
కవిత - నాద బిందు కళలు కోరు!
కవిత - భాష కాదు -గణ నియంత్రణ కాదు!
భావ మందు ఉండ వలెను - లయలు.

కవిత - అక్షరాల గారడీ కారాదు,
తుదకు బిచ్చమెత్తి బ్రదుక రాదు;
కవి వరుండు దివ్య కర్పూర ధూపమై,
వెలుగు తావి వెల్లి విరియు గాత.

కవిత వ్రాయు నట్టి - కలము కంటెను గూడ,
కరుణ చూపు నట్టి-కరము మిన్న;
కరుణ చూప దగును కష్టజీవుల పైన,
కాగితాలు ముడిచి - కవి వరుండు.

పూజ చేయ వచ్చు - భూరి దానము నిచ్చి,
సహృదయుండు కవికి సభలు జరిపి,
కోరి వెన్నెల గుడి - గుండె లోపల కట్టి,
ఎవడు నెరపు ? నిత్య కవన సేవ.

ఈ ప్రపంచ మందు - ఏ భాషకును లేదు,
భావయిత్రి - వ్యక్త పరచు శక్తి;
ఛంద మవసరమ్ము - ఛందస్సు సరిపోదు,
కూర్చవలె నటన్న - గొప్ప కవిత.

సూక్ష్మమానసమున - సుప్త చైతన్యాన
కవిత - దాగి యుండ గలదు - తరచు;
గుప్త పరిధి విడిచి - జ్ఞప్తి స్థితికి చేరు;
బుడగ - నీటి పైకి వెడలు నట్లు.

సామ వేద రవము - ఛందస్సులో దాగి
కూర్చు రస నిషద్య గుండె లోన,
సరిగమపదనిసలు - సాహిత్యమున గూడ,
గుర్తు పట్ట వచ్చు - కోవిదుండు.

అర్థమున కతీతమౌ నాద సంక్రాంతి,
కవన శిల్పమునకు అవసరమ్మొ,
కవనమునకు - సహజ కవచ కుండల దీప్తి
యతులు - ప్రాసనియతి జతులు కూర్పు,

ఛంద మందు కలవు - సంగీత నాదముల్!
పొంగు - రస ధునీ తరంగ లయలు,
నాద బిందు కళలు! నవనవోన్మేషముల్
అక్షయాక్షరామృతానుపూర్వి.

ఛందము సరిదిద్దు - శబ్దార్థ లోపముల్
పొందు పరచి నాద బిందు కళలు ;
గుండె-రేయి పవలు - కురిపించు అమృతమ్మొ,
లాస్య మాడ ప్రాస లయలు - వడులు.

జనగణమన పాట - జాతీయ గీతమా ??
గాన నాద బిందు కళలు లేవు !
స్థాయి లేదు - భారతీయ సంస్కృతి లేదు,
కవన కింకిణీక రవము లేదు.

నవల విక్రమించి - నవ నవో న్మేషమై,
చరిత త్రోసి వేసి - వరలు గాథ;
సహృదయులకు - విశ్వ సాహితీ నటరాజ
నాట్య రంగ మయ్యే - నవల-నేడు.

భాష - కూర్పు వలయు భావానుగుణముగా,
అర్థ జతుల గతుల కనుగుణముగ,
నవ రస రుచిరమ్ము - కవన వైవిధ్యమ్ము,
కానుపింప వలెను - గ్రంథ మందు.

గాలి లోన -తేల గలుగుటే - నృత్యమ్ము,
అవని విడిచి చేయు నట్టి సాము!
ఆడు బాతు గాదు - హంసయే అభినేత్రి!
ఈత కొట్టరాదు - ఎగురు గాత.

కనుల ముందు నింపు - కమనీయ రూపమ్ము;
కుంచె కలము కంటె గొప్ప దగును,
చిత్ర లేఖనమ్ము - జీవ చైతన్యమ్ము,
పొంగువార చేయు రంగు లందు,

మెలగు నెడల - మనిషి తెలివి తేటల తోడ,
ముచ్చ టగును చూడ మురిప మగును;
కలియ మంచితనము - తెలివి తేటల తోడ,
అంత కంటె శోభ - అవని గలదె ?

వెడలి -నృత్య విద్య - వినువీథి విహరించి,
ఎల్ల లెల్ల దాటి ఎగురు గాత;
ఈత కొట్ట నేల- పాత కోనేరులో ?
ఆమె బాతు గాక - హంస యగుత.

అచ్చు మైన కవులు - చచ్చిపోయిన గాని,
పుడమి మీద కీర్తి పడయ లేరు!
సహృదయుండు - గొప్ప సజ్జనుం డెవ్వడో,
బ్రతికి యున్న కవికి భక్తి - చూపు.

కవన పఠనమునకు కలిసెనా - రాగముల్,
నింగి చుక్క లదరి - నేల రాలు;
సంతసింప గలరు - సభ లోని జను లెల్ల;
శిరము లూప గలరు పరవశించి

వేడ్క - చదువ దగును - విశ్రాంతిగా ఇంట
కవిత - వినదగినది కాదు - సభల,
శ్రద్ధ తోడ కవిత చదువ రెండవ సారి,
గోచరింప వచ్చు - క్రొత్త వెలుగు.

వ్రాయు నెడల - జీవ భాషల కనవమ్మ,
బ్రదుకు ప్రతిఫలింప - రక్తి కట్టు,
నాట్య మాడ కవిత - నరుల నాల్కల పైన,
వ్యాకరణ సమీక్ష అనవసరము.

కవిత - గహన హృదయ గగనాంత రాళాన,
వేడ్క గొలుపు వింత పేల్పు విల్లు;
అనుభవైక వేద్య మా రమ్య దృశ్యమ్మ !
స్పర్శ సుఖము గాదు సంగ్రహింప.

కవన విశ్వరూప మెవరు గాంచగ లేరు,
తోలు కన్ను దోయి తోడ నెపుడు !
"పదము" డొక్క చీల్చి - హృదయ నేత్రము విప్ప,
గోచరించు లోని గొప్ప దనము.

కలలు గనెడు వాడు - కర్మ యోగికి తండ్రి,
స్వప్నములకు - జనని - సాహసమ్ము;
అవతరించు రేపు ఆచరించెడువాడు
జయము దిగ్విజయము స్వప్నములకు.

మొదట వాగు - పెద్ద పదవి వచ్చిన వేళ,
పిదప గుల్ల కొట్టి నిదుర వోవు;
సంఘ మందు నగ్న సత్యాలు గుర్తించి;
లోక మేలు కోనును తోక ముడిచి.

బోధి చెట్టు - తెలుగు భూమిపై పద్యమ్ము;
గుండె లందు పెరుగు గుడుల యందు;
వాడ వాడ పెరుగు - మేడ గోడల మీద;
గుడిపె ప్రక్క మురికి గుంత చెంత.

కప్పి వేయ లేదు గద మనో నేత్రాల
జబ్బు సోకి చర్మ చక్షువుల;
కనులు లేక కాంచు - కాంతి రింఛోళియే
కవిత అనగ చెల్లు - అవని యందు

బ్రహ్మ విష్ణు వీశ్వరములు సంకేతముల్!
ఆర్ష వాఙ్మయమున వ్యంజనములు!
అట్లె దేవ గణము లౌపచారికములే;
కవి సమయముల వలె కానుపించు.

"విస్తరించినాను వెలుగు నల్ దెసలలో"
క్రొవ్వి పలికె నొక్క క్రొవ్వు వత్తి;
వీచె తలుపు లదర వెనువెంట పెను గాలి!
అంత క్రొవ్వు వత్తి ఆరిపోయె.

కుంటి కవికి ఇంట కూర్చి ఆతిథ్యమ్ము;
అడుగ రాదు నాట్య మాడు మంచు;
ఎదుటి వాని - ప్రజ్ఞ - వెదకి పట్టుట మేలు
ఏడిపించ నేల ఎవరి నైన ?

కవిత - చదువు నపుడు - కవిత - వ్రాసెడి వేళ,
మనసు మరొక లోకమునకు చేరు;
మానవుండు ! సచ్చిదానందమును పొందు
ఐహిక పరితాప మణగి పోవు.

సహృదయ హృదయమున - సమకూర్చు వలె -వెల్గు,
సాహితీ రచనలు సత్వరముగ;
గుండె లోన దాగు - గుడ్లగూబల తోలి!
క్రొత్త ప్రొద్దు పొడుపు కూర్చు - కవిత.

చిత్ర పటము నందు - శిల్ప విగ్రహ మందు,
కవి హృదయము నెటుల గాంచ నగును ?
కాంచ గోరు నెడల - కవి విరాడ్రూపమ్మ,
సహృదయుండు - కవిత - చదువ వలెను.

కలుగు నాకు రోత -కలియుగమ్మును గాంచ,
కలలు గాంచ తృప్తి కలుగు చుండు;
పడును నరక బాధ పుడమిపై మనుజుండు
పసిడి కలలు లేని బ్రతుకు నందు.

ఉండ వచ్చు కొంత స్వోత్కర్ష కవులలో,
కొంత అందు నిజము కూడ ఉండు,
గొప్ప ప్రతిభ తరచు గుర్తింప బడకున్న,
విడుచు ఎదురు తిరిగి వినయ గుణము

స్తుత మతి యైన ఆంధ్ర కవి ధూర్జటి పల్కుల కేల గల్గె - ఈ
అతులిత మాధురీ మహిమ ? అర్థము శబ్దము సంవదించుచో,
అతని కవిత్వ మెత్తునకు ఆకసముం బురుడించు! లోతు స మ్మితము
మహార్ణవంబునకు మించులు నింపు కవీంద్రు డాతడే.

ఏది గగనమ్ము మించెడి యెత్తు గలది ?
ఏది కడలి కంటె హెచ్చు లోతు ?
ఏది కాల వాహిని కెదు రీది నిలుచు ??
ధూర్జటి కవితలకు స్తుతులు నతులు.

రసము కూర్చు అంతరంగ శుద్ధిని దిద్ది,
వెల్లి విరియ జేసి - వెలుగు జిలుగు,
సానుభూతి తీర్చు - మానస స్నానమే,
లలిత కళల కెల్ల లక్ష్య మగుత.

బ్రదుకు లోన రుచిర బాహ్య శౌచము తోడ,
అంతరంగ శౌచ మవసరమ్ము;
బుద్ధి - అంతరాత్మ పొరల లోపలి పొరల్
చేయ బడును కవిత చేత - శుద్ధి.

మనసు మడత లందు - మాలిన్యములు పెక్కు!
ప్రతి దినమ్ము చేరు బ్రదుకు నందు;
కడిగి వేయ గలదు - కవితా రసము దూరి,
మనసు పొరల నున్న మలినములను.

చిత్రలేఖనమున - సృష్టి సౌందర్యమ్ము,
కొంత మేర వరకు గోచరించు;
సహృదయుండు ; పొందు సచ్చిదానందమ్ము,
అనుభవింప ప్రకృతి అంద మరసి.

కాదు - గొప్పవాడు - కవిత వ్రాసిన మాత్ర
కుక్షి నింప వచ్చు - అక్షరాలు;
బ్రదుకు లోతు లెల్ల - చదువ గల్గిన వాడు,
బాగు పడును పరుల బాగు చేయు.

కవిత లెన్ని కలిసె - కాల గర్భమునందు,
నిలిచి యున్న వెన్ని ? నేల మీద;
కవిత లన్న అవియె - అవి చిరంజీవముల్ !
అమృత బిందు తుందిలములు సుమ్ము.

గుండె లోన - వెలుగు - గూడు కట్టెడి శక్తి
కలదు నాదమునకు గాన మందు,
రాగ తాళ లయల ప్రస్తారముల యందు,
రస తరంగిణీ విలసన మమరు.

అల్ప గాయకుండు యాచకుండగుచుండు,
జనులు చేరు నట్టి స్థలము లందు,
కవి -పరోపజీవి కారాదు జగతిలో
బ్రదుక - బిచ్చ మెత్తరాదు - కళలు.

అమృత కవిత పుట్టు అనుభూతివల్లనే
ప్రాణ నాడి - రచన కనుభవమ్ము;
ప్రతిభ కాదు - కాదు పాండితీ గరిమమ్ము,
భావయిత్రి కాదు - భాష కాదు.

కనులు మూసి - గాలి మేడలు కట్టు
అప్రయోజకుడయినట్టి - కవియె !
కవికి ధనము నిచ్చు కార్యశూరుడు దాత;
త్యాగయోగి యెవడు దాత తప్ప ?

మైల లెల్ల - మనుజా మానసమ్మున నుండి,
కడగి వేయ గలదు - కవన లహరి,
సాక్షి - కవి వరుండు - సన్న్యాసి మనసులో,
అవని లోన - జీవ యాత్ర యందు,

వాహనాల కొరకు - వ్యయము చేయగ వచ్చు;
కూర్చ వచ్చు ముండ కొరకు మేడ;
సలుప వచ్చు వ్యయము సంసార రక్షకై;
కవికి ధనము నిచ్చు దాత - అరుదు.

జగతి - బ్రదికి యుండి - సమకాలికుల లోన,
కవి వరుండు కీర్తి గాంచ లేడు;
కాలమునకు అతని కవనమ్ము లెదు రీది,
శాశ్వతముగ బ్రదుకు జగతి యందు,

వాక్కు - మనుజ జగతి - పరిణామ గతి లోన,
శ్రేష్ఠ తమము - సర్వ సృష్టి యందు ;
కవిత - మనుజ వాగ్వికాస వ్యతీహార
చిద్విలాస మందు - శ్రేష్ఠ తమము.

ఎంచ -మనిషి బ్రదుకు -ఎండమావుల వేట.
వెలుగు నీడ ఆట విడుపు తోట;
లలిత కళలు విద్యలకును - శోధన నాళి,
సకల సంగరముల - సత్ర సంధి.

బ్రదుకు - ధనము హెచ్చి - పాడౌను తరచుగా!
బండ బారు నరుని గుండె కాయ,
పాడు వడును కవిత పాండిత్య మెక్కువై!
చదువు ప్రజలు లేక జగతి యందు.

కాను పించ వచ్చు - కాంత - వాక్కుల లోన;
కాన నగును - ప్రౌఢ కవన మందు;
కొంత వింత యైన - అంతరార్థము గూడ,
విజ్ఞు లైనవారు - వెదకి చూడ.

సాంధ్య వర్ణ రాగ శబల వైపుల్యమ్ము;
చిత్రలేఖనమున - చిందు లాడు;
మాట లాడ గలవు - మౌన మాధురులతో
పొంగ జేసి హృదుల - రంగు లెల్ల,

వివిధ వర్ణ భేద విన్యాస నిష్పత్తి
చిత్ర కళకు శోభ చేర్చ వచ్చు;
వస్త్ర ధారణమున - వర్ణ బాహుళ్యమ్ము,
ప్రతఫలించు జేయు - బాల్య హృదిని.

చదువ - నీతి కవిత - చాల మంచిది సుమ్ము;
అంత కంటె మేలు ఆచరణము,
జనులలో తిరిగి - ప్రచారమ్ము సల్పుచో,
ఉత్తమోత్తమమ్ము - ఉజ్జ్వలమ్ము.

కలుగ జేయ గలవు - కవన సంగీతముల్,
విలువ కట్ట లేని వెలుగు తళుకు !
వెలుగు చేర గలదు - విశ్వ మంతటి లోన,
అరలు దూరి మనసు పొరలు దూరి.

సగటు మా ఎవుండు - సంసార యాత్రలో
అల్ప విషయములనె అవఘళించు;
కవిత - సర్వదా జగద్ధితవ్రతమౌట
లేదు - స్వల్ప విషయ మేది - కవికి.

ఎపుడు కవికి ఎవ్వ రేమి ఇచ్చిన గాని
సంతసింతు నా కొసంగి నట్లె !
ఎపుడు మబ్బు కురియ - ఏ పొలమ్మున గాని
చల్లబడును - మనసు - శాంతి నొందు.

వెల్లి విరియు గాత - పల్లె పల్లెల గూడ
తెలుగు పద్య కవిత తియ్యదనము;
తెలుగు వెలుగు తళుకు దేదీప్యమానమై,
దీప్తి నింపు గాత దెసల కొసల.

కవిత - సహృదయుండు - కంఠస్థ మొనరింప,
సార్థక మయి సుకవి జన్మ వరలు;
లాభ మేమి ? ఏ అలంకార శాస్త్రమ్ము ??
గొప్ప గీటు రాయి - గుండెకాయ.

కవన వాక్కు కాదు - వ్యావహారిక భాష;
దూక గలవు - నుడులు - ప్రాక గలవు;
కడలి నీదు కొన్ని గగనాన విహరించు,
కొన్ని దూర గలవు గుండె లందు.

ఛంద మందు - దాగు సాహిత్తిక శ్రుతి లయల్,
చిందు లాడు - నాద బిందు కళలు;
ధ్వనులు కల రవములు - వ్యంజనల్ ప్రాసముల్,
బృంద జంత్ర వాద్య బృంహితములు.

కవికి - మేటి కలము కంటె - జీవితములో,
ఉండ వలెను మేలి గుండె కాయ;
కమ్మ నైన బ్రదుకు - కమనీయ కవితతో,
కలిసి నపుడు - కలము విలువ - పెరుగు.

కూర్చ వచ్చు - కవిత - కూత కోతలు చేర్చి,
గడుప మంచి బ్రదుకు - కష్ట మగును,
సాహితీ తపస్వి - సంస్కారి యైనచో !
తర తరాలు పండు పరిమళములు.

తోలు కనులు - భావి కాలమ్ము గాంచునా ?
క్రాంతదర్శి చూడ గలడు గాని,
సాటివాని ఘనత - సాహితీ జగతిలో
చాటి చెప్ప గలడు - సహృదయుండే.

ఆ సరస్వతి తుల - వేసి తూచుట మేలు,
సరస పద్య మొకటి చాలు చాలు;
శత సహస్ర కావ్య సమముగా సరిపోలు,
వాసి నరయ వలెను - రాసి కాదు.

బొగ్గు గనులు తోచు పుడమిపై ఒక చోట;
మణులు దొరకు ధరణి మరొక చోట;
విశ్వ శిల్ప గూఢ విన్యాస మటు లుండు !
అట్లె కవిత అవని అవతరించు.

సగటు మనిషి కోరు - ప్రగతి కోసము కాక,
కవిత - అచ్చు వేయు టెవరి కొరకు ?
అందరకు సులువుగ - అర్థమై కవనమ్ము,
వేయ వలెను క్రొత్త వెలుగు బాట.

స్రష్ట పైన అరయ వ్యాఖ్యానమే గదా,
కవిత యన్న చిత్రకళ యటన్న;
కళ - స హృదయులకును - కలిగించు యోజనల్,
మెదడు నెడద కుదిపి - మేలు కొలిపి.

కవి హృదయము మేలు - కలము కంటెను గూడ,
చేత - చూడ దగును - వ్రాత గాదు;
కలము వెనుక నుండు - కరుణార్ద్ర హృదయమే,
చేర్చు కవిని స్వర్గ సీమ లోకి.

తెలుగు వచన కవిత - జలపాత సదృశమ్ము!
పద్య కవిత పెద్ద పాత చెరువు;
గేయ కవిత - శ్రవణ పేయమై వినుపించు;
అమృత వర్ష మగుచు హాయి గొలిపి.

మింట మెరపు తీగ - మిరుమిట్లతో వెల్గు;
గుర్తు పట్ట లేడు - గ్రుడ్డి వాడు;
క్రాంత దృష్టి లేక - కవిత లోపలి వెల్గు;
ఎట్లు గుర్తు పట్టు - ఎవ్వ డైన ?

మంచి కవిత యనిన మాట మూటలె కదా ?
మంచి మనిషి యనిన మంచి పనులు !!
మంచి మనిషి మేలు - మంచి కావ్యము కంటె;
పెంచు కొనుత - సుకవి - మంచితనము.

కవిత వ్రాయ లేడు - కడుపు నిండినవాడు
కరగి నట్టి గుండె కవిత యౌను;
కానుపించు కవిత కన్నీటి జల్లులో
ఇంపు సొంపు లొలుకు ఇంద్ర ధనువు.

వచ్చె -శ్లోక కవిత - వాల్మీకి ఋషి నోట!
క్రౌంచ పక్షి హత్య గాంచి నంత;
కరగి నట్టి గుండె కలవాడు కవి యౌను;
తక్షణమ్ము క్రాంతదర్శి యగును.

ఉండు - యతియు ప్రాస - రెండు రెక్కల వోలె,
గగన సీమ పద్య కవిత - యెగురు;
వచన కవిత ఉష్ట్ర పక్షి వంటిది గదా !
పుడమి మీద వేగ నడువ గలదు.

పద్యములను వ్రాయు వారినే కవు లంచు,
ఎంచ నేల ? గౌరవించ నేల ?
కలవు - నవల - వచన కవితలున్ కథానికల్
అమృత గేయ వాఙ్మయమ్ము కలదు.

తరచ వలెన్ సనాతన విధానము లెల్ల-చరిత్ర దృష్టితో
ధరణి-యుగాంతరాల వివిధ స్థల భేదముచే - సదా ప్రజా
చరణము మారుచుండు - సువిశాల సమాజములో వివేకియై
నరుడు చరింపగా వలె - క్షణ క్షణముల్ నవ ధర్మ సూక్ష్మముల్

జనులు మెదడు వాడు శాతమ్ము తక్కువే,
నరుల యందు జంతు పరిధి హెచ్చు;
లలిత కళలు చదువు - తెలివి తేటలు గూర్చి
పెంచు గాత - మనుజా మంచితనము.

కవిత - దట్ట మైన గడ్డ మీగడ కాదు
పెరుగు తరచ - వచ్చు - వెన్న - కవిత !
కలము -కదుప వలెను కవ్వమ్ము వలె - సదా;
బరువు లేని గొప్ప బలము - వెన్న.

పరుల కష్టములను - బాపు సామర్థ్యమ్ము;
ఈ ప్రపంచ మందు ఎవని కుండు ?
గట్టి గుండె తోడ - కడగండ్ల నన్నింటి
ఒర్పు కొనెడి బోధ - కవిత - కూర్పు.

హృదయము మొదట పువు వోలె వికసించు;
పిదప వాడి, తోచు పిందె వోలె !
కానుపించు కవిత కాయగా పండుగా;
క్రుళ్లి పోయి కంపు గొట్టకుండ.

నుడి జిగి బిగి ఒక మనోజ్ఞ పద్యము! చాలు
వేత్త లెల్ల - నెమరు వేసు కొనగ;
అర్థ పటిమ - ఆడు- ఆసహస్రారమ్ము;
వేయి పడగ లెత్తి వెలుగు లీని,

అరయ - జీవితమున - వ్యాఖ్యాత వేరయా !
సూత్ర కర్త జాడ -చూడ - వేరు !!
ప్రతిభ విప్పి చూపు - భాష్య కారుడు వేరు!
కవి వరుండు - కావ్య కర్త వేరు.

అలతి అలతి తేట తెలుగు మాటల తోడ
సులువు గాదు "ఆటవెలది" వ్రాయ,
బరువు తక్కువ మరి - బలము హెచ్చుగ నుండు
మణుల మలచ వలయు మందిరములు.

గండ పెండెరముల -కనకాభిషేకాల
మణుల -వాహనాల - మౌక్తికముల,
సత్కరించినారు - సహృదయ ప్రభు వరుల్ !
దెసలు పులకరింప తెలుగు కవుల.

మేలి వెలుగు - కవిత - మెరపు తీగల కాంతి !
తలుపు తట్టి మేలు కొలుపు - తలపు !
నాట్య మాడ గలదు - నాద విన్యాసమ్ము;
అరయ - కవిత అనిన - స్థిర తటిత్తు.

ఆకసమున కెగురు - అవ్వాయి చువ్వయా ?
కంచు ఢక్క మ్రోత - కవిత కాదు,
శబ్ద గళము కూర్చు - సన్నాయి నొక్కులా ?
గుండె వెడలు చిరుత ఘోష - కవిత.

పరిఢవిల్లు గాత - పాకమ్ము తూకమ్ము;
కారయిత్రి శిల్ప గహ్వరముల,
భావయిత్రి యందు - ప్రవహించి శ్రుతి లయల్;
అలల వోలె - నాట్య మాడు గాత.

అవని మీద కురియు - ధ్రువ తార కాంతియే !
అలతి అలతి చిరుత వెలుగు - కవిత;
వీనులు కను లున్న - విన వచ్చు - కన వచ్చు,
సహృదయుండు వెలుగు సవ్వడులను.

నిత్య నూతనముగ - నీతి ప్రబోధమ్ము,
కూర్చు కవిత - నరుల గుండె లందు,
సరస సులభ రీతి - సరళ సుందరముగా,
వ్యంగ్య వాక్య ఫణితి - పరిమళింప.

చలన చిత్ర మందు - సంగీత కళ లేక,
కవిత - వ్యంగ్య గరిమ - కాన బడక,
చెవులు కన్ను లున్న శవ సమాన ప్రజల్,
తృప్తి చెంద వచ్చు - పృథివి మీద.

తేనె ఆని నపుడు - తియ్యగ తియ్యగ నుండు,
త్రేన్చి నపుడు మరల తీపి పుట్టు;
కవిత చదివి నపుడు - కమ్మ కమ్మగ నుండు,
క్రమ్ము - స్మరణ మాత్ర కమ్మదనము.

"కనక కంకణమ్ము కవి కెట్లు లభియించు ? "
"అన్నపూర్ణ భార్య అయిన యెడల",
"కలము కదుపు తీర్కి కవి కెట్లు లభియించు ?"
"భార్య - బానిస వలె - పనులు చేయ".
మేలి కవిత - మేటి మేధావులే వ్రాయ
కావ్యములకు గలుగు గౌరవమ్ము;
కలిగె గౌరవమ్ము కవి కాలికిని గూడ,
వ్రాయ - కవిత కృష్ణరాయ విభుడు.

అమృత కవిత - యనిన - హంస తూలిక కాదు;
కవన జన్మ భూమి - కరగు గుండె;
కారు ముందు - ఎగుర గలుగు జెండా కాదు,
కల్కి - చేత బట్టు కత్తి - కవిత.

శత సహస్ర పత్ర సౌగంధికము వోలె,
కవిత - కమ్మ తెమ్మెర వికసించు;
అమరు సొగసు తావి కద్వైత బంధమ్ము,
అట్లె - శబ్దమునకు అర్థమునకు.

కళ - ప్రకృతికిని -అను కరణమే అన రాదు,
చూడ - కవి - నిరంకుశుండు - సుమ్ము;
కళ -యథా తథమ్ము గాని యాథార్థ్యమే;
ప్రకృతి పరిధి దాట వచ్చు - తరచు.

కవిత వ్రాయు టనిన కర్మ యోగము నాకు;
సాంధ్య వందనమ్ము - సామ గీతి;
సవన మందు వరలు - స్వాహా నినాదమ్ము !
జగతి హితము కొరకు సలుపు - వ్రతము.

కవిత - వ్రాసినాను - వివిధ శీర్షికలపై;
జ్ఞాన సామ గాన సలలితమ్ము,
కవిత - వినిన చాలు - కంఠస్థమై నిల్చు;
తరచు - నెమరు వేయ దగిన - తిండి.

సరిగమపదనిసలు - ఛందస్సు లేకున్న;
చిమ్మ చీకటి పొగ గ్రమ్మ వచ్చు,
వచన కవిత లోని - వక్రగానము చేత !
ఉప్పు గూడ ఇంక - చప్పబడును.

యుగ యుగాల వెలసియున్నారు కృతిపతుల్,
తెలుగు తల్లి గుండె పులకరింప;
జరిపినారు కవుల సత్కార సత్ క్రియల్ !
విశ్వ చరిత - తరచు విస్తు పోవ.

అనుభవాల మధ్య - ఆలోచనల తోడ,
మేటి మెదడు గలిగి మెలగె నేని,
గుండె లోన - కవిత - పండించు కొన్నచో;
అతని వాక్కు - జగతి హితము గూర్చు.

పృధివి - పుట్టుచుండు - కృష్ణరాయల అంశ,
పదవి గలిగి గొప్ప ప్రతిభ గలిగి;
వ్రాయ గలిగి యుండి - రసవత్ కవిత తాను,
కవుల నాదరింప గలుగు ఘనుడు.

విషయ విస్తరణమున - సుషమా నిదిధ్యాస,
క్రాంత దర్శనమ్ము కవికి - కూర్చు,
స్నిగ్ధ యోగ నిద్ర - సృష్టి కర్తకు వోలె,
రస సమాధి - అవసరమ్ము - కవికి.

వ్రాసి నంత - కవిత - గ్రంథ రూపము నందు
వేగిర పడి అచ్చు వేయ రాదు;
కవిత - శీఘ్రముగనె - కాల దోషము పట్టు;
ఎంత కాల మాగ - అంత మేలు.

అథాలో కవితా విద్యా,
ప్రాక్ గుప్త దాన సుక్రియా !
అనుష్ఠానాయ వేదాంతీ,
క్రియాశూరో భవేత్ కవి:

అవని ఎవ్వ డైన - కవి కాడు - ఋషి కాక,
క్రాంత దర్శనమ్ము - కవికి కలదు,
జగతి మర్మగతులు - చర్మ చక్షులు మూసి,
కాంచు - సుకవి - మెదడు కనులు విప్పి.

కవిత - సలు పవశ్య కర్తవ్య తపములే
అవతరించు కొరకు - అధినరుండు !
ప్రగతి కోరు - కవిత - పరిణామ సృష్టిలో
అధిగమించు - క్రొత్త ఆకసములు.

లోకము పోకడ తెలిపెడి
వా! కైతలు? తుమ్ము దగ్గులా కవిత - కోపో
ద్రేకములా? ఈర్ష్యాసూ
యా కలవరముల ?-అమృత గుళికలే.

అంద జేయగ - తన - అంచేతిలో - నిల్పి;
కొంత తేనె - నెవరొ - కూర్మి పేర్మి;
సత్కవీశు డంత - చంక పర్యంతమ్ము,
నాకు - హృదిని - ఆశ - నాట్యమాడ.

తెలివి యుండ గల దధిక్షేపమ్మున దాగి,
వ్యాజ నింద యందు - వ్యంగ్య సరణి,
చక్రనేమి వరీతి వక్రోక్తి - భ్రమియించు
ధ్వని అణురణన మగు - దాని యందు.

ప్రౌఢ కవిత యందు - వ్యంగ్యమ్ము - వక్రోక్తి
ధ్వని తరంగ సరళి - తాండవించు;
సాహితీ సుమములు - సంజ కెంజాయలే!
పవలు రేయి గాక పరిఢ విల్లు

కానిపించు కవిత - కలము వ్రాతల గాక
చూపు నందు - చేతి ఊపు నందు,
మించు హొయలు చిందు పంచెఅంచులయందు
నడక యందు పలుకు బడుల యందు.

నడచు కాళ్ల తోడ - పుడమిపై - "పద్యమ్ము"
ఏటి నీటి లోన ఈద గలదు,
ఎగుర గలదు వేగ - గగన వీధుల లోన,
వేత్త దృష్టిలో "త్రివిక్రమమ్ము".

వ్రాయ వచ్చు సులువు గేయమ్ము కవియైన,
కష్ట తమము వరుస కట్టు టన్న
వరుస కట్ట వలెను - భావాను గుణముగా,
గాయకునకు చాలు గాత్ర మున్న.

కవికి ఉండు-కీర్తి కండూతి తరచుగా ;
మమత వదలదతడు మైకు మీద !
స్వీయ కవిత ప్రజకు వినిపించు విసిగించు;
మౌన దీక్ష - సుకవి - పూను గాత.

రేకు రేకు నందు - సృష్టి వైచిత్రమే,
వెల్లివిరిసి తోచు విరుల యందు;
సౌరభ ప్రసార సౌందర్య సంక్రాంతి,
కవికి రస సమాధి కలుగ జేయు.

వ్రాయ వచ్చు కవిత - రచన రెండవ సారి
దిద్దు కొనుట మేలు తెలసి - సుకవి,
అరయ వచ్చు చిరుత పొరపాట్లు - కొన్నింటి,
దొరల వచ్చు పెద్ద దోషములును.

కవిత నాకు - జీవ కైవల్యమే - సదా
రస సమాధి అంతరంగమునకు,
కవిత నాకు కూర్చ గలదు జీవన్ముక్తి,
మానవతను దాటు మధురిమములు.

# నండూరి రామ కృష్ణమాచార్య
# గ్రంథములు

కవిత్రయము ( తెలుగు భాషాసమితి బహుకృతి గ్రంథము)

తారాతోరణము - పద్య కవితలు

ఛత్రపతి శివాజి - రంగస్థల నాటకం

ధర్మచక్రం - కృష్ణాపత్రికలో వారం వారం ప్రచురితం. రంగస్థల నాటకం

ఆలోచనము - రెండు వేల తెలుగు పద్యాలు

ప్రాచీన దక్షిణ భారత చరిత్ర - వచనం

ఆంధ్ర సంస్కృతి వికాసం - వచనం

కావ్యాలోకము - తెలుగు అకాడమీ ప్రచురణ

ప్రగతి గీత - పద్య కవనం

కవితా ప్రభాస - పద్య కవనం

మహాభారతం - ఆంగ్లము - తి.తి. దేవస్థానం ప్రచురణ.

గాంధీ యుగం - ఆంగ్ల వచనం.

దశ రూపకములు - పది నాటికలు

-: ప్రాప్తి స్థానం :-

నండూరి రామ కృష్ణమాచార్య
420 పి.జి. రోడ్డు జవాహర్ నగర్ సికింద్రాబాదు 500 003
ఫోన్ : 7817397

## రచయిత నందూరి రామ కృష్ణమాచార్యులపై సమీక్ష

### "పద్యానికి పెద్ద దిక్కు - నందూరి"

ఆంధ్రభూమి - వారపత్రిక పద్యారామ శీర్షిక.

ఆచార్య శ్రీ బేతవోలు రామబ్రహ్మం.

■■■■■■■■■■

అయ్యా, రామ కృష్ణమాచార్యులవారూ,

"ఆలోచనము" - ఎంత గొప్ప గ్రంథం వేయించారండీ. దీనిముద్రణకు పూనుకున్న మీ శిష్యగణం - రచయితగా మీరు ధన్యజీవులు. ఆలోచనము కావ్యాన్ని చదివే ఆంధ్రులకు - అంతకు మించిన మాకు జీవితాంతం మరువ లేని ఒక అనుభూతిని మీ రచనల ద్వారా అందించారు.

చుక్కన గంగ రాజు

కార్యదర్శి : రామరాజభూషణ పరిషత్. భీమవరం.

****** ******

నందూరాచార్యా జీ
పండుగ సమకూర్చినారు - పావన చరితుల్;
మెండుగ సాహితి సంపద
దండిగ మా కిచ్చినారు - ధన్యత చెంతన్.

శ్రీ.పి. మోహన్

నరసింహం ఫౌండేషన్ తంగెడుబిల్లి - విజయనగరం

• • • • • • •

: మీరు మా దృష్టిలో భగవత్ స్వరూపం :-

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు